
రాసేశ్వరి

డా.ఎన్.అనంత లక్ష్మి



దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

ప్రచురణ



రాసేశ్వరి

డా. ఎన్.అనంతలక్ష్మి

దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ప్రచురణ

నేరేడ్‌మెట్,

భాగ్యనగరం

రాసేశ్వరి

రచయిత	:	**డా. ఎన్. అనంతలక్ష్మి**
కాపీరైట్స్	:	ప్రచురణ కర్తవి
ప్రచురణ	:	సెప్టెంబరు 19, 2026 శ్రీ పరాభవ భాద్రపద శుద్ధ అష్టమి (రాధాష్టమి)
ప్రథమముద్రణ	:	2026
ప్రతులు	:	1000
వెల	:	**రూ.150/-**
ప్రతులకు	:	**డా. ఎన్. అనంతలక్ష్మి** రాంనగర్ గుండు, రాంనగర్, హైదరాబాద్ - 500 020. సెల్ : 99491 98141 **మరుమాముల వెంకటరమణ శర్మ** 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికిందరాబాద్-56. సెల్ : 94410 15469
టైప్ సెట్టింగ్	:	**సమంత గ్రాఫిక్స్** హైదరాబాద్. సెల్ : 98495 51462
ముద్రణ	:	**సాయి తిరుమల ప్రింటింగ్ ప్రెస్** చిక్కడపల్లి, హైదరాబాద్.



కృష్ణసఖుడు ఉద్ధవుడు

(కీ॥శే॥ పెద్దాడ ఉద్ధవ కుమార్) – స్మృతిలో

అవతరణ

రాధాకృష్ణుల పరమ పవిత్రమైన దివ్యచరిత్ర డా. ఎన్. అనంతలక్ష్మి అనే నా పరిశోధనాంశం కావడం నా పూర్వజన్మ సుకృతం. ఆ మధుర భక్తి భావనలలో నేను ఓలలాడుతున్న సమయంలో, నా సాహిత్య ప్రయాణంలో ఒక అనూహ్యమైన మలుపు ఎదురైంది. గతంలో ఎన్నో ప్రతిష్టాత్మక 'నంది' బహుమానాలను అందుకున్న ప్రముఖ రంగస్థల నటి శ్రీమతి భవాని గారు, రాధాకృష్ణుల చరిత్రను ఒక నాటక రూపంలో రచించి ఇవ్వమని నన్ను అడిగారు. నా పరిశోధనాంశమే కావడం వల్ల, ఆ వైభవాన్ని మరొక్కసారి మననం చేసుకునే అద్భుత అవకాశం లభించిందని ఎంతో సంతోషంతో, భక్తితో ఆ నాటకాన్ని రాసి ఇచ్చాను. అదొక సుదీర్ఘమైన సాహిత్య వ్యవహారంగా సాగింది.

అయితే, ఆ తర్వాత ఆ నాటక ప్రతిని వారు తమ ఇష్టానుసారంగా మార్చుకున్నారు. ఒక రచయిత్రిగా నా మూల భావనలు, పరిశోధన స్వరూపం మారడం కొంత అసంతృప్తిని కలిగించినా, ఆ పరిస్థితిలో చేసేదేమీ లేకపోయింది. కానీ, అహర్నిశలు నేను పడిన శ్రమ, నా అన్వేషణ కాలగర్భంలో కలిసిపోకూడదనే ఒకే ఒక్క సత్సంకల్పంతో – నా శ్రమకు ఒక స్థిరమైన, శాశ్వతమైన రూపం ఇవ్వాలనే 'స్వార్థం'తో – ఆ నాటకానికి నవలా రూపం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. నా ఆవేదన, ఆరాటాల నుండి పుట్టిన ఆ అక్షర రూపమే ఈ "రాసేశ్వరి" నవల.

అలా రూపుదిద్దుకున్న 'రాసేశ్వరి' చాలా కాలం పాటు వెలుగులోకి రాకుండా కేవలం నా రచనల దస్త్రాలకే పరిమితమై ఒదిగి ఉంది. ఆ సమయంలో ఆత్మీయులు, ప్రముఖులు శ్రీ దర్శనం శర్మ గారు తమ పత్రిక కోసం ఏదైనా విశిష్టమైన రచన ఇవ్వమని అడిగారు. అప్పుడు నా అంతరంగంలో దాగి ఉన్న 'రాసేశ్వరి'ని వారి చేతుల్లో పెట్టాను. అలా రాసేశ్వరి మొదటిసారి పాఠకుల ముందుకు వచ్చి, వెలుగును చూసింది.

ఇప్పుడు ఆ నవల ధారావాహికగా ముగిసి, ఒక సంపూర్ణ గ్రంథ రూపంలో పాఠకుల చేతుల్లోకి వస్తున్నందుకు నా హృదయం ఎంతో సంతోషంతో, తృప్తితో నిండిపోతోంది. ఈ నవలను నెలనెలా తమ పత్రికలో ఎంతో ఆదరంగా

ప్రచురించడమే కాకుండా, ఇప్పుడు ఎంతో శ్రమకోర్చి, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పుస్తక రూపంలోకి తీసుకువస్తున్న శ్రీ మరుమాముల వెంకట రమణ శర్మ గారికి, వారి 'దర్శనం' పత్రికా బృందానికి నా అంతరంగ పూర్వక కృతజ్ఞతలు మరియు హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ 'రాసేశ్వరి' పాఠకుల హృదయాలను రంజింప జేస్తుందని ఆశిస్తూ ...

- అనంతలక్ష్మి

ప్రస్తావన

"దర్శనమ్ పత్రిక కోసం ఏదైనా ప్రత్యేకంగా రాసి ఇవ్వండి" అని **విఖ్యాత ఆధ్యాత్మిక వేత్త , రచయిత్రి డాక్టర్ శ్రీమతి ఎన్. అనంతలక్ష్మి** గారిని ఒక సందర్భంలో కోరాను. నా మాట విన్న వెంటనే వారు ఎంతో సహజంగా – "కొత్తగా రాయడం ఎందుకు? ఇప్పటికే నేను రచించినది ఒకటి ఉంది. మీకు నచ్చితే, మీ పత్రిక స్వభావానికి సరిపోతుందని అనిపిస్తే ప్రచురించండి. రాధాదేవి చరిత్రను నవలా రూపంలో రచించాను" అని చెప్పారు. ఆ మాట విన్న క్షణమే నాలో ఆసక్తి మొదలైంది. రాధ అంటే భక్తి, రాధ అంటే ప్రేమ, రాధ అంటే శ్రీకృష్ణుని అంతరంగశక్తి. అలాంటి రాధాదేవి చరిత్రను ఆధారపూర్వకంగా, కథనాత్మకంగా చదివే అవకాశం లభించడమే ఒక అపూర్వమైన అనుభూతిగా భావించాను.

ఈ రచన ప్రత్యేకత ఏమిటంటే – ఇందులో ఊహాజనితమైన కల్పనలకు కంటే పురాణ ప్రమాణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాధాదేవి గురించి ప్రచారంలో ఉన్న కథలను యథేచ్ఛగా స్వీకరించకుండా, బ్రహ్మవైవర్త పురాణం, గర్గ భాగవతం, పద్మపురాణం వంటి ప్రాచీన గ్రంథాలతోపాటు వివిధ సంహితా గ్రంథాలలో లభించే విషయాలను పరిశీలించి, వాటి ఆధారంగా ఈ రచనను తీర్చిదిద్దారు. అందుకే ఇది కేవలం ఒక నవలా కథనం మాత్రమే కాదు; పురాణాంతర్గతమైన రాధాతత్త్వాన్ని సరళమైన భాషలో పాఠకుని హృదయానికి చేరువచేసే ఒక భక్తిరసభరిత సాహిత్యయాత్రగా అనిపించింది.

రాధాదేవి పేరు వినగానే మన మనస్సులో బృందావనం మెదులుతుంది. యమునాతీరం కనులముందు కదలాడుతుంది. వేణుగానం వినిపించినట్లనిపిస్తుంది. గోపికల భక్తి, శ్రీకృష్ణుని దివ్యలీలలు, రాధాకృష్ణుల అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక అనుబంధం మనసును మరో లోకంలోకి తీసుకువెళతాయి. అయితే రాధాకృష్ణుల దివ్యప్రేమను కేవలం లౌకికమైన కోణంలో చూసి అపార్థం చేసుకున్న సందర్భాలు కూడా సమాజంలో లేకపోలేదు. అటువంటి అపోహలకు అతీతంగా రాధాకృష్ణ తత్త్వంలోని పరమార్థాన్ని, భక్తి యొక్క అత్యున్నత స్థితిని పరిచయం చేయడంలో ఈ రచనకు ఒక విశిష్టమైన స్థానం ఉందని నాకు అనిపించింది.

ఆమె రచన గురించి చెప్పగానే, "ఇది మా **దర్శనమ్** పాఠకులకు నిజంగా

మహాప్రసాదమే" అన్నాను. వెంటనే డిటిపి రూపంలో సిద్ధంగా ఉన్న రచనను నాకు పంపించారు. ఆ తరువాత **దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక**లో ధారావాహికగా ప్రచురించడం ప్రారంభించాం. ఒక్కో సంచిక వెలువడుతున్నకొద్దీ పాఠకుల నుంచి వచ్చిన స్పందన మాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

"చదువుతుంటే ఏదో దివ్యలోకంలో విహరిస్తున్న అనుభూతి కలిగింది", "గోలోక విహారం చేసినట్లుంది", "రాధాదేవి నిజమైన తత్త్వస్వరూపం ఇప్పుడు తెలిసింది", "రాధాకృష్ణుల గురించి ఇంతవరకు మనసులో ఉన్న కొన్ని అపోహలు తొలగిపోయాయి" – అంటూ పలువురు పాఠకులు తమ అనుభూతులను పంచుకున్నారు. ఒక రచన పాఠకునికి ఆనందాన్ని ఇవ్వడం ఒక విశేషమైతే, అతని దృక్పథాన్ని మార్చి, ఒక దివ్య తత్త్వాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకునేలా చేయడం మరింత గొప్ప విషయం. ఈ రచన విషయంలో అలాంటి స్పందన లభించడం రచయిత్రి కృషికి లభించిన నిజమైన ప్రశంసగా భావిస్తున్నాను.

మంచి రచనను పాఠకులకు అందించగలగడం ఏ పత్రికకైనా ఆనందమే. అయితే ధారావాహికగా నెలనెలా చదవడంలో ఒక ప్రత్యేకమైన ఆస్వాదన ఉన్నప్పటికీ, మొత్తం రచనను ఒకేసారి చదివితే రాధాదేవి జీవనప్రవాహం, రాధాకృష్ణుల దివ్యానుబంధం, బృందావన లీలామాధుర్యం మరింత సమగ్రంగా హృదయానికి హత్తుకుంటాయనే అభిప్రాయం పలువురు పాఠకుల నుంచి వ్యక్తమైంది. ఆ అభిప్రాయమే ఈ రచనను పుస్తకరూపంలో తీసుకురావాలనే సంకల్పానికి బీజం అయింది.

రాధాదేవి చరిత్ర అనేది ఒక వ్యక్తి జీవితగాథ మాత్రమే కాదు. అది ప్రేమకు పరమార్థాన్ని చెప్పే గాథ; భక్తికి పరాకాష్ఠను చూపించే గాథ; జీవాత్మ – పరమాత్మల అనన్యానుబంధాన్ని అనుభూతింపజేసే దివ్యగాథ. శ్రీకృష్ణుడు పరబ్రహ్మస్వరూపుడైతే, రాధ ఆయన హ్లాదినీశక్తిగా భక్తసంప్రదాయం దర్శించింది. అందువల్ల రాధను అర్థం చేసుకోవడం అంటే కృష్ణభక్తిలోని మాధుర్యాన్ని అర్థం చేసుకోవడం; రాధాకృష్ణుల దివ్యప్రేమను తెలుసుకోవడం అంటే భగవంతునిపట్ల సంపూర్ణ సమర్పణ అనే భక్తిరహస్యాన్ని అనుభవించడం.

అందుకే ఈ గ్రంథాన్ని చదువుతున్నప్పుడు కథలోని సంఘటనల వద్దనే ఆగిపోకుండా, వాటి వెనుక అంతర్లీనంగా ప్రవహిస్తున్న భక్తి, విరహం, అనురాగం,

సమర్పణ, పరమాత్మసాక్షాత్కారం వంటి ఆధ్యాత్మిక భావాలను కూడా పాఠకులు ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాను. బృందావన రాసలీలను లౌకికదృష్టితో కాక, ఆధ్యాత్మిక దృష్టితో దర్శించినప్పుడే అందులోని అసలైన మాధుర్యం మనకు అవగతమవుతుంది. ఆ దృష్టిని కలిగించడంలో ఈ గ్రంథం తన వంతు పాత్రను తప్పక నిర్వర్తిస్తుందని నా విశ్వాసం.

ఇక ఈ గ్రంథం రాధాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠకుల ముందుకు రావడం మరింత సముచితంగా, మంగళప్రదంగా అనిపిస్తోంది. రాధాదేవి ఆవిర్భావాన్ని స్మరించుకునే పవిత్ర సందర్భంలో ఆమె దివ్యచరిత్ర గ్రంథరూపంలో ఆవిష్కృతం కావడం యాదృచ్ఛికం మాత్రమే కాదేమో! అది శ్రీరాధాకృష్ణుల అనుగ్రహంగా భావించాలనిపిస్తోంది.

డాక్టర్ శ్రీమతి ఎన్. అనంతలక్ష్మి గారి కలం నుంచి వెలువడిన ఈ భక్తిరసభరిత రచన ప్రతి ఇంటా చేరాలని, పాఠకుల హృదయాలలో రాధాకృష్ణ భక్తిని, ప్రేమతత్త్వాన్ని, బృందావన మాధుర్యాన్ని మరింతగా వికసింపజేయాలని మనసారా కోరుకుంటున్నాను.

రాధే రాధే!

జయ శ్రీరాధాకృష్ణ!

– మరుమాముల వెంకటరమణ శర్మ

సంపాదకులు, **దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

రాసేశ్వరి-1

మురళీ మోహన ముకుంద మురహర
ముని జన వందిత నమో! నమో!!

పాటతో పాటు వీణ మీటుకి శ్రీకృష్ణ ప్రభువు, ఆయనతో పాటు వన విహారం చేస్తున్న ఇష్టసఖు లిద్దరూ తలెత్తి మింటి వంక చూపు సారించారు. దేవర్షి నారదుల వారు ఆకాశమార్గం నుండి ద్వారక వైపుకి దిగి రావటం కనిపించింది. శ్రీ కృష్ణుడు సంతోషంతోను, ఉద్ధవుడు, శారదుడు ఆశ్చర్యంతోనూ చూస్తున్నారు. నారదుడి సంకీర్తన తన్మయత్వంతో సాగిపోతోంది.

నంద నందనా నమో నమో!
రాధావల్లభ నమో నమో!!
గోపీలోలా నమో నమో!
నవనీతచోర నమో నమో!!

కాళీయమర్దన నమో నమో!
కంససంహార నమో నమో!!
గోపబాలకా నమో నమో!
బృందావిహారా నమో నమో!!

రాసవిధాయక నమో నమో!
నమో నమో! నమో నమో!!
నందనందనా నమో నమో!
నందనందనా నమో నమో!!

శ్రీకృష్ణుడు నారద మహర్షికి ఎదురేగి

"దేవర్షీ! వసుదేవసుతుని స్వాగత నమస్కారమును స్వీకరింపుడు. తమరి రాకతో నేను, ద్వారకాపురవాసుల మందరము ధన్యుల మైతిమి. వేంచేయుడు." అని సాష్టాంగదండప్రణామం చేశాడు.

"సమస్త శుభనిధానమవు. ఏమని ఆశీర్వదించను? ఆనందసిద్ధిరస్తు."

నారదుల వారు కీర్తించారా? ఆశీర్వదించారా? ఉద్ధవుడికి, శారదుడికి సందేహం.

"దేవమునీ! ఉద్ధవుడు తమ పాదపద్మములకు నమస్కరించు చున్నాడు." సాగిల పడి మ్రొక్కాడు.

"శారదుని మ్రొక్కులు గైకొనుడు నారద మహర్షీ!" శారదుడు వెంటనే నారదుని పదాల మీద వాలాడు.

"యోగేశ్వరుడైన శ్రీకృష్ణుని సాహచర్యం లభించిన మీరిద్దరు ధన్యులు. మీకిరువురకు భక్తి స్థిరమగు గాక!" అని ఆశీర్వదించారు నారదుల వారు.

ఒక నీపవృక్షమూలం వద్ద నిర్మించబడిన వితర్దిక మీద నారదుని ఆసీనుని చేశారు.

"మహానుభావా! అంతఃపురంలో చేసే ఉపచారాలన్నీ ఇక్కడ వాచికంగా చేస్తే, మీరు మానసికంగా స్వీకరించండి."

కృష్ణుని ఔచితీమంతమైన పలుకులకు నారదుడు సంతోషించాడు.

"మహర్షీ ! తమ వంటి వారు ఊరక రారు కదా! ఏదో దేవకార్యమో, దేవ రహస్యమో ఉండి ఉంటుంది. వాస్తవమే కదూ!" ప్రక్కన చేరి నెమ్మదిగా అడిగాడు కృష్ణుడు.

"జగన్నాటక సూత్రధారీ! నీకు తెలియని దేమున్నది? పారిజాతవృక్షపు తిరుగు ప్రయాణాన్ని ప్రత్యక్షంగా తిలకించటానికి వచ్చాను."

"అబ్బో! అప్పుడే ఒక సంవత్సరము గడచి పోయినదా? కాలమెంత వేగముగా పరుగులెత్తుచున్నది?

"కాలముల్లంఘనీయము గాదు యెంత
వారి కైన గడచిన ట్లైవరును గాంచ
బోరు కరగి పోయి యదియు జారి పోవు
కంటి రెప్పల సందుల కారి పోవు."

"సత్యము వచించితివి. కాల స్వరూపుడవైన నీకు తెలిసినంతగా దాని తత్త్వము మరి యొకరికి ఎట్లు తెలియును?"

"కలహాశనా! ఇంతకీ ఆ అపురూపదృశ్యమును తిలకించుట పూర్తి అయినదా?"

"నీవు లేకుండగనా?"

"మహర్షీ! ఎంత మాట? మా అంతఃపురమున మీకు అభ్యంతరమా?" కృష్ణు డెంతో నొచ్చుకున్నట్టు పలికాడు.

"అదేమీ కాదు కానీ ....." నారదుడు అర్థోక్తిలో అగాడు సందేహిస్తూ.

"కానీ .... " రెట్టించాడు కృష్ణుడు.

"వెరపు." భయం ముఖంలో ప్రస్ఫుటంగా కనపడుతుండగా అన్నాడు నారదుడు.

అప్పటి వరకు వినోదంగా చూస్తున్న శారదుడు నెమ్మదిగా ఉద్ధవుడికి మాత్రమే వినిపించేట్టు అన్నాడు, " ఆహా! ఎంత నటన?" అని.

శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు. అందులో ఎన్ని అర్థాలున్నాయో నని వెదుకుతున్నాడు ఉద్ధవుడు.

"మహాత్మా! అటులైన ఈ వనము నుండి నేరుగా సత్యభామాదేవి పెరటి తోటకే పోవుదము. రండు."

ఒక్క అడుగు వేసి, ఆగి, శారదుని, ఉద్ధవుని చూచి,

"సఖులారా! మీరును రండు!" అని నారదునితో కలసి నడువ సాగాడు.

శారదుడు ఉద్ధవుడితో "మన మెందుకట?" అన్నాడు రహస్యంగా.

"మనము లేనిదే మన సఖు డుండ లేడు కదా!" ఎంతో గర్వంగా చెప్పాడు ఉద్ధవుడు.

"మన వలెనే మన సఖునికి కూడా బెదురేమో సత్యభామాదేవి గారంటే!"

"శ్రీకృష్ణునికి బెదురా? ఎంత మాటంటివి? తప్పు శారదా!"

"ఏమో! నాకు మాత్రం సత్యభామాదేవి గారంటే చెప్పలేని భయం. నాకే కాదు. చాలా మందికి ఆమె గారంటే భయం తెలుసా?"

"మన కృష్ణ డుండగా మనకేమి భయం. అతడు నీకూ, నాకే కాదు. సమస్త లోకానికి అభయప్రదాత." తన్మయత్వంతో చెప్పాడు ఉద్ధవుడు.

నారద మహర్షి రెండడుగులు వెనక్కి వేయటం వీరిద్దరు గమనించ లేదు.

"అవునవును. ఉద్ధవుని వంటి భక్తునకు నదురూ బెదురు లుండవు." అన్న ఆయన మాటలతో నారదుడు తమ సంభాషణ వింటున్నాడని అర్థ మయింది.

"చూచితివా శారదా! నేను గొప్ప భక్తుడ నని నారదుల వారు సెలవిచ్చారు." మురిపెంగ అన్నాడు ఉద్ధవుడు.

"అవునా మహర్షీ?" శారదుడు అమాయకంగా ముఖం పెట్టి అడిగాడు.

"అవును. ఉద్ధవుడు కృష్ణభక్తుడే!"

"ఉద్ధవా! వింటివిగా! నీవు భక్తుడవు. అంతే!"

"అంతే ఏమిటి? నేనన్నదే నారదుల వారు కూడా అన్నారు కదా!"

"కాదు. ఎంతో తేడా ఉంది."

"ఏమిటో అది?" కోపంతో కూడిన వెటకారంతో అడిగాడు ఉద్ధవుడు.

"నీవు భక్తుడవు అన్నారు దేవర్షి. అంటే, లోకంలో ఎంతో మంది భక్తులున్నారు. నీవును వారిలో ఒకడవు అని అర్థం 'అంతే' అంటే." శారదుడు వివరించాడు.

ఉద్ధవుడికి ఉక్రోషం ముంచుకొచ్చింది.

"మహానుభావా! శారదుడన్న మాట నిజమేనా?" నారదుణ్ణి నిలదీశాడు.

నారదుడు నవ్వు మొగముతో " అవునయ్యా! నీవు భక్తుడవు సందేహమేల?" అని, "జగన్నాయకా! వచ్చు చుంటిని" అని కృష్ణుడు తనను పిలుచు చున్నట్టు గబ గబా ముందుకి వెళ్ళి, కృష్ణునితో ఏదో గంభీరంగా చర్చిస్తున్నట్టు నటించ సాగాడు. కృష్ణుడు వెనుదిరిగి ఉద్ధవుడి వంక చూచి చిన్నగా నవ్వాడు. ఉద్ధవుడికి పుండు మీద కారం చల్లి నట్టయింది. ముఖం ఎర్ర బడింది.

"నారదుడు కలహ భోజనుడన్న మాట సార్థకం చేసికొన్నాడు సుమా!"

"అందులో వింత ఏమున్నది? ఆయనకు ఆకలి వేసినప్పుడు మాత్రమే వస్తారని అందరు అనటం తెలిసినదే కదా! ఒక్క ఏడాది క్రిందట వచ్చి, రుక్మిణీ దేవికి పారిజాత పుష్పము నిచ్చి, అల్లకల్లోలమునే సృష్టించి వెళ్ళినాడు. ఇప్పుడు ఏమి గందర గోళము చేయునో?" సాలోచనగా అన్నాడు శారదుడు.

"ఇప్పటికే చేసినట్టున్నాడు నా విషయంలో." తనలో అనుకున్నాడు ఉద్ధవుడు.

ముందు నడుస్తున్న కృష్ణుడు, నారదుడు ఆగారు వీరిద్దరి కోసం.

"చెలికాడా! శారదా!, సఖుడా! ఉద్ధవా!! ఆగి పోయారేమి? రండు. త్వరగా వెళ్ళినట్లైన పారిజాత వృక్షము స్వర్గమునకు వెళ్ళు దృశ్యమును కన్నులారా కాంచ వచ్చును."

"శారదుడు భయ పడుతుంటే ఉద్ధవుడు ధైర్యము చెప్పుతున్నాడు. ఎంతయినా నీ భక్తుడు కదా!" నారదుడు నవ్వుతూ అన్నమాటలు ఉద్ధవుడికి మరింత ఉక్రోషం కలిగించాయి.

"అవును. భయ పడ వలసిన పని లేదు భక్తులకు. అందునా నా భక్తులు దేనికీ భయ పడ నవసరం లేదు. ఉద్ధవుడు భక్తుడనటంలో సందేహం లేదు కదా!" కృష్ణుడు అన్నాడు.

శారదుడు ఊరకొన వచ్చు కదా! నారదుల వారితో కొద్ది సేపటి సాహచర్యం ప్రభావం చూపించినట్టుంది. నెమ్మదిగా,

"నారదుల వారు ఉద్ధవుణ్ణి సామాన్య భక్తుడు గానే పరిగణిస్తున్నారు. కానీ, మన ఉద్ధవుడికి తనంతటి భక్తులు లేరనే ఒక నమ్మకం ఉంది కదా!" అన్నాడు.

కృష్ణుడు యథాలాపంగా అన్నట్టు "అవును కదా!" అన్నాడు.

ఉద్ధవుడు "ఈ అవును దేనికి?" అని అడిగాడు.

"నీ కటువంటి నమ్మకం ఉంది అని."

"అయితే నేను నీ భక్తు లందరిలో అధికుడను కానా?" ఆవేదనగా అడిగాడు ఉద్ధవుడు.

"నా భక్తులందరిలో ప్రీతిపాత్రుడవు నీవు." ఆప్యాయత ఉట్టిపడేట్టు పలికాడు కృష్ణుడు.

ఉద్ధవుడు నారదుని వంక చూచి కించిత్ గర్వంగా నవ్వుతాడు. కృష్ణుడి చిరునవ్వుని నారదుడు అర్థం చేసుకున్నాడు. శారదుడికి అర్థం అయినట్టూ, కానట్టూ ఉంది. అదే మాట అడిగాడు.

"కృష్ణా! నీ మాటలలో ఏదో మర్మం గోచరిస్తోంది."

"రాధాపతి ఏమి చేసినా అది మార్మికమే కదా!" నారదుడు అంత కంటే నర్మగర్భంగా అన్నాడు.

"మర్మం బాగానే విప్పి చెప్పితివి మహర్షీ!" శారదుడు మెచ్చుకోలుగా అన్నాడు.

"అంటే ..... ?" ఉద్ధవుడు అయోమయంగా అడిగాడు.

"రాధ నీకు పోటీ అని." శారదుడు మర్మం బట్ట బయలు చేశాడు.

"రాధకు నాకు పోలికయా? ఆమె ప్రేయసి. నేను భక్తుడను."

"నీవు కూడా ముందు బంధువవు. తరువాత మిత్రుడవు. ఆ పిమ్మటనే కదా భక్తుడవైనది!"

"నిజమే! అయినా, నా భక్తికి నా చుట్టరికము, మైత్రి ప్రతిబంధకాలు కాలేదే!"

"రాధ విషయంలో భక్తి తప్ప మరొకటి లేదుగా!"

"రాధ కూడా ముందు కృష్ణుడికి బంధువే. తరువాత ప్రేయసి. ఆ పైనే భక్తురాలు."

స్నేహితు లిద్దరి వాదనను వినోదంగా వింటున్నారు కృష్ణుడు, నారదుడు. ఇప్పుడు నారదుడు మధ్యలో కల్పించుకొని, "రాధ ప్రేమను భక్తి ప్రేమ, లేక మధుర భక్తి అని అంటారు." అన్నాడు.

"నారదులవారు భక్తిని గురించి క్రొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నారు." ఉద్ధవుడు కొంచెం ఎద్దేవాగా అన్నాడు.

"ఉద్ధవా! నువ్వు నారదుల వారు చెప్పిన దానిని అర్థం చేసుకొనే ప్రయత్నం చెయ్యి." కృష్ణుడు అనునయంగా చెప్పాడు.

"అంటే ..... ?" ఉద్ధవుడికి ఏమీ పాలుపోలేదు.

"స్పష్టంగానే ఉంది కదా! భక్తులలో రాధ సర్వోత్కృష్ట అని."

"ఎంతటి అవమానం? ఒక స్త్రీతో ..... అందులోనూ ఒక జారిణితో ....."

ఉద్ధవుడి మాటలని పూర్తి కానీయ లేదు శారదుడు. ముక్కు మీద వేలు వేసుకొని తప్పు అని సూచిస్తూ, " అపచారం ఉద్ధవా! అపచారం. రాధను అంతటి మాట అనరాదు. అటువంటి భక్తి మరెక్కడా కానరాదు."

"అందరూ అనుకుంటున్న మాటనే నేనూ అన్నాను." ఉద్ధవుడు వివరణ ఇచ్చాడు.

"నీవూ అందరు పామరులలో ఒకడి వవుతావా? నీ విజ్ఞత ఏమయింది? మన మిత్రుడు కృష్ణుడి సాహచర్య ఫలితం ఇదేనా?" శారదుడు కొద్ది కోపంగా అన్నాడు.

ఉద్ధవుడు తల వంచుకున్నాడు.

"రాధ అంటే ఎవరనుకున్నావు?" నారదుడు చురుకుగా అడిగాడు.

"ఎవరు?" ఉద్ధవుడు, శారదుడు ఇద్దరూ ఒక్కసారిగా అడిగారు కుతూహలంగా.

"మీరేమనుకుంటున్నారో చెప్పండి ముందు." నారదు డన్నాడు.

"శతగోపుని కుమార్తె." శారదుడు చెప్పాడు.

"రాయణుడి భార్య." ఉద్ధవుడు చెప్పాడు.

"అది ఈ జన్మకి సంబంధించినది. ఆ దేవి వాస్తవ తత్త్వం ఏమంటే ....."

ఆగాడు నారద మహర్షి. ఉద్ధవుడు, శారదుడు ఉత్కంఠగా నారదుడి మాటలను వినటానికి సంసిద్ధ మయ్యారు. కృష్ణుడు చిద్విలాసంగా చిరునవ్వుతో చూస్తూ ఉండి పోయాడు. నారదుడు చెప్పసాగాడు. పారిజాతం మాట మరచారందరూ.

2

మంద్రంగా సామగానం శ్రుతిహితవుగా వీనులవిందు చేస్తోంది. అది ఓంకారంగా వాయుస్పందనలో నుండి వ్యక్త మౌతోంది. జ్యోతిర్మయమైన గోలోకంలో వాయుస్పందనలోను ప్రణవస్వరూపమైన సామగానమే. అది వేణువు నుండి వెలువడినట్టు భాసిస్తోంది. ఆ నాదానికి తన్మయమైన హిరణ్మయవృక్షాల కదలిక నృత్యశోభతో విలసిల్లుతోంది. ఆ నృత్యానికి అనుగుణంగా విరజానది అలల మృదంగ ధ్వానాలతో మురిసిపోతోంది. శతశృంగపర్వతం ప్రతిధ్వనులతో మృదుమధురంగా నినదిస్తోంది.

విరజానదీ తీరంలో, గోలోకంలోని శతశృంగశైల సమీపంలో, బృందావనం లోని రాసమండలంలో, మణిమయ వితర్దికపై సర్వసమ్మోహకరమైన వినీల

సౌందర్యరాశి విశ్రమించి ఉంది. అరమోడ్పుకన్నులతో యోగనిద్రాముద్రితమైన ఆ ముఖం నీలివెన్నెల లీనుతూ ఉంది. గోలోకంలో నిండిన వెలుగు సమస్తం ఈ జ్యోతిస్స్వరూపం నుండే వెలువడుతోంది. ఒక్క మారు దర్శిస్తే చాలు జన్మ ధన్య మౌతుందనిపించే , చూచిన కొద్దీ చూడాలనిపించే ముద్దులు మూట గట్టే ముఖం. కాదు, కాదు. అది గాంభీర్యవారాశి. సర్వసద్గుణపుంజం. ఆహ్లాదకారణం. సంతోషసౌధం. కళానికేతనం. ప్రశాంతనిలయం. ఆనందధామం.

వాయువుకి ఆ సామగానస్పృహ ఆ దివ్యదేహస్పర్శ వల్ల కలిగి ఉంటుంది. వేణునాదం ఆ మూర్తి ఉచ్ఛ్వాసనిశ్శ్వాసాల నుండి వెలువడుతున్నట్టుంది. ఆ జ్యోతిర్మయ లోకం లోని వెలుగు అంతా ఆ మూర్తి నుండియే వస్తున్నట్టు తోస్తోంది. అక్కడి ప్రశాంతతకి, ఆనందానికి మూలం ఆ మూర్తియే అని స్పష్ట మవుతోంది.

చిరుగాలికి అల్లన కదలిన నల్లకలువ రేకుల వలె మెల్లగా విశాలమైన కనురెప్పలు తెరచి ఆ దివ్యమూర్తి అలవోకగా లేచి నిలిచాడు. ఆ కదలిక హోయలు ఒలక బోసింది. పరిసరాలు ఆ కదలికల కనుగుణంగా లయబద్ధంగా స్పందించాయి. ఆ నీలమేఘశ్యాముడు లయబద్ధంగా అడుగులు వేయసాగాడు. మరుక్షణం శిల్పం వలె కదలిక లేకుండా నిలబడి పోయాడు. భృకుటి ముడిపడింది. సాలోచనుడైనాడు. ఆ ఆలోచనకు ఆ దివ్యదేహపువామభాగం తృటి మాత్రం చలించింది. ఆ చాలనం నుండి మేఘం నుండి వెలువడిన మెరుపు వలె ఒక సుందరి రూపుకట్టింది. ఆ సుందరి వెంటనే పరుగు పెట్టింది. ఆ పరుగు కుముదశ్యాముని లయవిన్యాసపు భేదమైన ఒక మనోహర నృత్యం వలె భాసించింది. ఆ సుందరిని, ఆమె నృత్యసమమైన పరుగును పరమప్రీతితో చూస్తూ ఉన్నాడా ఇందీవరశ్యాముడు. వెళ్లినంత వేగంగా పరుగు పరుగున వచ్చిందా అందాలరాశి, చేతులలో పూలతోను, పూలదండతోను. పుష్పాంజలిని దివ్యమూర్తి పాదాల వద్ద సమర్పించింది. ఆ కాంతిపుంజ మా సుందరిని రెండు చేతులతోను పైకి లేవనెత్తింది. సుందరి పూలమాలను ఆ జగన్మోహనాకారుని కంఠసీమ యందు అలంకరించింది. నమస్కారముద్రతో కొద్దిగా వంగి వినమ్రంగ నిలబడింది. అపుడా కమలాక్షుడు ఆనందంగా,

"ఓ బాలా!

"రాస మండలమున వాసిగా నా నుండి
పుట్టి నంత పరుగు పెట్టి నీవు

పూల తోడ నన్ను పూజించితివి గాన
'రాధ' నామమున బరగెదవీవు." అన్నాడు.

"హే! ప్రభూ ధన్యురాలను." అని ఆ తేజోమయమూర్తికి ప్రదక్షిణం చేస్తూ స్తుతించ సాగింది.

"వరం వరేణ్యం వరదం వరదనామ్ చ కారణం
కారణం సర్వభూతానాం తేజోరూపం నమామ్యహమ్

"మంగళం మంగళానాంచ మంగళం మంగళప్రదం
సమస్త మంగళాధారం తేజోరూపం నమామ్యహమ్
సగుణం నిర్గుణం బ్రహ్మ జ్యోతీరూపం సనాతనం
సాకారం నిరాకారం తేజోరూపం నమామ్యహమ్."

తనకు ప్రదక్షిణం చేస్తున్న రాధ చేతిని సుతారంగా తన చేతిలోకి తీసుకుని నృత్యం చేయటం ప్రారంభించాడు. అప్రయత్నంగా రాధ తన అడుగులు కదిపింది. అతడి అడుగులతో కలిపింది. పెదవులూ కదిలాయి. సామగానం నేపథ్యంగా ప్రేమగానం సాగింది. రాసమండలం పులకించేట్టుగా ప్రేమరసం వెల్లువెత్తింది. భరతశాస్త్రానికి బీజం పడింది.

అంతా ప్రేమ మయం
ఈ జగమంతా ప్రేమ మయం!

అంతరిక్షం నుండి వెలువడిన గానం ఇరువురి లోనూ ప్రతి ధ్వనించింది.

రాధ, కృష్ణుడు ఒకే స్వరంతో

"అంతా ప్రేమ మయం
ఈ జగమంతా ప్రేమ మయం!"

కృష్ణుడు : ప్రకృతి రూపిణి వీవు
పరాశక్తివీ నీవే !

రాధ : పురుషుడ వీవొక్కడవే!
పరమపురుషడవీవొక్కడవే.

ఇద్దరు : నీ నా ప్రణయమె ఈ
సర్వ సృష్టిగా వెల్లి విరిసెగా! ॥ అంతా ॥

కృష్ణుడు : రాధవు, దుర్గవు, లక్ష్మివి, వాణివి,
శచీ దేవివీ నీవే

రాధ : కృష్ణుడు, శివుడు, నారాయణుడు,
విరించి ఇంద్రుడు నీవేగా!

ఇద్దరు : మన ఇద్దరి ప్రణయమె
పరిమళించె నీ ప్రపంచమై! ॥ అంతా ॥

రసానంద తన్మయులైన రాధాకృష్ణులు పరస్పరావలోకన తత్పరులై ఉండిపోయారు. వారి తన్మయత్వానికి భంగం కలిగించటం ఇష్టం లేనట్టు పరిసరాలు నిశ్చలమై పోయాయి. ఆనందపు తారస్థాయిలో రాధాదేవి శరీరం పులకించింది. ఆ పులకాంకురాలు ఒక్కొక్క దానిలో నుండి అపురూపసౌందర్యం రూపుదాల్చినట్లున్న కోట్లాదిమంది యవతీమణు లుద్భవించారు. వారందరు రాధాకృష్ణులకు వందన మాచరించి నిలిచారు.

"రాధారాణీ! వీరందరు నీ పరివారం." అన్నాడు శ్రీ కృష్ణుడు.

రాధారాణి ఒక విలాసంతో కూడిన చిరునవ్వు చిందించింది.

"వీరందరు గోపికలు. నీవు ఆదిగోపివి."

ప్రశ్నార్థకంగా చూసింది రాధ.

"చిదాదులను గోపనం చేయటం చేత నీవు గోపివి. నీవు వారందరికి మూలమైన దానివి. వారికి రాణివి. వారు నీ చెప్పుచేతల్లో, అదుపాజ్ఞల్లో నీ సేవ చేసుకుంటూ ఉంటారు. కనుక నీవు ఆదిగోపివి."

రాధ ముగ్ధ మనోహరంగా నవ్వింది.

"అటు చూడు ప్రియసఖీ! వారందరు నా పరివారం." కృష్ణుడు చూపించిన వైపు చూసింది రాధ. అక్కడ శ్రీకృష్ణుడేమో నని భ్రమ కొలిపే రూపాలతో ఉన్న గోపకుల బృందం కొద్ది దూరంలో కనిపించింది. రాధ పరవశించింది. గోలోకం కొత్తదనంతో పులకరించింది.

3

బృందావనంలోని రాసమండలంలో శ్రీకృష్ణప్రభువు ఏకాంతంగా విహారం చేస్తూ ఉన్నాడు. తన ఏకాంతానికి భంగం కలిగించ వద్దని ఇష్టసఖుడు సుదాముడికి ముందే చెప్పి ఉన్నాడు శ్రీకృష్ణుడు. కమ్మని పిల్లతెమ్మెర ఒకటి వచ్చి అతడిని సోకింది. అలవోకగా తల పంకించి ముందుకి సాగాడు. రాధ చెలులలో పరమసుందరి అని అందరి మెప్పు పొందిన విరజ అటుగా వస్తోంది. రాధ చెలుల నందరను రాసమండలమునకు రమ్మని వర్తమానం పంపింది. ఇక ఒక్కొక్కరే వస్తారు. అందరు వచ్చే సమయాని కన్న ముందుగా ఈ కాంతతో తన ఏకాంతం భంగమైన స్థితిని కూడా కాంతంగా చేసుకోవాలనే ఊహ కలిగింది. ఇటువంటి సంకల్పం ఎందుకు కలిగిందా? అని అనుకుని, తల పంకించాడు. ఇది విరజ మనస్సులో కలిగిన స్వల్ప వికార ప్రతిఫలనం. ఇది ఏ మహత్కార్యానికి నాంది అవుతుందా అని అనుకోగానే పెదవులపై జగన్మోహనమైన చిరునవ్వు చిందులాడింది. కన్నులు అలవోకగా అర్ధనిమీలితా లయ్యాయి.

రాధాదేవి పరివారమైన గోపిక లందరలోను విరజ పరమసౌందర్యశోభిత. పచ్చిపసుపులో కుంకుమ పువ్వును మెదిపి పన్నీటితో కలిపినట్టున్న శరీరఛాయ, చంచలమైన తుమ్మెదరెక్కల వలె చిరుగాలికి కదలుతున్న ముంగురులతో ఉన్న చూడ ముచ్చటైన ముద్దులు మూటగట్టే కోలముఖం, చంచలంగా కదలుతూ మెరిసి పోయే నయనాలు, నవ్వినప్పుడల్లా తాంబూల సేవనం వల్ల అసలే ఎర్రగా ఉన్న పెదవులు మరింత ఎరుపెక్కి, ఆ ఎర్రదనం ప్రతిఫలించటం వల్ల పండిన దానిమ్మ గింజలనే భ్రాంతి కలిగించే పలువరుస, అన్నిటిని మించి రాధాదేవిపై భక్తి ప్రపత్తులు విరజ అందాని కొక ప్రత్యేకతను సంతరించాయి. ఇప్పుడు కృష్ణుని చేరాలనే అభిలాష కొసమెరు పయింది. మెరుపు మేఘం వద్ద ఉండటం సహజసుందరం.

"విరజా!" ఆర్ద్రంగా పిలిచాడు.

అయస్కాంత సమీపానికి ఆకర్షించబడిన ఇనుము లాగా గాలిలో తేలి వచ్చినట్టుగా వచ్చి పదాల వద్ద వాలింది విరజ. ఆప్యాయంగా ఆమెను లేవనెత్తాడు అచ్యుతుడు. అనంతుని చేతులలో సోలిపోయింది విరజ. సమస్తాన్ని విస్మరించింది. అంతా స్తంభించినట్లయింది. ఘటనాఘటన సమర్థుడు విరజతో క్రీడిస్తూ ఆమెకు

ధన్యతను ప్రసాదించాడు. వారి క్రీడ లక్ష మన్వంతరాల వరకు సాగింది. సమయం కోసం వేచి ఉన్నాడు. సమయం ఆసన్నమయిందని చిరునవ్వు వెలిగింది పెదవులపై.

రాధ ఆగమనాని కన్న ముందుగా వచ్చి తగిన ఏర్పాట్లు చేయటానికి సన్నిహిత పరిచారిక మాధవి వచ్చింది. బహిర్ద్వారం వద్ద సుదాముడు ఆపాడు. రాధారాణి ఆజ్ఞ ననుసరించి సమావేశానికి తగిన ఏర్పాట్లు చేయటానికి వచ్చానని చెప్పింది. శ్రీకృష్ణుని ఏకాంతానికి భంగం కలిగించ వద్దని ఆ ప్రభువు ఆజ్ఞ అని చెప్పాడు. ఇంతలో విరజ పరిచారికలు లోపల తిరుగుతూ కనిపించారు. రాసమండలం లోపల విరజ ఉన్నదా? అని అడిగింది మాధవి. సుదాముడికి ఏం చెప్పాలో తెలియ లేదు. ఉన్నదంటే రాధకు కోపం రావటం తథ్యం. అది భరించటం కృష్ణుడికే సాధ్యం కాదు. లేదని అసత్యం చెప్పటం తన వల్ల కాదు. మాటాడలేదు. 'మౌనం అర్థాంగీకారం' అన్నది మామూలు వారి విషయంలో. రాధ, ఆమె చెలుల విషయంలో మౌనం అంగీకారమే! రెండూ, రెండూ కలిపితే నాలుగని అర్థం చేసుకోలేనిది కాదు మాధవి. గిరుక్కున వెనక్కి తిరిగింది.

సమాచారం ఉన్నదున్నట్టు చెప్పటం చాలా కష్టం. చేరవేసే వారి ప్రతిభని అనుసరించి రంగు, రుచి, వాసన చేరుతాయి ఆ సమాచారానికి. యజమానురాలి చేత మిగిలిన వారికన్న మంచి అనిపించుకోవా లనుకొనేవారు ఏం చేస్తారో అదే చేసింది మాధవి. విన్న రాధారాణికి ఎంత కోపం రావాలో అంతా వచ్చింది. ఉన్నది ఉన్నట్టుగా బయలుదేరింది. ఆమె అంటే పరిపూర్ణమైన భక్తి ప్రపత్తులున్న పరిచారికావర్గం అంతా వెంట బయలు దేరారు.

రాధాదేవి కనుసన్న ననుసరించి ఆమె రథం అక్కడ ప్రత్యక్షమయింది. దాని పేరు "సుమనోమాలిని". అది దివ్యం. రత్నమయం. విశాలమైనది. ఆ రథం చిత్రాలతోను, చిత్రవిచిత్రాలైన వస్త్రాలతోను, పరదాలతోను పూలమాలలతోను, రత్నదర్పణాలతోను, అమూల్యమైన రత్నకలశాలతోను అలంకరించబడి ఉంది. దానిని శ్రీకృష్ణుడే రాధారాణికి బహూకరించాడు.

రాధ రథాన్ని అధిరోహించగానే ఆమె మనోభీష్మాన్ని అనుసరించి కదిలే ఆ రథం వేగంగా పరుగెత్తింది. ఎక్కడకు వెళ్ళాలో సుమనోమాలినికి తెలుసు. రాధ మనోరథం ఆకృతి దాల్చినట్టున్న రాధ రథం సుమనోమాలిని రాసమండల ద్వారం సమీపిస్తుండగా చూసిన సుదాముడికి భయం కలిగింది.

"ప్రభూ! రాధాదేవి గారు వేంచేస్తున్నారు." అని గట్టిగా ప్రకటన చేసాడు.

ఉన్న చోటే ఉండి ద్వారం వద్ద జరుగుతున్న దానిని దర్శిస్తున్నాడు శ్రీకృష్ణుడు.

రాధ బృందావనంలో ప్రవేశించ బోతోంది. సుదాముడు అడ్డగించాడు.

"లోపలికి ఎవరినీ పంప వద్దన్నారు. ఏకాంతంగా ఉండాలట. నా ధర్మాన్ని నేను నిర్వర్తించాలి కదా! అర్థం చేసుకోండి."

"నా సఖుల నందరనూ ఈ ప్రదేశానికి రమ్మని నేను ఆదేశం ఇచ్చాను. వారందరు వచ్చి ఉన్నారు. విరజ ఇంతకు ముందే ఇక్కడకు వచ్చి లోపల ఉన్నదట! నన్ను లోపలకు వెళ్ళ నియ్యి!" అధికారయుతంగా అన్నది.

"అమ్మా! నేనేమి చేయగలను. స్వామి ఆజ్ఞ ఆ విధంగా ఉంది. నన్ను క్షమించ వలసినది."

"నన్ను అపటానికి నీవెవరు? నీ కా అధికారం ఎవరిచ్చారు?"

"నా స్వామి కాక మరెవ్వరు? నేనెవ్వరి అధీనంలోనూ ఉండను."

"నా మాటను కూడా లెక్క చేయటం లేదు. నీ కెంత అహంకారం?"

"రాధారాణీ! నాది అహంకారం కాదు. ఆజ్ఞాపాలనం మాత్రమే!"

"ఇక్కడ ఆధిపత్యం రాధారాణి దని తెలియదా?"

"నాకు తెలిసిందల్లా శ్రీకృష్ణప్రభువు మాట తు.చ. తప్పకుండా అమలు పరచటమే."

రాధ విసవిసా సుదాముని మాట లెక్క చేయకుండా అతడిని దాటుకుని లోపలికి వెళ్ళింది. తన్మయావస్థలో ఉన్న విరజ రాధ ప్రవేశంతో ఉలిక్కి పడి, గజగజా వణికి పోయింది. శ్రీకృష్ణుని చేతులలో నుండి జారిపోయి నీరు కారిపోయింది. భయంతో పరుగు పెట్టింది. అది ప్రవాహమై శతశృంగ పర్వతం సమీపంలో నదిగా మారిపోయింది. ఆమె చెలులు కూడా చిన్న చిన్న నదులుగా మారి పోయారు. శ్రీకృష్ణుడు అంతర్ధాన మయ్యాడు.

ఎవరు కనపడక పోవటంతో రాధ కోపం మిన్ను ముట్టింది. గిరుక్కున వెనుదిరిగి, చర్రున తోక త్రొక్కిన త్రాచు లాగా దూసుకు పోయింది. సఖీబృందం ఆమెను అనుసరించింది.

తన మాటను లెక్క చేయకుండా లోపలికి వచ్చిన రాధ వెంట వచ్చాడు సుదాముడు. రాధాదేవి కోపంతో పాటు మిత్రుని మాటను పాటించలేక పోవటం వల్ల అతడి కోపానికి కూడా గురి కావలసి వస్తుందేమో ననే భయంతో. చిద్విలాసంగా ఉన్న సఖుని ముఖం చూసి సుదామునికి ఆశ్చర్యం కలిగింది. ప్రక్కనే క్రొత్తగా వెలసిన నదిని చూసి అవాక్కయ్యాడు. విరజ అదృశ్యం అంతు పట్టలేదు. ముఖంలో వ్యక్త మవుతున్న అన్ని ప్రశ్నలకు చిరునవ్వే సమాధానం. అ నవ్వులో ఏదో సందేశం. ఏదో ఆశ్వాసన. ఏదో కొద్దిగా అర్థ మౌతున్నట్టే ఉన్నది కాని స్పష్టత లేదు. అదే తెలుస్తుందిలే అని తన ఉద్వేగాన్ని తమాయించుకున్నాడు.

"సఖా! సుదామా!! నీ కోరిక తీర బోయే సమయం ఆసన్న మయింది." అన్నాడు శ్రీకృష్ణుడు.

సుదాముడు అయోమయంగా చూశాడు.

"అదే, తులసిపై నీకు కలిగిన అనురాగం ..... "

సుదాముడు సిగ్గుపడ్డాడు. తను తులసిపై మనసు పడిన విషయం తెలిసిపోయినందుకు మొహమాటంతో కూడిన సిగ్గు కలిగింది. ఆ సంగతి తన సఖుడు, సర్వస్వము అయిన శ్రీకృష్ణునికి చెప్పనే లేదు. అందుకు అపరాధభావంతో కూడిన సిగ్గు కలిగింది. తల వంచుకున్నాడు. శ్రీకృష్ణుడు మిత్రుని భుజం తట్టి,

"మిత్రమా! సిగ్గు దేనికి? అన్నిటికి తగిన సమయం ఉంటుంది." అన్నాడు.

ఆనందంతో నోట మాట రాలేదు సుదామునికి.

4

విరజానదీ తీరంలో మాలతీ నికుంజం ఆనందంతో ఉప్పొంగి పోతోంది. ఒక అపురూప సంఘటనకు తను తావు కల్పించింది. సంకల్ప మాత్రం చేత రత్నఖచిత సువర్ణశయ్యను, పట్టుపరుపులతో సమస్తభోగాలతో కల్పన చేశాడు శ్రీకృష్ణుడు. తన ఆకులతోను, పూలగుత్తులతోను ఆ శయ్యకు పూర్తిగా ఆచ్ఛాదన కలిగేట్లు తీగలను సవరించింది. శయ్యపై మెత్తని పూలరేకులను రాల్చి పుష్పశయ్యగా మలచింది. అలదటానికి పుప్పొడిని రాశిగా పేర్చి ఉంచింది. మందమారుతానికి పరీమళాన్ని

మరింతగా మోసుకొని వెళ్ళమని కోరింది. శ్రీకృష్ణునితో పాటు తనూ ఎదురు చూస్తూ ఉంది.

ఇన్నాళ్ళకి తన కోరిక తీరబోతోందన్న ఆనందం, సిగ్గు కలబోసినట్టున్న తులసి వస్తోంది. తులసి నడకలో సంకోచం. అది సిగ్గు వల్ల అనిపించటం లేదు. భయం లాగా భాసిస్తోంది. మరొకరితో తుల అంటే పోల్చటానికి వీలు లేని అందం ఆమెది. అందుకే ఆమెను తులసి అన్నారు. రాధాదేవి కూడ ఎన్నో మారు లామె అందాన్ని మెచ్చుకోవటం జరిగింది. శ్రీకృష్ణుని సాంగత్యాన్ని ఎవరు కోరరు? తులసికి కూడ మనసులో అటువంటి కోరిక కలిగింది. అందరి కోరికలు తీర్చటమే వ్రతంగా ఉన్న గోవిందుడు తులసిని అనుగ్రహించ దలచాడు. కోరికన్నది మనస్సులో మిగిలిపోతే అది మనస్సుని స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఉండనీయదు. కలత పెడుతూనే ఉంటుంది. కనుక తులసి మనసులో కలత తొలగించా లనుకున్నాడు. ఏదైనా ఒకటి చేస్తే ఎన్నో ప్రయోజనాలు సిద్ధించాలి. సమయం కోసం వేచి ఉన్నాడు. సుదాముని మదిలో పొటమరించిన చిన్ని కోరిక కూడా తీర్చవలసిన బాధ్యత తనదే కదా! అనుకున్నాడు గోలోకాధీశుడు. వారిరువురకూ తమ మనస్సులో ఉన్న కోరిక బహిర్గతం చెయ్యటానికి భయం. వారికే కాదు నాకు కూడా రాధాదేవి అంటే భయమే కదా! అనుకున్నాడు రాధాపతి.

తులసి నెమ్మదిగా, భయం భయంగా శ్రీకృష్ణుడు సంకేతంగా చెప్పిన మాలతీ నికుంజాన్ని సమీపించింది. శ్రీకృష్ణు డామెను చూచి ఎదురేగి పూవులాగా సుకుమారంగా పట్టుకొని, పూలపాన్పు వరకు తీసుకొని వచ్చాడు. తులసి భయం అనంతుని స్పర్శతో మటుమాయ మయింది. మరొక చిత్రమైన భావన కూడా కలిగి తనకేనా ఇటువంటి ఊహ వచ్చింది అని ఆశ్చర్య పోయింది. పరమాత్మ స్పర్శ చెయ్యలేనిది ఏముంది?

"ఒక్క మారు పరమపురుషునితో ఆనందాన్ని అనుభవించిన తరువాత ఏమయినా లెక్క చేయ నక్కర లేదు. అయినా ఎవరైనా చేయ గలిగిన దేముంటుంది? గోలోకం నుండి భూలోకానికి వెళ్ళమని అనటమే కదా! శ్యామసుందరుని పరిష్వంగం లభించటానికి దేనినైనా పణంగా పెట్టవచ్చు. ఇక భయం దేనికి?"

ఈ ఆలోచనతో తులసి నిర్భయంగా ఉంది. నిశ్చింతగా ఉంది. సంతోషంగా ఉంది. ఆనందంగా ఉంది. తానున్నా నని అనుకుంది. ఉన్నదా? ఏమో! లీలగా

కొద్ది సేపు ఉన్నట్టుగా తెలిసింది. స్వామి కౌగిలిలో కరగి పోతుంటే క్రమక్రమంగా తన ఉనికి కూడా కరగి పోతోందని అనిపించింది. ఆ పై ఏమీ లేదు. తానున్నా నన్న భావన కాని లేనన్న భావన కాని లేవు. అసలు తులసి ఉంటే కదా! పరమాత్మలో లయం అయి పోయింది. శరీరస్పృహ లేదు. చూడటానికి మూర్ఛపోయినట్టు కనపడుతున్నా అది మూర్ఛ కాదు. తులసి ప్రజ్ఞ శ్రీకృష్ణ పరమాత్మలో లయం అయింది.

రాధారాణి చెలులు ఈ సమాచారాన్ని తమ యజమానురాలికి చేరవేశారు. రాధ అంటేనే అలకల కొలికి. ఉన్నట్టుగా చెప్పిన ప్రదేశానికి హుటాహుటిన వెళ్లింది.. శ్రీకృష్ణుడు రాధ రాక గమనించి అంతర్ధాన మయ్యాడు. అక్కడ ఒంటరిగా శరీరస్పృహ లేకుండా ఉన్న తులసిని చూసింది. ఒడలు తెలియనంత కోపం వచ్చింది.

"ఓసీ! తులసీ!! ఇంతటి మోసం చేసిన నీవు భూలోకంలో పుట్టుదువు గాక!" అని శపించింది.

శ్రీకృష్ణుడు కాన రాక పోవటం చేత తిరిగి వెళ్ళి పోయింది. శాపవాక్కుతో కొంత కోపం తగ్గింది.

రాధ వెళ్ళిన తరువాత శ్రీ కృష్ణుడు అక్కడ ప్రత్యక్షమై, తులసికి స్పృహ తెప్పించి ఆమెను భయపడ వలదని అభయ మిచ్చి,

"భూలోకంలో శంఖచూడునికి భార్యవై, సతీత్వానికి ప్రతీకగా జీవించి, ఆపై చతుర్భుజుడైన నారాయణునికి భార్యవై, అంత్యమున గోలోకానికి వచ్చి రాధకు కూర్చు సఖివై నాకు ప్రియురాలవై శాశ్వతంగా ఉండగలవు." అని ఆశ్వాసించాడు.

"నేను ఇప్పుడు నీతో సుఖించటంలో సంతృప్తి చెందలేదు. శాపం మాత్రం పొందాను. తృప్తిగా నీతో సుఖించే భాగ్యం ప్రసాదించ వలసినది." అని వేడుకుంది.

"నీకా సుఖానుభూతిని తట్టుకో గల శక్తి లేదు. అందుకే మూర్ఛపోయావు. ఈ శాపం నీకు తగిన శిక్షణ నిస్తుంది. ఇది శాపంవలే కనిపించే వరమే సుమా! రాధారాణి వాక్కు అమోఘం. వ్యర్థం కాకపోవటమే కాదు, సార్థకం. శ్రేయోదాయకం."

శ్రీకృష్ణుని మాటలకు కొద్దిగా దుఃఖోపశమనం కలిగింది తులసికి. శ్రీకృష్ణునికి నమస్కరించి అంతర్ధాన మయింది భూలోక ప్రయాణానికి సిద్ధమై.

శ్రీకృష్ణుడామె వంక ఆప్యాయంగా చూస్తూ ఉండిపోయాడు.

5

స్వర్ణకమలం లాగా మెరిసి పోయే రాధ ముఖం ఎర్రకలువలాగా ఉంది. హేమంత తుషారపు ధాటికి కమిలిపోయిన పద్మదళాల వలె ఉన్నాయి ఆమె కన్నులు. మార్తాండుడి తాపాన్ని భరించ లేక తల వాల్చిన పూలతీగలాగా ఆమె వాడిపోయి ఉంది. ముఖంలో దుఃఖం, కోపం ఒక దాన్ని ఒకటి తన్నుకుని వస్తున్నాయి. బుసల వలె భాసిస్తున్న నిట్టూర్పులతో రాధ బంగారువన్నె ఛ్రాచు వలె శోభిస్తోంది. ఆ నిట్టూర్పులకి వేడెక్కిన పరిసరాలు రాధ భావోద్వేగానికి మరింత వేడెక్కి పోతున్నాయి. చెలులు చేస్తున్న శైత్యోపచారాలు ఏ మాత్రం ఫలించటం లేదు.

శ్రీకృష్ణుడు సుదామునితో కలిసి, రాధాదేవి అంతఃపురం వైపుకి నడుస్తున్నాడు. ఆ నడకలో చురుకుతనం లేదు. జంకు కాన వస్తోంది.

"సుదామా! రాధ కోపంగా ఉంటుందంటావా?"

"నీకు తెలియనిదేముంది మిత్రమా!"

"నన్ను లోనికి రానిస్తుందంటావా?"

"నేనేమి చెప్పగలను? అయినా తినబోతూ రుచి అడగటం దేనికి?"

"ఏమి తింటానంటావు?"

"ఏమో మరి? ఎప్పుడూ ఏమి తింటే అదే!"

శ్రీకృష్ణ సుదాములు రాధాదేవి అంతఃపుర ద్వారాన్ని సమీపించారు. అంతఃపురానికి కాపలా ఉన్న రాధాదేవి సఖులు లోపలికి అనుమతి ఇవ్వ లేదు. శ్రీకృష్ణుడు వారిని బతిమాలాడు. బామాలాడు. భంగపడ్డాడు.

"నీవూ ఇట్లే ప్రవర్తించితివా?" కృష్ణుడు సుదాముని ప్రశ్నించాడు.

"ఎప్పుడు?"

"తెలియనట్టు అడుగుచున్నావు. అదే నేను విరజతో క్రీడిస్తున్నప్పుడు, రాధారాణి వచ్చి నప్పుడు."

"మీ అజ్ఞ అదే కదా!"

"అప్పుడు రాధారాణి పొందిన బాధ, పడిన ఆవేదన నాకు ఇప్పుడు అనుభవంలోకి వచ్చుచున్నది." శ్రీకృష్ణుడు నిట్టూర్చుతూ అన్నాడు.

" ..... "

"సుదామా! చూచితివా రాధ సఖుల కెంతటి స్వామి భక్తియో? అంతఃపురం లోనికి అనుమతించుటయే లేదు. "

"ప్రభూ! మీరు సామాన్యులా! వారినే వశీకరణం చేసుకున్నారు కదా!"

"గోలోకానికి ఏలికసాని అయిన రాధారాణికి అభిమానం దెబ్బతిని, ఆగ్రహపరవశురాలై ఉన్నది, ఇప్పటికి వేం చేయండి. కోపం తగ్గినాక మేమే వచ్చి చెపుతాం' అంటుందా? ఎంతటి రాజసం?"

"ఎల్లరకు స్వామి తమరుండగా ఆమె ఏలికసాని ఏమి?" సుదామునికి ఆశ్చర్యం.

"వాస్తవమే కదా! అన్నిటిపై, అందరిపై, ఆధిపత్యం నాది. నాపై ఆధిపత్యం నా ప్రాణాధిక యైన రాధది. నన్ను ఆరాధించేది కనుక ఆమెకు రాధా అనే పేరు సార్థక మైతే, నాచేత ఆరాధించ బడేది కనుక ఆమె రాధిక అయింది." శ్రీకృష్ణుడెంతో మురిపెంగా అన్నాడు.

"ఈ విధంగా అనటం వల్లనే కదా ప్రభూ! చులకన అయ్యేది!"

"మా ఇద్దరి మధ్య అటువంటి భేదాలు లేవు కదా! మాది అద్వైతం."

"మీ వైపు నుండి లేవు. అది సరిపోదు. అటు వైపు నుండి కూడా ఆ భేద భావన లేకుండా ఉండాలి కదా!"

"అదుగో, అటు చూడు! రాధ చెలులు మాటల్లో పడ్డారు. మనం నెమ్మదిగా చడీ చప్పుడూ లేకుండా లోపలికి ప్రవేశిద్దాం."

సుదాముడు అటు చూశాడు. నిజంగానే రాధాదేవి అంతఃపురం ద్వారం వద్ద నున్న చెలులు వీరు ఆ ప్రాంతం వీడి వెళ్ళి పోయా రనుకుని, ముచ్చట లాడుకుంటున్నారు. ఏ మాత్రం సవ్వడి చేయ కుండా అడుగులు ముందుకి వేశారు శ్రీకృష్ణ సుదాములు. వీరు ద్వారం దాటి లోపలికి ప్రవేశించినట్టు చెలులు గమనించనే లేదు. సుదాముడు కొద్ది దూరం లోనే ఆగిపోయాడు. శ్రీకృష్ణుడు రాధాదేవి పానుపుని

సమీపించ బోయాడు. దెబ్బతిన్న త్రాచులాగా బుసలు కొడుతూ చివ్వున మెరుపు వేగంతో లేచి కూర్చుంది రాధ. ముఖం ప్రక్కకి తిప్పుకుని కోపంతో,

"సుశీలా!, శశికళా! మాధవీ! అభ్యంతర మందిరంలోకి పరాయివారి నెటుల రానిచ్చితిరే? వీరిని తక్షణం వెలుపలకు పంపుడు!" అని గట్టిగా పలికింది.

"ప్రియసఖీ! వారి దోషం లేదు. వారు తమ విధిని చక్కగానే నిర్వర్తించారు. ప్రియావిరహ మోపలేక వారిని ధర్షించి నేనే అభ్యంతర మందిరంలో ప్రవేశించాను. ప్రాణప్రియా ....." ఒక్క అడుగు ముందుకి వేశాడు శ్రీకృష్ణుడు.

అప్పుడే ఈనిన ఆడపులి లాగా బొబ్బ పెట్టినట్టుగా కోపంతో,

"ఇక్కడ ఎవరికి ఎవరు ప్రియురాలు? మీకై మీ ప్రియురాలు విరజ వేచి చూచే తావిది కాదే!" అన్నది రాధ.

"రాసేశ్వరీ! నా ప్రాణాధికవు నీవే కదా!" కంఠంలో దీనత్వం ఒలికిస్తూ పలికాడు శ్రీకృష్ణుడు.

"ఎంతటి నటన? చపలబుద్ధివి. నన్ను బాధించక నా ముందు నుండి వైదొలగి పొమ్ము! విరజ వద్దకు కాక పోయిన రత్నమాల వద్దకో వనమాల వద్దకో పొమ్ము. విషయాసక్తుడవు మాత్రమే కాదు, మానవుల వ్యవహారములన్నను నీ కాసక్తియే! కనుక నీకు మానవ జన్మ తగి ఉంటుంది. గోలోకమునుండి భారతఖండమునకు పొమ్ము!

విషయ లోలుడ! నర విషయ లోలుడ నీకు
మర్త్య లోకముననె మనికి సరి
భరత భువిని పుట్టు వదలి గోలోకమ్ము
విరజ లోలున కిది సరియ గాదె!"

నోటి వెంట అప్రయత్నంగా వచ్చిన మాటలు శాపవాక్కుగా పరిణమించటంతో రాధాదేవి కోపం కొద్దిగా ఉపశమించి నట్టయింది. తను చేసిన పనిని పర్యాలోచన చేయసాగింది. శ్రీకృష్ణుడు భూలోకంలో జన్మిస్తే .....! తా నతడిని వదలి ఉండ గలదా ..... ? ఆత్మావలోకనంలో మునిగి పోయింది.

సుదాముడు శ్రీకృష్ణుని వంక చూశాడు. ఆయన ముఖంలో ఎటువంటి మార్పూ లేదు. చిరునవ్వు చెక్కుచెదరలేదు. తల పంకించి మౌనంగా ఉండి పోయాడు.

సుదాముడికి కోపం మిన్ను ముట్టింది. ముఖం కన్నులు ఎర్రబడ్డాయి. రాధ నుద్దేశించి కోపాన్ని వీలైనంత అణచుకునే ప్రయత్నం చేస్తూ ఇలా అన్నాడు.

"తల్లీ! ఎందుకింత కఠినముగా మాటలాడుచుంటివి? శ్రీకృష్ణప్రభువు సామాన్యుడా? బ్రహ్మాది దేవతల చేత స్తుతింపబడేవాడు, వేదపురుషులు లైన ఉపనిషత్తుల లక్ష్య మైనవాడు, ముగురమ్మల చేత సేవింపబడేవాడు, జగద్రక్షకుడు, నీకును, నాకును, అందరకును ప్రభువు, సృష్టి స్థితి లయకారకుడైన శ్రీహరి పాదపద్మాలను సేవించుకోవాలే కాని, ఆయనపై కోపగించటం తగదు. శాంతించు తల్లీ! శాంతించు!!"

తగ్గు ముఖం పట్టిన రాధ కోపం సుదాముని ఒక్కొక్క మాటతో మళ్ళీ పుంజుకుని ఎక్కువ అయి రాను రానూ తీవ్రతరం అవ సాగింది. ఆ తీవ్రతకి తట్టుకో లేక,

"ఓరీ! వాచాలుడా! సుదామా!! శ్రీకృష్ణుడు నీకు ప్రభువు. మాకు కాదని తెలుసుకో! అన్నీ తెలిసిన వాని వలె మాటాడుచున్నావు. తండ్రిని పొగడుచు, తల్లిని నిందించుట తెలివిగలవారు చేయు పనియేనా? ఎల్లప్పుడూ అకారణముగా దేవతలను నిందించుట రాక్షసులు చేయు పని. నీవును వారి వలెనే నన్ను నిందించుచున్నావు. కనుక నీవు రాక్షసజన్మను పొందుదువు గాక!" అన్నది.

తిరిగి మరొక్క శాపవాక్కు రాధాదేవి ముఖకమలం నుండి వెలువడింది. ఇదియు ప్రయత్న పూర్వకము కాదు. కోపావేశం, దాని దుష్పరిణామం ఆమె మనస్సుని కనల చేయటంతో రాధ మూర్ఛితురా లయింది. శ్రీకృష్ణుడు ఆతురుడై ఆమెను సమీపించేలోపే తేరుకుంది.

"మానవకాంత వలె కోపం పొందావు కనుక తల్లీ! నీవు భూమి మీద మనుష్య స్త్రీగా జన్మించ గలవు. నీకీ కోపం కలగటానికి పరాశక్తి యొక్క కలంకపు నీడయో, అంశయో కారణమై ఉంటుంది. ఆ కలంకపు నీడ కారణంగా అవివేకులు శ్రీహరి అంశతో జన్మించ నున్న రాయణుడి భార్యవని అపనిందలు వేయగలరు. నీ శాపం కారణంగా శ్రీకృష్ణుడు కూడా గోకులంలో జన్మిస్తాడు. నీవతనితో బృందావనంలో విహరించి, తరువాత వందసంవత్సరాలు వియోగం అనుభవించిన పిమ్మట గోలోకానికి రాగలవు."

ఈ మాటలు పలికిన తరువాత సుదాముడు రాధాదేవికి నమస్కరించాడు. దుఃఖం ముంచుకుని రాగా పసిపిల్లవాడి వలె ఏడువ సాగాడు. రాధాదేవి కూడ దుఃఖపరవశురాలై నిశ్చేష్టత నొంది ఉంది. శ్రీకృష్ణుడు సుదామునితో –

"మిత్రమా! వగపేల? ఇది నీ పాలిట వరం. భూలోకంలో నీ అభీష్టం నెరవేరుతుంది."

"నీ కోరిక తీరే సమయం ఆసన్నమైనదని నీవన్న మాటల అర్థం ఇదా? నీ సాన్నిధ్యం నుండి వేరు చేసేది ఏదైనా, అది నా అభీష్టం కాదు. నిన్ను, గోలోకాన్ని వదలి జీవించటం నా వల్ల కాదు. ఆ ఊహయే భరింపరానిదిగా ఉంది."

"సుదామా! బాధ పడకు. భూలోకంలో గొప్ప రాక్షసుడవై, అంతులేని కీర్తిప్రతిష్ఠలను సముపార్జించి, శంకరుని శూలప్రహారంతో శరీరం వదలి గోలోకానికి తిరిగి వస్తావు."

"శ్రీకృష్ణా! రాధాపతీ!! జన్మ ఏదయినా నీ పట్ల భక్తి స్థిరంగా ఉండేట్లు అనుగ్రహించు. నా మాతృమూర్తి వేదనకు ఉపకరణమైన నాకు ఈ పాటి శిక్ష తగినదే!"

శ్రీకృష్ణునికి నమస్కరించి, రాధను సమీపించి " అమ్మా! ఈ అభాగ్యుని కరుణించు." అని నమస్కరించి దీనవదనంతో అక్కడి నుండి బయలు దేరాడు. రాధ అతడి వెనుకనే నాలుగడుగులు వేసి,

"కుమారా! ఎక్కడికి పోవుచున్నావు నాయనా! మమ్ము వీడి వెళ్ళుచున్నావా?" అని బాధగా అన్నది.

"నాకు మాత్ర మిష్టమా తల్లీ! అవశుడను. అనుగ్రహించు." అంటూ వేగంగా కదిలాడు.

రాధ శ్రీకృష్ణుని చూస్తూ, " గోలోకమును వీడి పోవుట ఎట్లు?" అన్నది బాధగా.

శ్రీకృష్ణుడు "ప్రాణప్రియా! దిగులు చెందకు." అని ఓదార్పుగా అన్నాడు.

"ప్రాణేశ్వరా! నీవు లేకుండా నేను భూలోకమున నెట్లుండ గలను? ..... ప్రాణము లేకుండ బ్రతుకుట సాధ్యమా? ..... నీవుండగల వేమో! కానీ నావల్ల సాధ్యం కాదు."

"బాలా! నన్ను ముందుగానే భూలోకానికి పంపినావు గదా! నిన్ను వదలి నేనుండ లేకనే కదా, నీకును భూలోకవాసం కలుగు నట్లు చేసినది."

"ఏ లోకంలోనైనా, ఏ జన్మలో నైనా నీ దాస్యం, నీ స్మరణం నాకు వరంగా అనుగ్రహించు. మనము రాధాకృష్ణుల మనుమాట, మన అవినాభావ సంబంధము జ్ఞప్తి యందుండునట్లు వరము ప్రసాదించు. క్షణమాత్ర వియోగం కూడ లేకుండా దయ చూడు." రాధ శ్రీకృష్ణునికి ప్రణమిల్లింది.

శ్రీకృష్ణుడు పరమాదరంతో రాధను లేవనెత్తి, అక్కున చేర్చుకొని,

"రాధికా! నీకు తెలియదా,

యథా క్షీరేచ ధావల్యం, దాహికాచ హుతాశనే
భూమౌ గంధం జలే శైత్యం తథా త్వయి మయి స్థితే !
ధావల్య దుగ్ధయోరైక్యం దాహికానలయో ర్యథా
భూ గంధ జల శైత్యానాం నాస్తి భేదస్తథాఽ వయోఃఽ!!

ప్రియతమా! నీవు లేక నేను అశక్తుడను. నిన్ను వదలి నేను మాత్రముండ గలనా? నీవు వృషభానుని ఇంటికి పొమ్ము. కళావతీ వృషభానుల కుమార్తెవై అవతరింపుము."

"నేను చేసిన చిన్న పొరపాటున కింతటి శిక్షయా? గర్భవాస నరకమే నాకు తగినదా? నీ దయాగుణం, నామీద ప్రేమ ఏమైనవి?"

"చింతించ వలదు ప్రాణేశ్వరీ! నీకట్టి కష్టము లేదు. మన మిరువురము అయోనిజులుగానే అవతరించ గలము. గాలితో నిండిన కళావతి గర్భము నుండి వాయువు బయటికి వచ్చు సమయములో నీవు శిశువు రూపం ధరించి, అప్పుడే పుట్టిన బిడ్డ వలె కెవ్వు మనుము. నీవు కోరినట్లు నీకు స్వస్వరూప జ్ఞానం ఉంటుంది. మనము సుందర బృందావనమున విహరింతము. నీ ముప్పది ముగ్గురు సఖీ జనముతో, డెబ్బది మూడు శత కోటుల గోపికలతో గోకులమునకు పొమ్ము. నేనును వచ్చుచుంటిని కదా!"

"నాథా! గోలోకమును వదలి పోవుట ఎట్లు?"

"నీవు అడుగిడుటకు ముందుగానే నీకు తగినట్టు అమర్చటం జరిగి పోయింది. గోలోకానికి ప్రతిరూపం గోకులం. అందు నీ ఆనందము కొరకు రాసమండలమును బృందావనముగాను, శతశృంగ పర్వతమును గోవర్ధన పర్వతముగాను, విరజానదిని యమునానది గాను గోకులమున ప్రవేశించి, నీ రాకకు ఎదురు చూడమని

ఆదేశించితిని కదా! ఇక సందేహము లేమియు లేవుగా! క్రొత్త ప్రదేశం లో అక్కడి క్రొత్త అందాలను అనుభవిస్తూ క్రొత్త ఆనందాలకి ఎదురు చూడు."

"ధన్యురాలను ప్రభూ! "

"శుభం భూయాత్!"

రాధ అంతఃపురము నుండి వెలుపలికి వచ్చి తనలో

"మరియొక అవతారమున కిది నాంది."

అనుకుంటూ ముందుకి సాగుతాడు శ్రీకృష్ణ పరమాత్మ.

6

బృందావనేశ్వరితో పాటు పరివారమంతా గోకులానికి తరలింది రాధారాణికి తగిన వాతావరణ పరికల్పనకు. నిజానికి గోలోకమే అక్కడ ప్రత్యక్షమైనట్టుగా ఉంది. విరజ సూర్యపుత్రికగా జన్మించి, బృందావనాన్ని ఒరసుకుంటూ ప్రవహిస్తోంది. శతశృంగ పర్వతం గోవర్ధనపర్వతంగా ఆవిర్భవించింది. గోలోకంలోని రాసమండలం గోకులంలో బృందావనంగా సుందరోద్యానవనమై శోభిల్లుతూ రాధారాణి రాకకు ఎదురు చూస్తూ రోజుకొక అందం సంతరించుకుంటోంది.

గోలోకంలో ఉన్న గోపకులు కూడ కృష్ణ విరహమోపక భూలోకంలో అవతరించటానికి అనుజ్ఞనిమ్మని ప్రార్థించారు. భక్తప్రియుడు వారి కోరికను కాదనగలడా? వారు నిర్వర్తించదగిన పనులు ఎలాగూ ఉంటాయి. వారి వారి మనోభీష్టాన్నుసరించి జన్మలను స్వీకరించారు. ఎంత వింత! ఎవ్వరైనా జన్మరాహిత్యం కోరుతారు. కాని, కృష్ణుని సానిహిత్యాన్ని వదలుకోలేని వారు – జన్మబంధానికి అతీతులైన వారు – మానవ జన్మను కోరుకున్నారు. కృష్ణుని సన్నిధి పరమదము కన్న వాంఛనీయము కదా!

వసుదాముడు ఒక గొల్లపల్లెలో సునందుడనే గ్రామపెద్ద కుమారుడుగా వృషభానుడనే పేరుతో జన్మించాడు. తండ్రి ఇతడు జన్మించినపుడు కొడుకు పుట్టాడనే ఆనందంతో ఎంతో మంది బ్రాహ్మణులకు ఒక్కొకరికి వంద చొప్పున గోవులను దానం చేశాడు. అందువలన చిన్నతనంలో అతడిని శతగోపుడని పిలిచేవారు.

వృషభానుడు పుట్టిన తరువాత మంచి జాతి ఆబోతు ఉన్న ఆవుల మందలాగా సునందుని గోసంపద వృద్ధి చెందింది. శతగోపుడన్న పేరు సహస్రగోపుడయింది.

ఒక సారి దాముడనే గోపుడు, సమీపంలో ఉన్న మరొక మంద నుండి వచ్చాడు. సునందుడితో మాటల సందర్భంలో చమత్కారంగా ఒక మాట అన్నాడు.

"ఏమయ్యా! సునందా!! నీ కొడుకు పుట్టినప్పుడు బ్రాహ్మణులకు నువ్వు దానం చేసిన గోవులే ఎన్నో వేలున్నాయి. నీ కొడుకుకి మిగిల్చి ఇచ్చినది వెయ్యి గోవులేనా?"

సునందుడు నవ్వాడు.

"దామా! అంతేనా నీ కర్థమయింది? వెయ్యి అంటే లెక్క పెట్టలేనన్ని అని అర్థం. శ్రీ మహావిష్ణువుని ' సహస్ర శీర్షుడు, సహస్రాక్షుడు, సహస్ర పాదుడు' అని కీర్తిస్తాము. అంటే సరిగ్గా లెక్క పెట్టి అన్నే ఉంటాయని అర్థం కాదు కదా! అనంతం అని తెలుసుకోవాలి." అన్నాడు సునందుడు.

"తెలుసు లేవయ్యా! నువ్వేం చెపుతావో విందామని." అని సద్దుకున్నాడు దాముడు.

గో సంపద మాత్రమే కాదు, సద్గుణాలు కూడ కొల్లలుగా ఉన్నాయి వృషభానుడికి. నిజానికి సునందుడు ' మీ అమ్మాయిని మా ఇంటి కోడలిగా ఇవ్వం' డని కన్య తండ్రిని అడగాలి. అది సంప్రదాయం. కాని, వృషభానుని గుణగణాలకి ముచ్చట పడిన కన్యల తండ్రులు వారే తమ కుమార్తెను మీ ఇంటి కోడలిగా చేసుకుంటే బాగుండునని అడగ సాగారు. సునందుడు కొద్దిగా గర్వపడ్డాడు. దానికి తోడు ఇదొక సమస్య. ఎవరిని కాదంటే ఎవరికి కోపం వస్తుందో! లేని పోని శత్రుత్వాలు, చికాకులు. ఆలోచనలో పడ్డాడు.

❀ ❀ ❀

పితృదేవతల మానస పుత్రికలలో కళావతి ఒకతి. ఒకప్పుడామె జగన్మాత తన కుమార్తె అయితే బాగుండునని అనుకుంది. అది కూడా చాలా తీవ్రంగా, త్రికరణ శుద్ధిగా అనుకుంది. కోరిక తీవ్రత ఘనీభవించి వరాహకల్పంలో భూలోకంలో గోకులంలోని ఒక మందలో అవతరించింది. పదునారు కళలతో విరాజిల్లే పున్నమి చంద్రుని వలె వెలిగిపోతున్న ఆ బాలికకు కళావతి అని పేరు పెట్టారు. జ్యోతిష్కులామె జాతక చక్రాన్ని పరిశీలించి, ఈ బాలిక పుట్టినింటికి, మెట్టినింటికి కీర్తి ప్రతిష్ఠలను

తెస్తుందని చెప్పారు. ఇంకేముంది? కీర్తిని ఇచ్చేదని కీర్తిద అని పిలవటం మొదలుపెట్టారు. ఆమె అందచందాలు, గుణగణాలు చుట్టుప్రక్కల అన్ని మందలలోను కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. సునందుడి చెవిన పడ్డాయి ఆ మాటలు. తన ఆలోచన ఒక కొలికికి వచ్చినట్టనిపించింది.

కళావతి వృషభానుపత్ని అయింది. సుఖసంతోషాల ననుభవిస్తూనే నియమనిష్ఠలతో ధర్మబద్ధమైన దాంపత్య జీవితం గడుప సాగారు. తమకు సంతానం ప్రసాదించమని తమ కులదైవాన్ని వేడుకున్నారు.

పెరట్లో ఎవ్వరూ చూడలేదనుకొని కళావతి మట్టిబెడ్డను నోట్లో వేసుకోవటం అత్తగారికి సంతోషం కలిగించింది. కోడలికి కోరిన వన్నీ చేసి పెట్టింది. అడగక ముందే అన్నీ అమర్చింది. అచ్చటలు ముచ్చటలు ముద్దు ముద్దుగా తీర్చింది. కాలు క్రింద పెడితే కమలి పోతుంది, అడుగులు వేస్తే అలసి పోతుంది, పన్నెత్తి పలికితే ఆయాస పడుతుంది అని అపురూపంగా, ఆప్యాయంగా చూసుకుంది. పురిటికి పుట్టింటికి వెళ్లాలని కూడ కళావతికి అనిపించ కుండా గారాబంగా చూసుకుంది.

కళావతి నడుస్తుంటే దేవతా విగ్రహాలని ఊరేగిస్తున్న భద్రగజంలాగా తోచేది. అత్తగారు బతిమాలి పెడుతుంటే కొద్ది కొద్దిగా తినటం చూస్తే నైవేద్యం స్వీకరిస్తున్న దేవతామూర్తి అన్న భ్రమ కలిగేది. ఒళ్ళు చేసి గుమ్మడిపండులాగా కళకళ లాడుతూ మందయానంతో ఇంట్లో నడయాడుతున్న కళావతి భూదేవి ప్రతిరూప మనిపించేది. అత్తమామలకు మురిసిపోవటం తప్ప మరొక పని లేదు.

నెలలు నిండాయి. ఎదురు చూస్తున్న శుభఘడియ రానే వచ్చింది. ఆ రోజు భాద్రపద శుక్ల అష్టమి. అర్ధరాత్రి కావస్తోంది. సాయంత్రం నుండి కళావతికి ఎవరో పొట్టలో చక్కలిగిలి పెడుతున్నట్టుగా ఉంది. చిన్ని చిన్ని సీతాకోకచిలుకలు తమ బుజ్జి బుజ్జి రెక్క లల్లార్చుతూ తన పొట్టలోపల ఎగురుతున్నట్టుగా ఉంది.

"పురిటి నొప్పులేమో !" అన్నది అత్తగారు.

"నోప్పేమీ లేదు. చక్కలిగిలిగా ఉంది. అంతే!" అన్నది కళావతి.

"చిన్నపిల్లవు. నీకేమీ తెలియదు."

మంత్రసానిని రమ్మని చెప్పి పంపింది. ఇరుగమ్మ, పొరుగమ్మలని తోడు పిలుచుకుంది తొలిచూలు కదా అని. వేడినీళ్ళు బానలతో సిద్ధం చేసింది.

అర్ధ రాత్రి దాటింది. నొప్పులు పెద్దగా రావటం లేదు. ముచ్చటలాడుకుంటూ, ఆడుకుంటూ పురిటి గదిలోనే వారందరూ గోడలకి చేరగిల బడ్డారు. కొన్ని నిమేషాలు మాగన్నుగా నిద్ర పట్టినట్టుంది. కళావతి మూలుగుకి ఉలిక్కి పడి లేచారు. మంత్రసాని మంచం దగ్గిరగానే ఉంది.

"ఏమైంది దొరసానీ! నొప్పులు వస్తున్నాయా?" అడిగింది.

"లేదు. ఏదో గాలి లోపల నుండి బయటకు పోయినట్టుగా తేలికగా, హాయిగా ఉంది. అందుకే పెద్దగా నిట్టూర్చాను." అంది కళావతి.

మంత్రసాని కంగారు పడి మంచంపై చూసింది. నిండు చంద్రుని వలె వెలిగి పోతూ, పోతపోసిన బంగారుబొమ్మ లాగా ఉన్న సర్వలక్షణశోభితయైన బాలిక కనపడింది. మంత్రసానికి అయోమయంగా ఉంది.

"తామందరూ ఇక్కడే ఉన్నారు కదా! ఈ బిడ్డ ఎప్పుడు పుట్టింది? మాయ ఎక్కడా లేదే? ఎవరు బొడ్డు కోశారు? అసలు కళావతి పురిటి నొప్పులు కూడా పడలేదే? తనే అన్నీ చేసి మరచి పోయిందా? అమ్మో! అంతా సవ్యంగా అయింది కనుక సరిపోయింది. లేక పోతే?.... తను ఒక్క క్షణం కన్ను మూసిన సంగతి తెలిస్తే?..."

అటూ ఇటూ చూసింది. ఎవరూ గమనించినట్టు లేదు. ఎవరికి వారు తాము కొద్దిసేపు నిద్రలోకి జారుకున్నట్టు ఇతరులు గుర్తించకుండా జాగ్రత్తపడుతున్నారు.

"అమ్మయ్య!" నెమ్మదిగా నిట్టూర్చింది మంత్రసాని ఎవరికీ వినపడకుండా.

అందరికీ వినపడే విధంగా " బంగారంలాంటి పాపాయిని కని గాలి అంటావేమిటి దొరసాని?" అంది.

కళావతి ఆశ్చర్యంగా తన శయ్య మీద చూసింది. తన ప్రక్కలో అందాలు చిందే చందమామ చిరునవ్వులు చిందిస్తోంది. "ఇంత పెద్దబిడ్డ నా పొట్టలో ఇమిడి ఉన్నదా ఇంత కాలం?" అని విస్తు పోయింది.

"పెద్ద దొరసానీ! ఎక్కడున్నావు? మహాలక్ష్మి మీ ఇంట వెలిసింది. ఇదుగో! ఇంక మీ ఇంట్లో దీపం వేరే పెట్టనక్కర లేదు. ఈ దీపం లోకానికంతటికీ వెలుగునిస్తుంది. ఎంతటి భాగ్యవంతురాలివమ్మా! నాకు మంచి కానుక ఇవ్వాలి.

మనుమరాలిని చూసి, నా సంగతి మరచి పోవద్దమ్మో!" మంత్రసాని ఏదో ధోరణిలో అలా మాట్లాడుతూనే ఉంది.

పెద్దదొరసాని మనుమరాలిని చూసి మురిసిపోయింది. తన మెడలో ఉన్న ముత్యాల దండ తీసి మంత్రసాని మెడలో వేసింది. ప్రసూతి గృహంలో ఉన్న ఇరుగు పొరుగు వారందరు కళావతి అదృష్టాన్ని మనస్ఫూర్తిగా పొగిడారు.

సునందుడి సంతోషానికి హద్దులు లేవు. వందల గోవులను బ్రాహ్మణులకు దానం చేశాడు. వృషభానుడి ఆనందం వర్ణనాతీతం. నోట మాట రాలేదు. తన జన్మ ధన్యమైందనుకున్నాడు. తమ కులదైవం తమ ఇంట ఆవిర్భవించిందని ఆ తల్లికి కృతజ్ఞలు తెలుపుకున్నాడు.

ఆడవారందరు వారి ఇళ్లకు వెళ్ళే వరకు ఎలాగో ఆగి, వారు వెళ్ళగానే తండ్రి కొడుకులు తమ ఇంటిదీపాన్ని చూడటానికి ప్రసూతిగృహంలో ప్రవేశించారు. గది అంతా ప్రకాశమానంగా వెలిగిపోతోంది. సాధారణంగా ప్రసూతిగృహంలో అంత పెద్ద దీపం పెట్టరు. ఆశ్చర్య పోయారు తండ్రీ, తాత. ఎక్కడిదీ వెలుగు అని చూశారు. తల్లి ప్రక్కలో నిదురిస్తున్న పసిబిడ్డ ముఖతేజస్సు గది నిండా పరచుకొని ఉంది. చంద్రుడి వంటి ముఖంలో తామరరేకుల వంటి కన్నులు మూసికొని ఉంది. చంద్రుని సమ్ముఖంలో పద్మాలు ముడుచుకు పోవటం సహజమే! తీర్చి దిద్దినట్టున్న సంపంగి వంటి నాసిక అప్పుడే పుట్టిన పసికందుకి ఉండటం చూసి ఆశ్చర్య పోయారు. దేహం బంగారుకాంతితో మెరిసిపోతోంది. నల్లని వత్తైన ఉంగరాలు తిరిగిన కురులు చంద్రుని చుట్టూ చేరిన శ్రావణమేఘాలను తలపింప చేస్తున్నాయి. అరచేతులు, పాదాలు ఎర్రతామర రేకుల లాగా ఉన్నాయి. పాదాలలో శంఖం, చక్రం, పద్మం, వంటి శుభలక్షణాలను గమనించి, ఈ బిడ్డ దైవాంశ సంభూతురాలు అని నిర్ణయించుకున్నారు. పుట్టిన శిశువు కెవ్వుమన లేదు, కేరు మనలేదు, ఏడవలేదు అని ఎవరూ గమనించకపోవటం ఆశ్చర్యం. పాప చిరునవ్వు మాయలో పడిపోయారు.

7

మూడో రోజున గాని నాలుగో రోజున గాని కళ్ళు తెరవ వలసిన పాపాయి పదో రోజు కూడా ఆల్చిప్పల్లాంటి కనురెప్పలను ఎత్తి కళ్ళు తెరవ లేదు. కనీసం రెప్పలు కదప లేదు. ఏడవ లేదు. ఆ ఇంటిలో ఉవ్వెత్తున ఎగసిన ఆనందపుటలు

విరిగి పడ్డట్టుగా అయింది. అందమైన కన్నులు లోకంలోని అందాన్ని చూడలేవా? గొంతు పలుకదా? మాట అయినా విన పడుతుందో లేదో? ఆకలయినా ఉందో లేదో? పాలయితే తాగుతోంది. అదృష్టమంటే కళావతీ వృషభానులదే అన్న వారందరు "అయ్యో పాపం! ఎంత దురదృష్టం!" అంటున్నారు. అసలు బాధకన్న సానుభూతి మరింత బాధాకరం.

ఆ సమయంలో నారాయణ నామగానం నింగిలో విన పడుతుంటే అందరూ తలెత్తి చూశారు. మహతి పలికిస్తూ నారద మహర్షి కనిపించారు. అందరూ చేతులెత్తి నమస్కరించారు. నారదుడు పసిబిడ్డ ఉన్న గదిలో దిగి కృష్ణకీర్తన చేయసాగాడు.

"జయ కృష్ణ జయ కృష్ణ
జయ జయ కృష్ణ
జయ జయ జయ జయ
జయ జయ కృష్ణ ॥ జయ ॥

గోపాల కృష్ణ, గోవింద కృష్ణ
గోపీజనలోల, రాధాకృష్ణ
బృందావన విహార కృష్ణ
రాసవిధాయక రాధాకృష్ణ ! ॥ జయ ॥

వందారు మందార శ్యామసుందరా
రాధా ప్రాణాధీశ .....

పసిబిడ్డ నెమ్మదిగా కనురెప్పలు కదలించింది. నారదుడి కనుసైగ చూసి అందరూ గదిలోనుండి అవతలికి వెళ్లారు. కళావతి మగత నిద్రలో మునిగిపోయింది. నారదుడు ఆ బిడ్డకి సాష్టాంగ నమస్కారం చేశాడు.

"అమ్మా! రాధాదేవీ! ఒకప్పుడు నారాయణుడు నాతో నిన్ను గురించి ఈ విధంగా కీర్తించాడు.

"ప్రేమా ప్రాణాధిదేవీ యా పంచప్రాణ స్వరూపిణీ!!
ప్రాణాధికప్రియతమా సర్వాద్యా సుందరీ వరా!
సర్వసౌభాగ్యయుక్తా చ మానినీ గౌరవాన్వితా!!

వామార్ధాంగ స్వరూపా చ సుగుణైస్తేజసా సమా!
పరా వరా సర్వమాతా పరమాద్యా సనాతనీ!!

పరమానందరూపా చ ధన్యా మాన్యా చ పూజితా!
రాసక్రీడాధిదేవీ చ కృష్ణస్య పరమాత్మనః !!

రాస మండల సంభూతా రాసమండల మండితా!
రాసేశ్వరీ సురసికా రాసావాసనివాసినీ!!

గోలోకవాసినీ దేవీ గోపీవేషవిధాయికా!
పరమాహ్లాదరూపా చ సంతోషామర్ష రూపిణీ!!

నిర్గుణా చ నిరాకారా నిర్లిప్తాత్మస్వరూపిణీ!
నిరీహా నిరంహంకారా భక్తానుగ్రహవిగ్రహా!!

వేదానుసార ధ్యానేన విజ్ఞేయా సా విచక్షణైః !
దృష్టిర్దృష్టా సహస్రేషు మునీంద్రైర్ముని పుంగవైః !!

వహ్ని శుద్ధాంశుకాధానా రత్నాలంకార భూషితా!
కోటి చంద్రప్రభాజుష్ట శ్రీ యుక్తా భక్తవిగ్రహా!!

శ్రీకృష్ణ భక్తదాస్యైకదాయినీ సర్వసంపదాం!
అవతారే చ వారాహే వృషభానుసుతా చ యా!!

యత్పాదపద్మ సంస్పర్శ పవిత్రా చ వసుంధరా!
బ్రహ్మాదిభిరదృష్టా య సర్వదృష్టా చ భారతే!!

స్త్రీరత్నసార సంభూతా కృష్ణ వక్షః స్థల స్థితా!
తథా ఘనే నవఘనే లోల సౌదామినీ మునే!!"

"రాధామహాదేవీ! శ్రీకృష్ణభక్తిని ప్రసాదించగలదానవు నీవొక్కతెవే. మాకందరకు ఏకైక శరణ్యవు. నీ అవతార కారణం నీకు తెలుసు. నీ వీ విధంగా బధిరాంధమూక స్థితిలో ఉండటం తగదు. నీ కర్తవ్యం ఎరుగుదువు కదా! తల్లీ! కన్నులు తెరువ వలసినది. అతి త్వరలో నీ ప్రాణనాథుడు నందవ్రజంలో అవతరించ బోవుచున్నాడు. మీ సమాగమ సమయానికి సంసిద్ధం కావలసి ఉన్నది కదా! రాసేశ్వరీ! రాధారాణీ!! కన్నులు తెరువ వలసినది. ఈ సృష్టి సమస్తం ఆ పరమపురుషుడైన కృష్ణుని దేహమే

కదా! నిమీలిత లోచనవైనచో కనుట ఎట్లు? కృష్ణప్రియా! కన్నులు తెరచి అనుగ్రహించ వలసినది. నిన్ను కుమార్తెగా పొందాలని పూర్వ భవంలో ఎంతో తపించి, తపస్సు చేసిన కళావతీ వృషభానులకు కుమార్తెగా సంతోషాన్నివ్వ వలసి ఉన్నదమ్మా! మేలుకొని, మమ్ము ఏలుకొన వలసినది."

నారదుడి స్తుతి, హిత మిత ప్రియ వాక్కులనే అమృతం చిలకటంతో ఆ బిడ్డ కళ్ళు పూర్తిగా తెరచే ప్రయత్నాలు చేసింది.

"రాధామహాదేవీ! మరొక్క మారు వందనాలందుకో తల్లీ! మాపై దయ తప్పనీయ వద్దు." అంటూ నారదుడు గది వెలుపలికి వచ్చి, సునందాదులతో

"రాధాదేవికి రక్ష పెట్టాను. నెమ్మదిగా కన్నులు తెరచి చూస్తుంది. భయపడ వలసిన పని లేదు. " అని

"నారాయణ! నారాయణ!!" అని నామం చేస్తూ వీను వీధికి ఎగిరి వెళ్ళాడు.

"రాధాదేవి!?" సునందుడు గొనిగాడు.

"రాధాదేవా?" వృషభానుడు ఆశ్చర్య పోయాడు.

"నారదుల వారు నామకరణం చేసి వెళ్లారు" మురిసి పోయింది నాయనమ్మ.

8

సుదాముడు రాధారాణి శాపప్రభావం కారణంగా దానవవంశంలో జన్మించాడు. విప్రచిత్తి కుమారుడు దంభునికి కుమారుడుగా పుట్టాడు. అతడే శంఖచూడుడు పూర్వజన్మసంస్కారం అతడిని మహాయోగిగా, కృష్ణభక్తునిగా చేసింది. పుష్కరక్షేత్రంలో తపస్సు చేసి, బ్రహ్మను మెప్పించి, శ్రీకృష్ణమంత్రాన్ని ఉపదేశంగా పొందాడు. తపస్సు ఎంత దీక్షగా చేశాడో ఆ మంత్రాన్ని అంత శ్రద్ధగా జపించి, మంత్రసిద్ధిని పొందాడు. దుర్లభమైన శ్రీకృష్ణకవచాన్ని కూడా పొందాడు. అతడి భక్తి శ్రద్ధలకు ముచ్చట పడిన బ్రహ్మ బదరికాశ్రమానికి వెళ్ళమని ఆదేశించాడు.

తపస్సు చేయటానికి ఎంతో అనుకూలంగా ప్రశాంతమైన వాతావరణం నెలకొని ఉంటుంది బదరికాశ్రమంలో దేవదారువృక్షాల మీద నుండి వస్తున్న మందమారుతం పరిసరాలను పరిమళభరితం చేస్తోంది. బదరీవృక్షాలు

నరనారాయణుల తపస్సుకి సాక్షులుగా నిలిచి పవిత్రతను వెదజల్లుతున్నాయి. ఆ వాయుస్పర్శ శంఖచూడుని అంత వరకు ఎరుగని లోకాలలో ప్రవేశ పెట్టింది. నరనారాయణుల పాదస్పర్శ సోకి పునీతమైన ఆ నేల శంఖచూడుని నేల మీద నిలువ నీయలేదు. మహాయోగి అయిన శంఖచూడుడి మనస్సులో ఆ దివ్యమైన పరిసరాలలో అడుగు పెట్టగానే మార్పు చోటు చేసుకుంది. పవిత్రమైన దివ్యభావనకు మరేదో తోడయింది.

దానికి కారణం అతడికి అక్కడ ఒక అపురూపసౌందర్యరాశి దర్శనం. దానికి ఉపబలక మయినవి ఆ అందాలబొమ్మ చేష్టలు. అందానికి మెరుగు పెడుతున్న రత్నహారాలు, కేయూరాలు, రత్నాంగుళీయకాలు ధరించి మనోహరంగా ఉన్న ఆ సుందరి శంఖచూడుడిని చూడగానే మన్మథప్రేరితయై నునుసిగ్గుతో చిరునవ్వు చిలుకరించింది. పుష్పశయ్యపై శయనించి ఉన్న ఆ కుసుమకోమలి అతడి సౌందర్యాన్ని త్రాగుతున్నట్టే ఓరకంట చూడ సాగింది. సిగ్గుపడుతున్నట్టే ఉంది. కానీ, సిగ్గే సిగ్గు లేనిదయింది.

శంఖచూడుడు ఆ సుకుమారి సమీపంలో కూర్చొని ,

“ఓ బాలికా! నీ వెవరవు ? నీవెవరి కుమార్తెవు? నీ సౌందర్యము విశిష్టమైనది. ఎవరి నైనను ఆకర్షించ గలదు. దేవతల నైనను, మహర్షుల నైనను కట్టిపడవేయ గలదు. నీ అందానికి దాసోహం. నీ పలుకుల ముత్యాలను ఒలికించి నా సందేహాలను తొలగించు.” అన్నాడు.

ఆ అన్నులమిన్న మందహాసం చిందించి తల వంచుకొని నెమ్మదిగా చెప్పటం మొదలు పెట్టింది.

“నేను .....”

శంఖచూడుడు శ్రద్ధగా వింటున్నాడు.

9

దక్షసావర్ణిమనువువంశంలోని వాడు హంసధ్వజుడు. అతడి కుమారులైన ధర్మధ్వజ, కుశధ్వజులు లక్ష్మీదేవిని గూర్చి గొప్ప తపస్సు చేసి, ఆమె నుండి వరాలు

పొంది, అ తల్లి అనుగ్రహంవల్ల రాజు లయ్యారు. కుశధ్వజుని భార్య మాలావతికి వేదవతి జన్మించింది.

ధర్మధ్వజుని భార్య మాధవి కూడా గర్భవతి అయింది. లక్ష్మీదేవి అనుగ్రహంవల్ల మహాలక్ష్మి అంశతో సలక్షణమైన కుమార్తె కలిగింది. కార్తిక పూర్ణిమ నాడు రాకాసుధాకరసన్నిభమైన కాంతితో వెలిగిపోతున్నమోముతో ముద్దులు మూటగట్టే శిశువును చూచి గవాక్షంలో నుండి తొంగి చూస్తున్న చందమామ తన ప్రక్కన ఎప్పుడు చేరిందా? అని ఆశ్చర్య పోయింది మాధవి. పురిటి నొప్పుల బాధ ఉపశమించగానే. ఎర్రతామర రేకులు ఎవరు తెచ్చి శయ్య మీద ఉంచారా? అని విస్తుపోయింది. అవి బిడ్డ అరచేతులు, పాదాలు అని అర్థం చేసుకోవటానికి కొద్ది సమయం పట్టింది. తెల్లని సంపంగి చాయతో పరుండ బెట్టిన తెల్లని పట్టువస్త్రాలలో కలిసిపోయింది. నల్లని కురులు నిండు చందమామను కప్పి వేయటానికి వచ్చిన శ్రావణమేఘపు తునకల వలె భాసించాయి. సర్వలక్షణశోభితురాలైన కుమార్తెను చూసి మాధవీధర్మధ్వజులు మురిసిపోయారు. ధర్మధ్వజుడు వేయిమంది బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి బంగారుకొమ్ములు వెండిపలుపులు అలంకరించిన వేయిగోవులను దానం చేశాడు. భూదాన హిరణ్యదానాలు చేశాడు.

పురోహితులను పిలిపించాడు. వారు ఆ బిడ్డ రాజ్యలక్ష్మికి అధిదేవత అని సాముద్రికలక్షణాలు వెల్లడిస్తున్నాయని సంతోషంతో వెల్లడించారు. ఈ బాలిక వల్ల ధర్మధ్వజుని వంశానికి కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయని, వారి పుణ్యం పండి ఈ బాలిక వారికి జన్మించిందని, ఇటువంటి జాతకం అపురూప మైనదని చెప్పిన మాటలు ధర్మ ధ్వజుని చెవులకు అమృతం వలె తోచాయి. సాముద్రిక శాస్త్రంలో చెప్పబడిన ఉత్తమలక్షణాలన్నీ కలబోసినట్టున్న ఆమె సౌందర్యం తులలేనిది కనుక అ శిశువుకి 'తులసి' అని నామకరణం చేశారు.

అల్లారుముద్దుగా పెరిగిన తులసికి యుక్తవయస్సు వచ్చింది. సహజమైన అందం మరింతగా మిడిసి పడటం ప్రారంభించింది. దొండపళ్ల వంటి పెదవులు మరింత ఎరుపెక్కాయి. లోతైన నాభి పాతాళాన్ని చేరినట్టుంది. త్రివళులు, విశాల నితంబము జగన్మాత్రుత్వలక్షణాన్ని సూచిస్తున్నాయి. చలికాలంలో వెచ్చదనాన్ని, వేసవిలో చల్లదనాన్ని ఇవ్వగల సుఖస్వరూపిణిగా ఉన్నది. శరీరంతో పాటు మనస్సుకి కూడా వయస్సు వచ్చింది.

పూర్వజన్మవాసనాబలం కారణంగా నారాయణుడే తనకి భర్తగా కావాలని తలచింది. అందుకు సరైన మార్గం తపస్సు అని నిశ్చయించుకుంది. తల్లితండ్రులే కాదు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు కూడా వద్దని వారించారు. ముట్టుకుంటే మాసి పోయేట్టు, పట్టుకుంటే కందిపోయేట్టు మిక్కిలి సున్నితంగా ఉండే బాలిక కఠినమైన తపస్సు చేయటానికి ఎవరంగీకరిస్తారు? లక్ష్యశుద్ధి ఉన్న కార్యసాధకులకి ఎవరి అంగీకారాలతోను ప్రమేయం ఉండదు కదా! తులసి తపస్సు చేయటం మొదలు పెట్టింది.

బదరికావనం వెళ్ళి లక్షదివ్యవత్సరాలు కఠినమైన తపోదీక్షలో గడిపింది. వేసవిలో పంచాగ్ని మధ్యంలో నిలచి తపించింది. నాలుగువైపులా అగ్నికీలలు ఎగసి పడుతుండగా మధ్యలో ఒంటికాలి మీద నిలచి, ముఖం పైకెత్తి సూర్యుడిని చూస్తూ, సూర్యగమనాన్ని అనుసరించి ముఖం తిప్పుతూ తపస్సు చేయటం ఆ తలిరుబోడికి ఎలా సాధ్య మయింది అన్నది అందరికి కలిగిన సందేహమే. శీతకాలంలో నీటిలో నిలబడి తపస్సు చేసింది. మంచు పడి కమిలిన పద్మం లాగా దేహం వడలినా ముఖంలోని వర్చస్సు రాను రాను పెరిగింది. చలి ఆమెను చూసి వణికింది. వర్షాకాలంలో ఆరుబయట వర్షధారలలో నిలచి తపస్సు చేయటం మహామహులకే చేత కాలేదు. అది వర్షం కాదు నా స్వామికి చేరువ చేసే దయావర్షం అని భావించి హర్షంతో కొన సాగించింది తపోదీక్ష.

పండ్లు, నీరు మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ ఈ విధమైన తపస్సు ఇరువదివేల సంవత్సరాలు చేసింది. తరువాత ముప్పదివేల సంవత్సరాలు ఆకులు మాత్రమే స్వీకరించి తపస్సు చేసింది. అటుపై పదివేల సంవత్సరాలు గాలి ఆహారంగా తీసుకుంటూ తపస్సు చేసింది. ఆ తరువాత ఒంటికాలి మీద నిలిచి తపసు చేయటం మొదలు పెట్టింది. ఆ తపస్సుకి సంతసించిన బ్రహ్మ వరమివ్వటానికి బదరికాశ్రమంలో ప్రత్యక్ష మయ్యాడు. తులసి బ్రహ్మకు నతులు, నుతులు సలిపింది.

"తులసీ! నీకేమి కావాలో కోరుకో! శ్రీహరి భక్తికావలయునా?, ముక్తి కావలయునా? అజరామరత్వం కావలయునా? ఏదైనా కోరుకో!" అన్నాడు

తులసి "బ్రహ్మదేవా! నీవు సర్వజీవరాశికి పితామహుడవు. నీ వద్ద సిగ్గుపడ వలసిన పని లేదు. నీవు సర్వజ్ఞుడవు కనుక నేను చెప్పక పోయిననను నీకు విదితమే.

అయినను నీ తృప్తి కొరకు చెప్పుచున్నాను. నాకు సుందరవిగ్రహుడు, శాంతుడు అయిన నారాయణుని వివాహము చేసికొన వలెనని కోరిక ఉన్నది. నా కోరిక తీరునట్లు వరము ప్రసాదింపుము" అని వేడుకుంది.

"తులసీ నీకు తెలియనిదేమి ఉంది? నీవెవరవో జ్ఞప్తి లేదా?" ప్రశ్నించాడు బ్రహ్మ.

"లేకేమి? బ్రహ్మదేవా! గుర్తున్నది కనుకనే కదా, తపస్సు చేసినది. దేవా! నాకు నా పూర్వజన్మస్మృతిలోనే ఉంది. గోలోకంలోను నా పేరు తులసియే! నేను రాధారాణికి సేవకురాలనైన ఆమె అంశ స్వరూపను. కృష్ణుడితో కలసి ఉన్న నాపై కోపగించిన రాధామహాదేవి, నన్ను మానవజన్మ నెత్తుమని శపించింది. మూర్ఛ నుండి తేరుకున్న నన్ను కృష్ణప్రభువు ఓదార్చి, భూలోకంలో జన్మించిన నేను తపస్సు చేసి, తన అంశతో జన్మించిన చతుర్భుజుడైన నారాయణుడిని చేపట్ట గలనని సెలవిచ్చి అంతర్ధాన మయ్యాడు.

"ప్రభువే భయపడగా నేనెంత? వెనువెంటనే ఆ శరీరాన్ని పరిత్యజించి ఈ భూలోకంలో పుట్టాను. అప్పుడు నా కోరిక రాధాదేవి కారణంగా పూర్తిగా తీరలేదు. నారాయణుని భర్తగా పొంది నా మనోవాంఛితాన్ని నెరవేర్చుకోవటానికి కఠిన తపమాచరించాను. నా కా వరాన్ని ప్రసాదించ వలసినది." వేడుకుంది తులసి.

బ్రహ్మ చిరునవ్వు నవ్వాడు. అనునయంగా పలికాడు.

"తులసీ! నీ మనోభీష్టము నెరవేరటానికి కొద్ది సమయము పడుతుంది. ముందుగా నీవు నెరవేర్చవలసిన పని ఒకటి ఉన్నది. గోలోకంలో సుదాముడనే గోపుడు, కృష్ణుడి అంశ వల్ల పుట్టినవాడు నిన్ను చూసి మన్మధుని బారిన పడ్డాడు. కాని రాధాదేవికి భయపడి తన కోరికను తీర్చుకోవటమే కాదు, కనీసం వ్యక్తం చేయ లేక పోయాడు. నీకు పూర్వజన్మస్మృతి ఉంది కనుక ఈ విషయం అంతా తెలిసే ఉంటుంది."

తులసికి శ్రీకృష్ణునికి పార్షదుడు ప్రియమిత్రుడైన సుదాముని ప్రవర్తన గుర్తు వచ్చింది. తన వంక కుతూహలంగా చూడటం, అవకాశం వచ్చినప్పుడల్లా తన దగ్గరగా ఉండటానికి ప్రయత్నం చెయ్యటం, తనకి ఇష్టమైన పనులు చేయటం, తను చూస్తే చాలన్నట్టు సంతోషపడటం మదిలో మెదిలాయి.

బ్రహ్మ తులసికి గుర్తుచేసుకునే సమయం ఇచ్చి మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

"తరువాత మరొక సందర్భంలో రాధాదేవి ఆగ్రహానికి గురి అయి రాక్షసవంశంలో శంఖచూడుడుగా జన్మించాడు. నీ వలెనే అతడికి కూడా పూర్వజన్మ స్మృతి ఉంది. అందువలన నిన్ను భార్యగా పొందాలని చాలా కాలం తపస్సు చేసి సఫల మయ్యాడు. ముందుగా ఈ జన్మలో శంఖచూడునికి భార్యవై తరువాతి జన్మలో నారాయణుడికి పత్నివి కాగలవు.

"ఈ లోపు నారాయణుడి శాపకారణంగా పవిత్రమైన వృక్షరూపాన్ని పొంది సర్వపూజ్యస్థానాన్ని అలంకరించ గలవు. అన్ని పుష్పాలలో ప్రధానమైన స్థానాన్ని పొంది విష్ణువుకి ప్రాణాధికురాలవు కాగలవు. నీవు లేని పూజ నిరర్థకంగా పరిగణించ బడుతుంది. గోపకులు, గోపికలు నీ ఆకులతోనే పరమాత్మని పూజిస్తారు. వృక్షాధి దేవతగా నీవు ఎల్లప్పుడు కృష్ణునితో విహరిస్తూ ఉంటావు. నేను నీకు ఇచ్చే వరం ఇదే."

ఇచ్చిన వరానికి తులసి సంతోషించింది. కాని, తన కోరిక మాత్రం తీరలేదు. కనుక మార్గాంతరం చూడాలనుకుంది. బ్రహ్మదేవుడికి నమస్కరించి,

"ఓ విధాతా! నా మనసులో మాట చెపుతున్నాను. నాకు వ్యామోహమున్నది శ్యామసుందరుడైన ద్విభుజకృష్ణునిపై. చతుర్భుజుడైన నారాయణుడిపై కాదు. దురదృష్టవశాన గోవిందునితో శృంగారం భంగం కావటంతో నాకు అసంతృప్తి మిగిలింది. అ గోవిందుని వచనానుసారమే చతుర్భుజుడైన నారాయణుని ప్రార్థించి ద్విభుజశ్రీకృష్ణుని భర్తగా పొందుతాను. కాని ... "

తులసి ఒక్క క్షణం ఆగింది. బ్రహ్మదేవుని వంక చూసింది. ఆయన ప్రశ్నార్థకంగా చూశాడు తులసిని.

"ఓ విరించీ! మీరు నాకు ఉపకారము చేయ దలచినట్లైన రాధాదేవి వలన కలిగే భయాన్ని పోగొట్ట వలసినది." అని ప్రార్థించింది.

"తులసీ! రాధారాణి రాసమండలమున కధీశ్వరి. శ్రీకృష్ణప్రభువును ఆమె కను సన్నలలో మెలగ వలసినదే! ఆమె వలని భయము నెవ్వరును పోగొట్ట సమర్థులు కారు. ఆమె అనుగ్రహ మొక్కటే అ భయాన్ని పోగొట్టి అభయ మీయగలదు. నేను చేయగలిగిన పని నీకా మంత్రరాజాన్ని ఉపదేశించటం మాత్రమే." అన్నాడు బ్రహ్మ.

"అయిన నేను దానిని మహద్భాగ్యంగా భావించి స్వీకరిస్తాను. అనుష్ఠిస్తాను." అని తులసి అంజలి ఘటించింది.

"ఈ మంత్రబలం వల్ల, నేనిచ్చిన వరం వల్ల నీవు రాధాదేవికి ప్రాణ స్నేహితురాలవు అవుతావు. ఆ రాధాదేవియే నీకు కృష్ణుడికి సమాగమం కలిగిస్తుంది. నీవు కృష్ణుడికి రాధతో సమానమైన ప్రియురాలవు అవుతావు. షోడశాక్షరమైన రాధామంత్రాన్ని స్తోత్రాన్ని, కవచాన్ని, పూజావిధిని, పురశ్చర్యాక్రమాన్ని నీకు ఉపదేశిస్తున్నాను." అన్నాడు బ్రహ్మ.

మంత్రాదికాల ఉపదేశం పూర్తి చేసి, శుభాశీస్సులనిచ్చి, బ్రహ్మ అంతర్ధాన మయ్యాడు. తులసి ఆ బదరికాశ్రమంలో పన్నెండు దివ్యసంవత్సరాలు రాధాషోడశార్ణ మంత్రాన్ని భక్తితో జపం చేసి, సిద్ధి పొందింది. ఫలితంగా కృష్ణసమాగమమును వరంగా పొందింది.

తన తపస్సు ఫలించించి, బ్రహ్మ ప్రత్యక్ష మై వరాలనిచ్చాడన్న సంతోషంతో తులసి హాయిగా నిద్రపోయింది. కాని, ఆ సమయంలో అవకాశాని కెదురు చూస్తున్న మన్మధుడు తన ప్రతాపం తులసిపై చూపాడు. తపోదీక్ష పూర్తి అయింది కదా! మన్మధవికారాలు విజృంభించాయి. విరహం వెర్రెక్కించింది. నిలువనీయటం లేదు. నిద్ర పట్టటం లేదు. పట్టిన కొద్ది సమయం మగతనిద్ర మాత్రమే. ఆ మగతనిద్రలోనే రసికుడైన ఒక యువకుడు అలంకరించుకొని, చందనాదులతో పరిమళాన్ని విరజిమ్ముతు, ముద్దాడినట్టు, కౌగిలించినట్టు అనిపించి, అతడిని ఆగమంటు మేలుకుంది. ఆ స్వప్నాన్నే తలచుకుంటూ ఉన్నది కనుకనే శంఖచూడుని చూడగానే నును సిగ్గు కలిగింది.

10

తులసి తన నోటితో ఈ మాటలను చెప్పిందా? ఆమెను చూస్తూ తను ఆ కథనంతా మనోనేత్రాలతో దర్శించాడా? శంఖచూడునికి అర్థం కాలేదు. ఏదయితేనేం? తన జన్మ సఫలం చేసే తులసి దర్శనభాగ్యం కలిగింది. మొదటి చూపులోనే తన లక్ష్యం అమెయే నని తెలిసింది. అయినా తులసి నోటి వెంట ఆ మాటలని వినటం ఒక ముచ్చట. తను గోలోకంలో ఉన్నప్పుడు తన మనోగతాన్ని పెదవి విప్పి

ఒక్కమారైనా చెప్పలేదు. ఇప్పటికీ తులసి చొరవ తీసుకొననిదే తనకు ధైర్యం వస్తుందన్న నమ్మకం లేదు. ప్రేమాస్పదుల ఎదుట నోరు పెగలక పోవటం సహజమే కదా!

శంఖచూడునితో తులసి ,

"నేను ధర్మధ్వజమహారాజుగారి పుత్రికను. ఉన్నతవంశస్థులు, ధర్మశాస్త్రము చదివినవారు ఒంటరిగా ఉన్న స్త్రీలను పలుకరించరు. స్త్రీలను చూచి వ్యామోహ పడే వాడు మోక్షమార్గంలో నడువ లేడు." అన్నది.

"తులసీ! నీవన్నట్టు బ్రహ్మ స్త్రీరూపాన్ని మోహం కలిగించటానికే సృష్టించి ఉండవచ్చు. కాని, అందరు స్త్రీలు అటువంటి వారు కాదు. లక్ష్మి, సరస్వతి, దుర్గా, సావిత్రీ, రాధ, వారి అంశలలో జన్మించిన స్త్రీలు ఉత్తములు. వారు మోహకారకులు కారు. మోక్షకారకులు. కనుక నీ మాటలు పూర్తిగా సత్యము కావు."

శంఖచూడుని మాటలను రెప్పలల్లార్చకుండ, అతడి సుందర రూపాన్ని కన్నులతో ఆస్వాదిస్తూ వింటున్నది తులసి. శంఖచూడుడు చెప్పటం సాగించాడు.

"సజ్జను డెవ్వడూ ఏకాంతంలో ఉన్న స్త్రీలను, అందులోనూ యవ్వనంలో ఉన్న అందగత్తెలను పలుకరించరు. అది నిజం. నేను బ్రహ్మదేవుని ఆజ్ఞ వల్ల నీ దగ్గరకు వచ్చాను. నిన్ను గాంధర్వవిధిన వివాహం చేసుకోవటానికి బ్రహ్మ నుండి వరం పొంది వస్తున్నాను.

"నేను శంఖచూడు డనే దానవరాజును. దేవతలకు నా పేరు చెపితే గజగజా వణికి పోతారు. పూర్వజన్మలో సుదాముడనే పేరుతో గోలోకంలో శ్రీకృష్ణుడి పార్షదుడను. రాధాదేవి శాపం వల్ల రాక్షసజన్మ నెత్త వలసి వచ్చింది. నీవును గోలోకంలో రాధాదేవి పరిచారికవు. రాధారాణి శాపం వల్ల భూలోకంలో జన్మించావు. గోలోకంలో నిన్ను కోరి కూడా రాధాదేవి భయం వల్ల సాహసించలేక పోయాను. నా వలెనే నీకును పూర్వజన్మ జ్ఞానం ఉంది" ఊరకున్నాడు శంఖచూడుడు.

బ్రహ్మ మాటలు ఆమె మీద బాగా ప్రభావం చూపాయి. శంఖచూడుని కోసం ఎదురు చూస్తూ ఉంది. అతడి మాటలకు తులసి సంతోషంతో ఉప్పొంగి పోయి,

"నీ వంటి విద్వాంసుని అదరూ మెచ్చుకుంటారు. స్త్రీలకి నచ్చేది నీ వలె దాపరికం లేకుండ మాట్లాడే పురుషుడే. నీ పాండిత్యాన్ని తెలుసుకోటానికే నిన్ను

పరీక్షించాను. నచ్చిన వారి శక్తియుక్తులను పరీక్షించిన తరువాతనే కదా యువతి వరించేది." అన్నది.

తన ఆమోదాన్ని ఎంత సున్నితంగా వెల్లడించిందో అనుకున్నాడు శంఖచూడుడు.

ఇరువురూ ఒకరినొకరు పరమప్రీతితో చూస్తూ ఉండిపోయారు. బ్రహ్మ రాకతో వారి పరవశత్వం భంగ మయింది. ఇరువురూ విధాతకు నమస్కరించారు. బ్రహ్మ వారిని ఆశీర్వదించి ఇలా పలికాడు.

"మీరిరువురు ఏమి చేయుచున్నారు? శంఖచూడా! నీవు తులసిని గాంధర్వవిధితో వివాహం చేసికోవలసినది. నీవు పురుషులలో శ్రేష్ఠుడవు. తులసి స్త్రీలలో రత్నం వంటిది. మీ ఇద్దరి కలయిక మేలు కలిగిస్తుంది. మీది ఆదర్శవంతమైన దాంపత్యంగా ఆచంద్రార్కం నిలిచి ఉంటుంది.

"తులసీ! ఎందుకు ఉపేక్ష చేస్తున్నావు? ఇంతటి అందగాడు, సద్గుణరాశి, దేవదానవులను గెలిచిన వీరుడు భర్తగా లభించటం అదృష్టం.

"లక్ష్మీదేవి విష్ణువునకు, కృష్ణునకు రాధిక, నాకు సావిత్రి, శివునకు పార్వతి, ఆదివరాహునకు భూదేవి, హిమవంతునికి మేనాదేవి, అత్రిమహర్షికి అనసూయ, నలునకు దమయంతి, చంద్రునికి రోహిణి, మన్మథునకు రతీదేవి, కశ్యపునకు దితి, వశిష్ఠునకు అరుంధతి, గౌతమునకు అహల్య, కర్దమ మహర్షికి దేవహూతి, బృహస్పతికి తార, మనువునకు శతరూప, యజ్ఞమునకు దక్షిణ, అగ్నికి స్వాహాదేవి, దేవేంద్రునకు శచీదేవి, గణపతికి పుష్టి, సుబ్రహ్మణ్యునికి దేవసేన, ధర్మునికి మూర్తిదేవి ప్రియమైన విధంగా శంఖచూడునికి నీవు ప్రాణప్రదమైన దానవు.

"మీరిరువురు యథేచ్ఛగా సుఖభోగాలను ధర్మమార్గంలో అనుభవించండి. ఈ శంఖచూడుడు ఒక మన్వంతరం భూమిపై ఉండి, శరీరం వదలిన తరువాత స్వస్థానమైన గోలోకానికి చేరుకుంటాడు. తులసీ! నీవు అప్పుడు వైకుంఠంలో నున్న చతుర్భుజ శ్రీమహావిష్ణువును, ఆపై గోలోక శ్రీకృష్ణుని పొందగలవు. శుభం భూయాత్!" అని శుభాశీస్సు లొసగి బ్రహ్మ తన స్థానానికి వెళ్ళి పోయాడు.

11

తులసీ శంఖచూడులు గాంధర్వవివాహం చేసుకుంటున్న శుభసందర్భాన దేవతలు పూలవాన కురిపించారు. దేవదుందుభులు చెలరేగాయి. వారి శృంగార విహారాలకు అనువుగా ఉంటుందని మందమారుతము సుగంధభరితంగా వీచసాగింది. వారికి పానుపుకి తగినన్ని పుష్పాలను ఉద్యానవనాలలోని పూలచెట్లు సంతోషంగా సమర్పించాయి. ఒకరికొకరు మనోహరమైన ఉపహారాల నిచ్చి సంతోష పరచుకున్నారు.

తులసి తన నాథునికి చందనతిలకాన్ని తీర్చి, శరీర మంతా చందన మలది, సుగంధభరితమైన తాంబూలమిచ్చి, మంచివస్త్రాలు, పారిజాతపుష్పం, వెలలేని రత్నాలు పొదిగిన ఉంగరం, ముల్లోకాలలోనూ వెదకినా అటువంటిది మరొకటి లేదనిపించే విలువైన మణిని సమర్పించింది. ఈ వస్తువుల కన్న విలువైన మణి అయిన తులసి శంఖచూడునికి నమస్కరించి ,

“ఈ దాసురాలు ఈ విలువైన కానుకలను, తనను తాను ఈ ప్రభువుకు సమర్పించు కొనుచున్నది. దయతో స్వీకరింపుము.” అన్నది.

తన పాదాల వద్ద వ్రాలిన తులసిని రెండుచేతులతో లేవనెత్తి అక్కున చేర్చుకొని శంఖచూడుడు,

“ప్రాణేశ్వరీ! అటుల మాటాడ వలదు. నీ దాసుని చులుకన చేయుట న్యాయమా? ఆజ్ఞాపింపుము ఏమి కోరెదవో? నీ కనుసన్నలలో మెలగుటయే నా జీవితపరమార్థము. సెలవిమ్ము. ముందుగా వీనిని స్వీకరింపుము”.

చిత్రవిచిత్రమైన శిల్పవిన్యాసాలతో, లతలతో అందంగా తయారు చేయబడి, చూడ ముచ్చటైన పీఠంపై తులసిని ఆసీనురాలిని చేశాడు.

“ప్రాణప్రియా! ఇది విశ్వకర్మ ప్రత్యేకముగా తయారు చేసిన పీఠం. దీనితో పాటుగా మరెన్నో సుందర వస్తుజాలమును కూడా నాకు గౌరవపురస్సరముగా ఇచ్చి ఉన్నాడు. అవన్నియు నీవే. ఘనమైన శయ్య నొకదానిని విశిష్టమైన అలంకారములతో విశ్వకర్మ చేత నీ కొరకు సిద్ధం చేయించి ఉంచాను. అది మన ప్రణయ కేళికి.”

తులసి కొద్దిగా సిగ్గు పడింది.

ఒక రత్నమాలను తులసి మెడలో అలంకరించి, వస్త్రాలను ధరించమని చేతికిచ్చి,

"ఇవి వరుణుని గెలిచి తెచ్చినవి. నీ కంఠము నందుండుటచే ఈ రత్నమాలకే అందం వచ్చింది. వస్త్రాలు మెరుస్తున్నాయి నీ శరీరకాంతి స్ఫురణతో. అగ్నిదేవుని జయించి స్వాహాదేవి పదనూపురాలు తెచ్చాను. ఏదీ, నీ పదపంకజము? నూపురములను గౌరవించెదను." అంటూ చిగురాకుల వలె సుకుమారమైన తులసి పాదాలను తన చేతులలోకి తీసుకొని, నూపురాలను అలంకరించాడు.

తులసి ముఖకమలాన్ని తన రెండుచేతులలోకి తీసుకొని,

"ఇంత సుందరమైన ముఖానికి ఏమి అలంకరించాలి?....."

ఒక్క క్షణం ఆలోచించి, కుండలాలను తీసి చెవులకు అలంకరించి,

"ప్రియా! ఇవి రోహిణీదేవి కుండలాలు. చంద్రుని జయించినపుడు తెచ్చినవి. నీ ముఖమునకే నప్పినవి. ఉంగరములు కూడా అమెవే." అంటూ చేతులను తన చేతులలో కొంచెం సేపుంచుకొని స్పర్శసుఖాన్ని అనుభూతి చెంది, వ్రేళ్ళకు ఉంగరాలు తొడిగాడు.

ఇవన్నీ ఇతరులను గెలిచి తెచ్చినవి. తన ప్రేమ ప్రకట మయ్యే విధంగా తానుగా ఏదైనా చేయాలి అనుకున్నాడు శంఖచూడుడు. సైరంధ్రిగా మారిపోయాడు. తులసీదేవికి చెక్కిళ్ళ మీద మకరికాపత్రాలు రచించాడు. నుదుట చందనంతో, కుంకుమతో జిలుగుల తిలకము దిద్దాడు. కేశపాశమును సంస్కరించి, వింత గొలిపే రీతిలో అందమైన కొప్పు తీర్చి, అంత కన్న అందంగా కళాత్మకంగా అల్లిన పూలమాలలతో అలంకరించాడు. చేతివ్రేళ్ళగోళ్ళకు రంగైన రంగులద్దాడు. ఆమె కూర్చుని ఉన్న పాదపీఠం వద్ద కూర్చొని ఆమె పాదాలను తన గుండెల మీద పెట్టుకుని లత్తుక అలదుతూ,

"ఈ దాసునిపై ఇంత కాలానికి దయ కలిగిందా? నా జీవితం నీకే నైవేద్యం." అంటూ తన్మయుడయ్యాడు.

కాలం స్థంభించింది. చంద్రోదయం అయింది. చక్రవాకాలు సంతోషంతో చేస్తున్న కలకలానికి వారిరువురకూ బాహ్యస్పృహ కలిగింది. వారి మనస్సులలోని

ఆనందం పైకి పెల్లుబికిందా అన్నట్టు వాతావరణం మరింత ఆహ్లాదకరంగా తోచింది. దేవదారువృక్షాలమీద వెన్నెల పడి వెండి పూత పూసినట్టుగా భాసిస్తున్నాయి. ఓషధీపతి కాంతిని జుర్రుకుంటున్న వనస్పతులు తల లూపుతూ ఆనందనృత్యం చేస్తున్నాయి. సూర్యకాంతిలో వజ్రపుప్రవాహంలాగా కనిపించిన సెలయేరు చంద్రకాంతిలో అడుగున ఉన్న శిలల వర్ణం కారణంగా కరిగించిన జాంబూనదం కదలిపోతున్నట్టు అనిపించింది. కదలుతున్న చేపలు మిలమిలా మెరుస్తూ రత్నాల లాగా మిడిసి పడుతున్నాయి. బేడిసలు మాత్రం తులసి కన్నులతో పోటీ పడలేక సిగ్గుపడ్డాయి కాబోలు ఒక్కటి కూడా కానరావటం లేదు.

"నా హృదయరాణీ! ఎంతో కాలంగా ఇక్కడే తపస్సు చేస్తూ ఉండి పోయావు. ప్రకృతి రామణీయకతతో విరాజిల్లే సుందరప్రదేశాలలో మనసు తీరా విహారం చేద్దాము" అన్నాడు.

తులసి తల పంకించింది.

ఇంకేమి కావాలి? శంఖచూడుడు రత్నమయమైన విమానాన్ని తలచాడు. అది ప్రత్యక్షమయింది. తులసిని అధిరోహింప చేశాడు. బదరీవనం నుండి మలయపర్వత సానువులకు తీసుకొని వెళ్ళాడు. అక్కడి సువాసనలు వెదజల్లే గొజ్జంగిపూల తోటలు మత్తెక్కించాయి. పురి విప్పి ఆడుతున్న నెమళ్ల పింఛంలో ఉన్న చిత్రవర్ణాలు పరస్పర ఆకర్షణను పెంచి పెద్ద చేశాయి. మంచిగంధపు చెట్లకాండాలను పెన వేసుకొని క్రీడిస్తున్న శ్వేతనాగుల జంట వారిలోని కామాగ్నికి ఆజ్యం పోసింది.

అక్కడ ఉద్వేగాన్ని తట్టుకోలేక గంధమాదన పర్వతానికి వెళ్ళి అక్కడి ఉద్యానవనాలలో విహరించారు. అక్కడి పూదేనె త్రాగి మత్తెక్కిన షట్పదాల ఝంకారం అంతరంగపు లోతులలో భావస్పందనను కలిగించింది.

సింధునదీతీరవిహారాలు, పుష్పభద్రానదీతీరాల్లోని ఇసుకతిన్నెలపై విశ్రమించటాలు మేరుపర్వతసానువులలోని పూదోటలలో వినోదాలు వారికి ఉపశాంతిని కలిగించలేదు. ఒకరిపై మరొకరికి ఇష్టాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుతున్నాయి. తిరిగి, తిరిగి చివరకు తమ ఆశ్రమానికి వచ్చి సుఖంగా ఉండి పోయారు. ఒక మన్వంతర కాలం తులసితో భోగాలనుభవిస్తూ, రాజ్యపాలన చేశాడు.

స్వర్గసుఖాలని చులకన చేసే భోగాలను అనుభవించారు వారిద్దరూ. సుఖమన్నది మనసులలో ఉండాలి, సుఖపడటానికి ఉండవలసినది మనసులలో నిండిన ప్రేమ అని వారు నిరూపించారు. పదునాలుగులోకాలవారు వారి దాంపత్యశోభను చూసి, ఆనంద ఆశ్చర్యాలను పొందారు.

తులసి పాతివ్రత్యం అన్ని లోకాలలో ప్రసిద్ధి పొందింది. శంఖచూడుడి బలం తులసి పాతివ్రత్యమే. అతడి కంఠసీమలో ఉన్న శ్రీకృష్ణకవచం, తులసి పాతివ్రత్యం శంఖచూడుడికి రక్షకకవచాలై అతడిని ఎదురులేని వీరుడుగా నిలబెట్టాయి. దేవతలను, అసురులను, దానవులను, యక్షగంధర్వకిన్నరాదులను అందరను జయించి, వారిని తన ఆజ్ఞానువర్తులనుగా చేసుకున్నాడు. దేవతలు తమ అధికారాలను కోల్పోవటంతో బిచ్చగాళ్ల వలె తమదనే ఒక స్థానం లేక తిరుగ సాగారు.

12

దేవతలు సత్యలోకానికి వెళ్ళి తమ బాధను బ్రహ్మకు విన్నవించుకున్నారు. ఆయన వారిని వెంట పెట్టుకొని కైలాసానికి తీసుకొని వెళ్ళి శివుడికి చెప్పాడు. శివుడు అందరను వైకుంఠానికి తీసుకొని వెళ్ళాడు. వైకుంఠపు ద్వారాలు పదునారు దాటి, శ్రీహరి కొలుతీరిఉన్న సభలో ప్రవేశించారు. శ్రీహరి సేవకులు, పార్షదులు అందరూ చతుర్భుజులై నారాయణస్వరూపులుగానే ఉన్నారు. ఆ సభ అంతా నవరత్నములు, స్యమంతకమణులు, మొదలయిన వాటితో చేయబడి కన్నులు మిరుమిట్లుగొలుపుతూ ఉంది. విద్యాధరకాంతల గానంతో హాయి గొలుపుతూ ఉంది. సభామధ్యంలో ఉన్న రత్నసింహాసనం మీద శంఖ, చక్ర, గదా, పద్మాలను నాలుగు చేతులయందు ధరించి, వనమాలను, అమూల్యరత్నాభరణాలను కంఠసీమ యందు అలంకరించుకొని, మకరకుండలాలతోను, మణిమయకిరీటముతోనూ, కేయురములతోను శోభిల్లుతున్న శ్రీ మహావిష్ణువు వారికి దర్శన మిచ్చాడు. అందరూ భక్తితాత్పర్యములతో తమ సహస్రారములపై చేతులు జోడించి నమస్కరించారు. శ్రీహరికి వారి ఆంతర్యము తెలిసినా మర్యాదపూర్వకంగా కుశలసంప్రశ్నము చేశాడు. బ్రహ్మ తమ రాకకు కారణం వివరించాడు.

విష్ణువు మందహాసం చేశాడు.

వారికి శంఖచూడుని పూర్వజన్మ వృత్తాంతం తెలిపి, కర్తవ్యం ఉపదేశించాడు. "శంఖచూడుని దుర్నిరీక్ష్యుని చేసి కాపాడుతున్నవి రెండు అంశాలు. మొదటిది సర్వమంగళములకు మంగళప్రదమైన నా కవచాన్ని మెడలో సర్వదా ధరించటం. బ్రాహ్మణవేషంలో వెళ్ళి దానిని యాచించి దానిని అతడికి దూరం చేస్తాను. అతడిని సదా కాపాడే మరొకటి అతడి భార్య పాతివ్రత్యం. ఓ బ్రహ్మా! నీవే కదా అతడికి భార్య పతివ్రత్యం భంగమయే వరకు మృత్యువు రాదని వరమిచ్చి ఉన్నావు! కనుక నేనే మోసంతో తులసి సతీత్వాన్ని భంగ పరుస్తాను. అది కూడ ఆమె శ్రేయస్సుకే. ఆమె ఈ దేహాన్ని వదలి నాకు ప్రియురాలు అవుతుంది. శంఖచూడుని సంహరించటానికి నా శూలాన్ని శివుడికి ఇస్తాను." అని అభయం ఇచ్చాడు.

13

మహాదేవుడు దేవకార్యం నిర్వర్తించటానికి పూనుకున్నాడు. చంద్రభాగా నదీతీరంలో మర్రిచెట్టు క్రింద విడిసి పుష్పదంతుడనే గంధర్వుని శంఖచూడుని వద్దకు దూతగా పంపుతాడు. అతడు అమరావతిని, అలకాపురిని మించిన సౌందర్యశోభతో విలసిల్లుతున్న శంఖచూడుని నగరంలోకి పన్నెండు ద్వారాలు దాటి ప్రవేశించాడు. నగరద్వారం వద్ద నున్న ద్వారపాలకుని అనుమతితో అంతఃపురంలో ఉన్న శంఖచూడుని దర్శించాడు. శంఖచూడుని వైభవం అచ్చెరువు గొలిపింది పుష్పదంతునికి.

"నేను శివుని దూతను. నా పేరు పుష్పదంతుడు. శంకరుడు చెప్పిన మాటను ఉన్నది ఉన్నట్టుగా చెపుతున్నాను. దేవతల రాజ్యాన్ని, అధికారాన్ని వారికి ఇచ్చి వేయవలసినది. ఇది శ్రీహరి ఆదేశము. ఆయన తన శూలాన్ని నీ పై ప్రయోగించటానికి శివునికి ఇచ్చి పంపాడు. నీ నిర్ణయం కోసం శివుడు చంద్రభాగానది ఒడ్డున మర్రిచెట్టు క్రింద ఎదురు చూస్తున్నాడు. దేవతలకు రాజ్య మిస్తున్నావో, యుద్ధం కోరుతున్నావో తెలిపితే శివునికి నివేదిస్తాను" అన్నాడు.

శంఖచూడుడు నవ్వి " రేపు ఉదయం వచ్చి స్వయంగా చెపుతానులే." అన్నాడు.

పుష్పదంతుడు శివునికి శంఖచూడుని మాటను, అతడి బలాన్ని వివరించి చెప్పాడు.

శివుడు శంఖచూడునిపై యుద్ధానికి వెళ్లాడని తెలిసిన శివుని పరివారమంతా తరలి వచ్చింది. కుమారస్వామితో పాటు వీరభద్రుడు, నంది, మహాకాళుడు, సుభద్రకుడు, విశాలాక్షుడు, బాణుడు, పింగలాక్షుడు, వికంపనుడు, విరూపుడు, వికృతి, మణిభద్రుడు, బాష్కలుడు, కపిలాక్షుడు, దీర్ఘదంష్ట్రుడు, వికటుడు, తామ్రలోచనుడు, కాలంకటుడు, బలీభద్రుడు, కాలజిహ్వుడు, కుటీచరుడు, బలోన్మత్తుడు, రణశ్లాఘి, దుర్జయుడు, దుర్గముడు వచ్చారు. వారిని వెన్నంటి కాలభైరవులెనిమిది మంది, రుద్రులు పదకొండు మంది, దిక్పాలు రెనిమిది మంది, ఆదిత్యులు పన్నెండు మంది, ఇంద్రుడు మొదలైన దేవతలు, విశ్వేదేవతలు, అశ్వినీ దేవతలు, విశ్వకర్మ, ఉగ్రదంష్ట్ర, ఉగ్రచండా, కోట్టరీ, కైటభీ మొదలైన వారు వచ్చారు. త్రిశూలము, శంఖము, చక్రము, గద, మొదలైన ఆయుధాలను, వైష్ణవం, వారుణం, ఆగ్నేయం వంటి అస్త్రాలను ధరించిన ఢాకినులు, వికటలు అనుసరించి రాగా భద్రకాళి వచ్చింది. భూత, ప్రేత, పిశాచ, కూశ్మాండ, బ్రహ్మరాక్షస, భేతాళ, యక్ష, రాక్షస గణాలు కూడా విచ్చేశాయి.

పుష్పదంతుని పంపి శంఖచూడుడు అంతఃపురానికి వెళ్ళి, తులసికి జరిగినది వివరించాడు. తులసి బాధపడి, తనకు తెల్లవారు జామున పీడకల వచ్చింది కనుక యుద్ధం వద్దని కోరింది. తనవద్దనే సమయం గడపమని ప్రార్థించింది.

శంఖచూడుడు తులసి కోరినట్టు ఆమె వద్దనే భోజనం చేసి, సమయం అక్కడనే గడపి, తులసిని అనునయిస్తూ, తత్త్వోపదేశం చేశాడు.

"కాల మెవ్వరికైనను దాటరానిది. త్రిమూర్తు లైనను కాలానికి వశులే. కంటికి కనపడే సృష్టి సమస్తమూ అశాశ్వతం. శ్రీకృష్ణుని శరణు వేడుము. నీవు, నేను ఎవర మన్నది చింతన చేయి. ఆ శ్రీకృష్ణుడే మనలను కలిపాడు. సమయం పూర్తి అయితే వియోగం కలిగిస్తాడు. విచారమేల? ఆపదలలో బాధపడటం అజ్ఞానం. సుఖదుఃఖాలు ఒకదాని తరువాత మరొకటి పర్యాయంగా వస్తూ ఉంటాయి. జ్ఞానులు దేనికి శోకించరు."

తులసికి ఇది తెలియనిది కాదు. అయినా బాధ మాత్రం తగ్గలేదు. అందుకే శంఖచూడుడు తులసి మనసు కెక్కే అంశం ప్రస్తావించాడు.

"తులసీ! నా ప్రేయసీ!! నువ్వు తపస్సు చేసి నారాయణుని భర్తగా

పొందాలనుకున్నావు కదా! అది సిద్ధిస్తుంది. బ్రహ్మదేవుని గురించి తపస్సు చేసి నేను నిన్ను భార్యగా పొందాను. నువ్వు ఈ శరీరం వదలి, దివ్యదేహంతో గోలోక మందలి బృందావనంలో శ్రీకృష్ణుని భర్తగా పొందుతావు. నేను ఈ రాక్షస దేహం వదలి గోలోకం వచ్చి నిన్ను చూస్తాను. శోకానికి తావు లేదు కదా! ఆలోచించు." ప్రేమతో పలికాడు శంఖచూడుడు.

తులసి ఈ ఉపదేశంతో శోకాన్ని వదలింది. ఆ రాత్రిని మరపురాని విధంగా, ఇదే ప్రథమ సమాగమ మన్నట్టు, ఇటువంటి అవకాశం మరింక దొరక దన్నట్టు ఇద్దరూ శృంగారరసాధిదేవతలై తమకంతో ఒకరినొకరు అంటిపెట్టుకొని గడిపారు.

14

శంఖచూడుడు బ్రాహ్మీముహూర్తంలో నిద్ర మేల్కాంచి, శ్రీకృష్ణుని ధ్యానించి, దైనందిన కృత్యాలను పూర్తి చేసుకొని, కుమారుడైన సుచంద్రునకు రాజ్యాభిషేకం చేసి, అతడికి అన్నిబాధ్యతలను అప్పగించి, సైన్యాన్ని తీసుకొని శివుడు విడిది చేసి ఉన్న అక్షయవటం వద్దకు వెళ్ళి, శివునకు, భద్రకాళికి, స్కందునకు నమస్కరించి వారి ఆశీస్సులను పొందాడు. తన సమీపంలో కూర్చున్న శంఖచూడునితో శివుడిలా అన్నాడు.

"శంఖచూడా! నీవు పూర్వభవంలో గోలోకంలో శ్రీకృష్ణుని పార్షదులు ఎనమండుగురలో ఒకడవైన సుదాముడవు. శ్రీకృష్ణ భక్తులు సత్యదర్శనులు. ఆబ్రహ్మపీపీలికాది పర్యంతం అశాశ్వతం అని, కంటికి కనపడే దంతా భ్రమ అనే జ్ఞానం కలిగి ఉంటారు. కనుక దేవతల విషయము భ్రమ అని తెలుసుకో! వారి రాజ్యం వారికిచ్చి ఎవరిది వారు పాలించుకోవటం మంచిది. అన్నదమ్ముల మధ్య విరోధం తగదు. అది బ్రహ్మహత్య కన్నా అధిక దోషభూయిష్టం."

శంఖచూడునిలో ఎటువంటి స్పందన లేదు. మహాదేవుడు అతడికి తత్త్వోపదేశం చేశాడు. అతడు శివునితో

"మహాదేవా! తమరు సెలవిచ్చింది సత్యము. కాని, మా దాయాదుల మధ్య ఈ విరోధం ఎప్పటి నుండియో వస్తున్నది. మాటల యుద్ధం ఎందుకు?" అన్నాడు.

తన రత్నవిమానం ఎక్కి యుద్ధానికి సిద్ధ మయ్యాడు. కుమారస్వామి సైన్యం విజృంభించింది. మాయాయుద్ధ ప్రవీణుడైన శంఖచూడుని సైన్యం శివసేనను ఓడించింది. ఒంటరిగా యుద్ధం చేస్తున్న స్కందునికి భద్రకాళి తోడు వెళ్లింది. కాళిక ఎంత బాధించినా ఆమెపై అస్త్ర ప్రయోగం చేయ లేదు. ఆమె అస్త్రప్రయోగం చేసినప్పుడల్లా నమస్కరించాడు.

యుద్ధ విశేషాలను తెలుసుకున్న శివుడు తానే యుద్ధభూమికి బయలుదేరాడు. శంఖచూడుడు ముందుగా శివునికి నమస్కరించి పోరు మొదలు పెట్టాడు. అది ఒక సంవత్సరం సాగింది.

అదే సమయంలో విష్ణువు వృద్ధబ్రాహ్మణ వేషంలో వచ్చి, శంఖచూడుని మెడలో ఉన్న శ్రీకృష్ణ కవచాన్ని యాచించాడు. ముందుగా మాట ఇచ్చినందు వల్ల అతడు ఇచ్చివేశాడు. దానిని ధరించి శ్రీహరి తులసి వద్దకు వెళ్ళాడు. తులసి తన భర్తయే అనుకున్నది. ఆనందంగా అతడితో సమయం గడుపుతూ తులసి అతడు తన భర్త కాదని గుర్తించింది. పాషాణ మై పొమ్మని శపించింది. విష్ణువు ఆమె శరీరం గండకీ నదిగా మారుతుందని, కేశములు వృక్షరూపాన్ని ధరించి పరమపవిత్రంగా భావించ బడతాయని వరం ఇచ్చాడు. తనామె శాపప్రభావాన సాలగ్రామశిలయై గండకీ నదీతీరాన ఉంటానని తులసికి తన తపః ఫలాన్ని పొందే సమయం ఆసన్నమయింది అని చెప్పాడు.

ఆమె పాతివ్రత్యం భంగం కాగానే శివుడు తన చేతిలో ఉన్న విష్ణువు శూలం ప్రయోగించాడు. దానిని చూసి, శంఖచూడుడు విల్లుని వదలి, యోగాసనంలో కూర్చుండి, శ్రీకృష్ణుని ధ్యానం చేస్తూ ఉండిపోయాడు. శూలం అతడిని భస్మం చేసి శివుని చేరింది. అతడా శూలంతో శంఖచూడుని శరీరాన్ని సముద్రంలో కలిపాడు.రకరకాలైన శంఖాలు దాని నుండి పుట్టాయి. అతడు దివ్యశరీరాన్ని ధరించి, గోపాలుర రూపాన్ని ధరించిన పరివారంతో గోలోకం వెళ్ళిపోయాడు. కృష్ణుడు, తులసి వచ్చే సమయానికై నిరీక్షిస్తూ ఉన్నాడు.

15

బృందావనానికి సమీపంలో ఉన్న భాండీరవనం సొబగులు మాటల కందనివి. ప్రకృతి సౌందర్యంలో పవిత్రత, ఆధ్యాత్మికత, మేళవించి ఉంటాయి. ఆ పరిసరాలలో ప్రవేశించినంతనే ఒక మార్మికశక్తి మనస్సుని ఆవరించి అలౌకికమైన తన్మయ స్థితిని కలిగిస్తుంది. దివ్యచైతన్యం వాతావరణాన్ని ఉత్తేజ పరుస్తున్నట్టు ఉంటుంది. ఈ శక్తి ఉత్పన్న మయ్యే కేంద్రం ఎక్కడ ఉన్నదా? అని వెదకటానికి వచ్చినట్టుగా పరిసరాలను నిశితంగా పరికిస్తూ దేవర్షి నారదులవారు మహతి నారాయణ మంత్రాన్ని పలుకుతుండగా ప్రవేశించాడు. ఆ కేంద్రము వారికి తెలియదా?

భాండీరవనంలో ఒక వటతరువు మొదట ఒక చదునైన రాతి మీద ధ్యాన మగ్నురాలై ఉంది అప్పుడే యవ్వనంలో అడుగు పెడుతున్న దివ్య సుందర రూపం. ముఖం బ్రహ్మతేజస్సుతో విరాజిల్లుతోంది. బాహ్యస్పృహ లేకపోవటంతో మహర్షి రాకను గమనించ లేదు.

మహతి నుండి వెలువడుతున్న సామవేదశ్రుతికి అనుగుణంగా నారాయణ మంత్రం జపిస్తున్నవాడు ఒక్క సారి అగాడు. తనలో,

"ఇప్పుడు కావలసినది 'ఓం నమోనారాయణాయ' అనే మంత్రం కాదు. తగినదేది? .... 'ఓం గోపీ జన వల్లభ చరణాన్ శరణం ప్రపద్యే' అనే షోడశార్ణ మంత్రమే ప్రశస్తము. రమ 'ర' కారముగాను, అది గోపి 'ఆ' కారముగాను, ధరిత్రి 'ధ' కారముగాను, విరజ 'ఆ' కారముగాను మారి, రాధాదేవి నామమున స్థానంపొందే అదృష్టానికి నోచుకున్నామని పొంగి పోవుచున్నారు కదా! ఆ రాధాదేవి తో కలిసి ఉన్న కృష్ణుని ఉపాసించటమే ప్రస్తుత కర్తవ్యం. కృష్ణునికి అనపాయిని అయిన రాధామహాదేవి ఆయన నుండి విడివడి, తిరిగి ఆ స్వామిలో చేరటానికి ఋణవిమోచన తీర్థంలో తపమాచరించుచున్నది. ప్రకృతి స్వరూపిణియైన రాధ తపము ప్రకృతిలో ప్రతిఫలించు చున్నది సుమా! హేమంతమున ప్రారంభమయిన తపము శరత్తున ఫలించి తీరును. చలిలో వణుకుతూ ఆరుబయటి ప్రదేశంలోను, గ్రీష్మంలో పంచాగ్ని మధ్యంలోను, ఈ వానకారులో వర్షపుధారలలో తడిసి పోతూను తపస్సు చేసి, ఋతుధర్మాలని గెలిచిన ధీర రాధ. దూరమున నుండియే ఆమె తపస్సు ఫలించి, కాలస్వరూపుడైన నారాయణుడామెను అనుగ్రహించు దివ్య దృశ్యమును కన్నులారా

కాంచెదను." అని నిశ్చయించుకొని, ఎవరి కంటా పడకుండా ఒక పొదరింటిలో ఉండి పోయాడు.

రాధకి బాహ్యస్పృహ లేదు. కనులు మూసికొని తపోముద్రలోనే ఉన్నది. పెదవులు మాత్రమే జపం చేస్తున్నట్టు కదలుతున్నాయి. హఠాత్తుగా ఆమె కనులు తెరచి, ఇంద్ర ధనుస్సును చూచి, లేచింది.

" ఇంద్ర చాపంబు గాదిది మౌళితలమున
సవరించు బర్హి పించంబు గాని" అంటూ తన్మయత్వంతో చూడసాగింది.

పొదరింట్లో ఉన్న నారదుడు, "అయ్యో! రాధకు కృష్ణునికి, ప్రకృతికి భేదం తెలియటం లేదే! ఇంద్రధనుస్సుని కృష్ణుని కొండెముడిమీద ఉన్న నెమలి పించం అనుకుంటున్నది. ఉరుములని ఏమనుకుంటుందో ఏమో!" అనుకున్నాడు.

"భిదుర ఘోషంబు గాదిది, పాంచజన్య సం
జాత గంభీర ఘోషంబు గాని
ఆశ్రయించిన బలాకావళి గాదిది
హారి ముక్తాహార యష్టి గాని
ఇది కోల మెరుగు గాదుదిరి బంగారంపు

బసిమి గ్రమ్మెడు పచ్చ పట్టు గాని
వృష్టి గాదిది కరుణాంబు వృష్టి గాని
నీలమేఘంబు గాదిది నీల వర్ణు
డౌర! నా మ్రోల బ్రత్యక్ష మయ్యె"

అంటూ రాధ వంగి నేలకు నమస్కరించింది.

"ఆమెకు తన ఎదురుగా కృష్ణుడున్నట్టుగా కనిపించినది కాబోలు. ఆహా!

"హర్ష పులకిత తనువయ్యెనవ్వధూటి"

శ్రీకృష్ణుని వాసుదేవతత్త్వం రాధాదేవికి అనుభూతమైనది. ఇంక శ్రీకృష్ణు డామెను పరిగ్రహించుటయే మిగిలినది. శరదృతువు ప్రవేశించు చున్నది కదా! వేచి యుండి కాంచెదను." అనుకున్నాడు నారదుడు.

రాధ తల ఎత్తి చూచి, "ప్రభూ! మరల అంతర్ధానమైతివా? నా తపము చాల లేదా? నా కింకా అర్హత కలుగ లేదా?

తపములో క్రాగినది నాదు తనువు నీదు
విరహమను వేడిలోపల వేగె మనము
ఆత్మ ఇంకను నిను జేర నర్హ మవదె
జాగుచేయక నను జేరు వేగ కృష్ణ!

మరింత తీవ్రముగా నీ నామము జపించెదను. నీకై తపించెదను. కృశించెదను. అపుడైన నీ మనము కరగునేమో! కృష్ణా! ప్రాణనాయకా! రాధామనోహరా!!!"

అనుచు మరల పద్మాసనస్థయై, అర్ధనిమీలితనేత్రయై ధ్యానము నందు నిమగ్నయై పోయింది.

నారదునికి ఉత్కంఠ పెరిగిపోతోంది.

"జగన్నాటక సూత్రధారీ! నీ లీలలు తెలియ నెవరి తరము? నీవు, రాధామాత అయోని సంభవులుగా నందవ్రజంలోను, గోకులంలోను జన్మించి, రాధను చేరటానికి కంసభయం ఒక నెపంగా కల్పించావు కదా! ఏమి నీ చాతుర్యము? మీ ఇద్దరి సమాగమానికి జరిగిన లీలలో అపనిందలు కంసునికి, ఆనందం యశోదకి, నందగోకుల వాసులకీను. నిన్ను మెచ్చవలసినదే సుమా! త్వరపడి మాట జారినందుకు రాధ ఇంతగా తపము చేయ వలయునా?

నారాయణా! నీ లీలలు తెలియగ
బ్రహ్మాదులకైనను వశమా? ॥ నారాయణా ॥

జగన్నాటక సూత్రధారీ!
నాయక పాత్రలో నీవు నటింప

రస నిర్భరమౌ రాసలీలలో
నాయిక లేగా జీవులందరూ ॥ నారాయణా ॥

పుట్టుక లేని చిట్టి పాపడా!
నంద యశోదల తపముల ఫలమా!
వింత పెండిలి నీకు రాధకు
విరించి చేయగ చూచెద నేను ॥ నారాయణా ॥

నారాయణా! నారాయణా!! నమో నారాయణా!!! " నారాయణ నామంలోని మాధుర్యానికి పరవశించి పోతున్నాడు నారదుడు.

ఆ సమయంలో నందుడు అటుగా రావటం నారదుడి ఏకాగ్రతని భంగం చేసింది.

"ఇతడును కల్యాణఘట్టమును వీక్షించు ధన్యుడు కాబోలును. రాధకే కాదు ఇతడికిని నేను కనపడకుండా ఉండ వలయును. రాధ పరవశత్వంలో ఉండి నన్ను గమనించక పోవచ్చును. కాని, నందుడి విషయంలో జాగ్రత్త పడవలసినదే!" అనుకొని పొదరింటి వెనుక నున్న చెట్టు వెనుకకి వెళ్ళాడు.

నందుడు వస్తూనే, రాధ కోసం వెదికి, ధ్యానమగ్నయై ఉన్న రాధని దూరం నుండే చూసి,

" రాధా!" అని పిలిచాడు.

రాధకు వినపడినట్లే లేదు. ఉలక లేదు. పలక లేదు. రాధను సమీపించాడు నందుడు.

"రాధా! నువ్వు ఇక్కడ ఉన్నావా? కృష్ణుడు నువ్వు కావాలని పేచీ పెడుతున్నాడు. పసివాడిని ఎంతసేపు ఏడిపిస్తావు? ఎత్తుకొని లాలించు." అన్నాడు నందుడు.

కృష్ణనామం చెవులకు సోకగానే ధ్యానం వీడి, కన్నులు తెరచింది రాధ. ఆత్రుతగా,

"ఎక్కడ? నా కృష్ణ డెక్కడ?" అన్నది, లేస్తూ.

"కుంభవృష్టి పడుతుందేమో నన్నంతగా నల్లని మేఘాలు ఆవరించినాయి కదా! చిన్నతనం. భయపడుతున్నాడని గుహలో ఉంచి గోపకులను కాపలా ఉంచి వచ్చాను. నీ ధ్యానం అయితే తీసుకుని వస్తాను." అన్నాడు నందుడు.

"త్వరగా తీసుకొని రా! నేను ధ్యానం చేస్తున్నది, ఎదురు చూస్తున్నది కూడా కృష్ణదర్శనం కోసమే!" అన్నది రాధ విహ్వలతతో.

నందుడికి అర్థం అయినట్టు, కానట్టు ఉంది. రాధకి కృష్ణుడంటే ఇష్టమని, సరిగా చెప్పాలంటే ప్రాణమని తెలుసు. కృష్ణుడికి కూడా రాధ అంటే అంతే ఇష్టమని కూడా తెలుసు. కాని, కృష్ణుడి కోసం ఈ ధ్యానం ఏమిటి? ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చి ఎత్తుకుని ముద్దాడుతూనే ఉంటుంది కదా! ఏమో? ఇదొక రకం పిచ్చి కాబోలు అనుకుంటూ కృష్ణుణ్ణి తీసుకొని రావటానికి వెళ్ళాడు.

"కృష్ణా! ఎందులకీ ఆలస్యం? ఎంత కాలం ఈ ఎదురు చూపులు? విరహోర్తితో వేగుచుంటినే! ....." రాధ విలవిలలాడి పోతున్నది.

నందుడు బాలకృష్ణుణ్ణి ఎత్తుకొని వచ్చి, రాధ చేతికిచ్చి,

"రాధా! ఇదుగో! నీ కృష్ణుడు. బుజ్జగింపుము. ఆవులను మందకు తీసికొని వెళ్ళు సమయంలో వచ్చి కృష్ణుణ్ణి గృహమునకు కొంపోదును. జాగ్రత్త సుమా! అల్లరి వాడు. తెలుసు కదా నీకు! " అన్నాడు నందుడు.

"నా వద్ద బుద్ధిగానే ప్రవర్తించును లెమ్ము. ఏదీ? ఎక్కడా? కాన రాడే?" అన్నది రాధ.

"మంచిదే! వాడు అల్లరి చేసినను నీ కిష్టమేగా! ఇదుగో! నా వెనుకనే నక్కి ఉన్నాడు." అన్నాడు నందుడు. నందుని వెనుక కృష్ణుడు చిరునవ్వులు చిలుకరిస్తూ కనపడ్డాడు. రాధ కృష్ణుడి రూపాన్ని కన్నులతో త్రాగుతూ ఉండి పోయింది. ఆవుల వెంట నందుడు వెళ్ళినది కూడా గమనించ లేదు రాధ.

"ప్రభూ!

ఎదురు చూచి కన్నులెంతగా నొచ్చెనో
మందగించి చూపు మసక బారె
నీవు కాన రాగ నిండు తెలివిగల్గి
అంత నీవయి యిపు డందగించె"

అని కృష్ణుని చేతులను కన్నుల కద్దుకొన్నది రాధ. రాధకు కృష్ణుడు యువకుడుగానే కనపడుతున్నాడు కాబోలు అనుకున్నాడు నారదుడు. నారదునికి బాలుని వలె కన పడుతున్నాడు, మాటలు మాత్రం యువకునివి వలె వినపడుతున్నాయి.

"రాధా! గోలోకంలో జరిగిన వృత్తాంతం నీకు గుర్తు ఉన్నదా?" అడిగాడు ఆర్ద్రంగా కృష్ణుడు.

"ప్రభూ! ఎటుల మరతును?"

"నీవు నాకు ప్రాణాధికవు. మన ఇరువురి మధ్య భేదం లేదు. మన ఇరువురిని విడదీసి చూడటం సాధ్యం కాదు. ఆ విధంగా చూసిన వారు ఘోరనరకంలో పడతారు. వారు చేసిన పుణ్యాలన్నీ నశిస్తాయి. నీవు లక్ష్మివి. లోక సంపదవు. ఆధారస్వరూపిణివి.

మూలప్రకృతివి. అన్నింట నాతో సమానమైన దానవు. వాస్తవమునకు నాకన్నను అధికురాలవు. నాకు ఆరాధ్యవు. కనుకనే రాధవు. ఎవ్వరైనను 'రా' అన్న అక్షరాన్ని ఉచ్చరించగనే వారికి ఉత్తమమైన భక్తియోగాన్ని ప్రసాదిస్తాను. ఆ తరువాత 'ధ' అని పలుకగనే వారి వెంట పరుగెత్తుతాను."

కృష్ణుడి మాటలకు ప్రశ్నార్థకంగా చూస్తూ, "ఏల?" అన్నది రాధ.

"మరల ఆ నామము నుచ్చరించునేమో, వినుద మనెడి ప్రలోభముతో. నన్ను షోడశోపచారములతో పూజించిన దానికన్న 'రాధా' నామోచ్చారణము నాకు పరమ ప్రీతికరము."

"నాకన్న నా నామమే నీకు ప్రీతికరమా?"

"ఆ నామము నీది కనుక ప్రీతికరము."

"మాటలతో మాయ చేయుచున్నావు సుమా!"

"నా మాయాస్వరూపిణివి కూడా నీవే రాధా! నా గౌరవహేతువు కూడా నీవే!

'రా' యని పల్కగానె నెవరైనను పాయని భక్తి నిచ్చెదన్
'ధా' యని పల్కగా వెనుక ధావన మెంతయు జేసెదన్ ప్రలో
భాయత చిత్తతన్ మరొక వారము నాతడు పల్క విందు 'రా
ధా' యన నంచు మోహవశతన్ విను రాధ నిజంబు పల్కుదున్."

"నా పేరుమీద అభిమానం పెంచుకున్నావు కాని, నన్ను దూరం చేశావు కదా! నా మనసిప్పుడు నీ వియోగాగ్నిలో వేగిపోవుచున్నది. నీ పాదపద్మాల మీద నిలిచిన నా చూపులు మరి దేని మీద నిలచుట లేదు."

"ఆ కారణంగానేనా నీవు భూమిపై అవతరించిన పిమ్మట కనులు తెరచుట కిష్టపడ లేదట కదా!" అభిమానంగా అడిగాడు కృష్ణుడు.

"సర్వాంతర్యామివి. నీకు తెలియని దేమున్నది?"

"అయినను నీ నోట వినుట నాకానంద దాయకము."

"నీ ఆనందమున కన్న నాకు కావలసిన దేమున్నది? నేను కన్నులు తెరవక పోవటంతో నా తల్లి తండ్రులు కలత చెంది, తమ ఇష్టదైవాన్ని ప్రార్థిస్తూ ఉండి పోయారట! అపుడు నారదమహర్షులవా రరుదెంచి నా ప్రాణనాథుని కీర్తించారట! ఆ నామసంకీర్తనం ఔషధమై నా కనురెప్పలు విడివడి నాయట!"

వింటున్న నారద మహర్షికి క్షణమాత్రంలో ఆ నాటి వృత్తాంతం అంతా మనసులో మెదిలింది. దివ్యతేజస్సుతో, బంగారుబొమ్మ వలె మెరిసి పోతున్న రూపం, తామరరేకుల వలె విశాలంగా ఉన్న మూసిన కనురెప్పలు, చూసిన కళావతీ వృషభానుల వేదన, బంధువుల పరామర్శలు, ఇవేవీ పట్టనట్టున్న పాప, తన కృష్ణకీర్తన విని కళ్ళు తెరవటం – ఒక్కొక్క దృశ్యం కళ్ల ముందు కడలాడింది నారదమహర్షికి.

"గోలోక వృత్తాంతము మరువకుండునట్లు వరము కోరితివి కదా!" అన్నాడు కృష్ణుడు.

"నిరంతరం నీ జ్ఞాపకాలు మనసులో నిండి ఉన్నాయి కనుకనే క్షణం క్షణం విరహంతో వేగిపోతున్నాను. గోలోకంలో నీకు క్షణం అనిపించే కాలం ఈ గోకులంలో, ఇది భూలోకం కదా, సంవత్సరాలై, యుగాలు గడచిన ట్లనిపిస్తోంది."

"ప్రియా! కాల మెవర కైనను దురతిక్రమము. ఒకమారు నిర్ణయ మైనాక నాకును దాట రానిదే! సృష్టికర్త కూడా ఏమీ చేయ లేడు."

"నన్ను తలచితివా? తండ్రీ! సర్వజగదాధారా! సర్వజగత్కారణా!! సర్వాంతర్యామీ!!! నమో నమః!" అంటూ సహస్రారంపై చేతులు జోడించి ప్రవేశించాడు చతుర్ముఖుడు.

శ్రీకృష్ణుడు అభయ ముద్రతో ఆశీర్వదించాడు. బ్రహ్మ రాధ వైపు తిరిగి నమస్కరిస్తూ,

"ఓ మాతా! నీ పాదపద్మముల దర్శనభాగ్యము చేత నేను ధన్యుడను. ఈ అదృష్టం పొందటానికి నేను పుష్కరక్షేత్రంలో అరువదివేల సంవత్సరాలు తపస్సు చేశాను. నా తపస్సుకి మెచ్చి, శ్రీకృష్ణ పరమాత్మ ప్రత్యక్షమై, వరం కోరుకోమ్మంటే, తల్లీ! నీ పాదపద్మాలను సందర్శించే భాగ్యం ప్రసాదించు మని కోరాను. అపుడు నా తండ్రి వాత్సల్యంతో, తగినకాలంలో నీకు చూపించ గలనని వరమిచ్చాడు. ఆ తగిన కాలం ఇప్పుడు సంప్రాప్తించింది. అనుగ్రహించు మాతా!

"నీ పాదముల చెంత చేరే అదృష్టం ఎంత తపసు చేస్తే లభిస్తుందో! తల్లీ! నిన్ను కీర్తించటానికి ఎవరూ సమర్థులు కారు. నీవు శ్రీకృష్ణ పరమాత్మకు వ్యక్తరూపానివి. మీరిరువురు ఎవరి అంశలు ఎవరో నిర్ధారించటం సాధ్యం కాదు. దేవతల కందరకూ మూలపురుషుడను, తండ్రిని అయిన నేను నీ గుణాలలో శతాంశం కూడా ఎరుగను, కీర్తించ లేను అనగా ఇతరులెంత? వేదములే నీ తత్త్వాన్ని వివరించ లేక పోయినాయి కదా! మాతాపితరులైన మీ వాత్సల్యమే నాకీ అదృష్టాన్ని కలిగించింది."

చతుర్ముఖ బ్రహ్మ రాధాకృష్ణ లిరువుర పాదాలకు నమస్కరించాడు.

రాధ బ్రహ్మ స్తుతికి సంతసించి,

"ఓ విధాతా! నీ మనమునందలి కోరిక కోరుకొనుము." అన్నది.

"అమ్మా! మీ ఇరువుర పాదపద్మాలపై అచంచల భక్తిని వరముగా నిమ్ము!" అన్నాడు బ్రహ్మ.

రాధ "తథాస్తు!" అన్నది.

"అమ్మా! ఇప్పుడు నేనిక్కడకు వచ్చింది నా కర్తవ్యమును నిర్వర్తించటానికి. అనుజ్ఞ నీయ వలసినది."

"అటులనే సాగించు." అన్నది రాధ.

బ్రహ్మ సంకల్పమాత్రంగా హోమకుండాన్ని కల్పించి, మహాసంకల్పాన్ని చెప్పి, రాధాకృష్ణులను ఆ అగ్ని చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం చేయించాడు. బ్రహ్మ వేదోక్తంగా రాధాకృష్ణుల వివాహక్రతువును నిర్వర్తించాడు. రాధ కృష్ణుని కంఠము నందు పుష్పమాలను అలంకరించింది. కృష్ణుడు రాధ మెడలో పూలదండను వేశాడు. బ్రహ్మ రాధాదేవి చేతిని కృష్ణుని చేతి యందు మంత్రపూతంగా ఉంచాడు. రాధాకృష్ణులు ఒకరి సరసన ఒకరు నిలిచారు. ఆ శుభసమయంలో దేవదుందుభులు మ్రోగాయి. దేవతలు పుష్పవృష్టి కురిపించారు.

బ్రహ్మ రాధాకృష్ణులకు నమస్కరించి, " ధన్యోస్మి! ధన్యోస్మి!! ప్రకృతి పురుషులైన మీ ఇరువురను ఈ విధంగా జంటగా చూడటం ఎన్నో నోముల ఫలం. అమ్మానాన్నల పెండ్లి చేసిన ఘనతను నాకు కలిగించారు." అన్నాడు.

"వత్సా! నీకు మంగళమగు గాక! మా ఇరువుర పాదపద్మములపై నీకు భక్తి

స్థిరముగా నిలిచి ఉంటుంది. నీ విధిని నువ్వు నిర్వర్తించావు. నీకు సెలవొసంగు చున్నాను. నీ లోకమునకు వెళ్ల వచ్చును."

బ్రహ్మ మరొక్కమారు, రాధాకృష్ణులకు నమస్కరించి, "జననీజనకులారా! పోయి వచ్చెద." నని తన లోకానికి సంతృప్తితో వెళ్ళాడు.

రాధాకృష్ణ లిరువురు ఆనందంతో సమయాన్ని గడుప సాగారు.

"రాధా! నందమహారాజు వచ్చు సమయ మాసన్న మైనది." అన్నాడు కృష్ణుడు.

"కృష్ణా! నను వీడి పోవుదువా?" దీనంగా అడిగింది రాధ.

"ఇప్పటికి నందునితో పసిబిడ్డగా వెళ్ళక తప్పదు. అతిత్వరలో కంసభయం అనే నెపంతో అందరం బృందావనం వచ్చెదము. అప్పుడు నిత్యమూ మనం రహస్యంగా విహరించ వచ్చును."

"నందనందనుడుగా, బాలకృష్ణుడవైన నీతో విహారములా?

"నీతో విహారసమయంలో ఇప్పటివలెనే మనము కిశోరప్రాయులమే." అన్నాడు శ్రీకృష్ణుడు.

"ఆ రోజు కొరకు ఎదురు చూస్తూ ఉంటాను." అన్నది రాధ.

దూరంగా నందుడు వస్తున్న అలికిడి. కృష్ణుడు బాలుని రూపంలో రాధ ఒడిలో ఆడుకుంటున్నాడు.

"ఆహా! గోకులంలో రాధాకృష్ణుల పునస్సమాగమ దృశ్యాన్ని కన్నులారా చూచే భాగ్యం లభించింది. జన్మ ధన్యమయింది. ఇంక నందాదులు వచ్చే సమయం అవుతోంది. నేను పోయి వచ్చెద."

నారదుడు అంతర్ధాన మయ్యాడు.

16

యమునానదీతీరాన, బృందావనంలో ప్రకృతి దేని కొరకో ఎదురు చూస్తున్నట్టు నిశ్చలంగా ఉంది. ఒక ఆకు అల్లాడినా, ఒక పూవు పిల్లగాలికి ఉయ్యాలలూగినా, మారుతం మందంగా కదలినా, ఒక్క పిట్ట రెక్క లల్లార్చినా, చిరుసవ్వడి చేసినా – ఆ

ఒక్క క్షణంలో ఏమి చూడటం కోల్పోతామో అనే ఉత్కంఠతో కదలక మెదలక ఉండిపోయాయి. శ్రీకృష్ణుడు, శారదుడు ఒక పొదరింటిలో దాగి ఉండి జరిగే దానిని చూస్తున్నారు. కృష్ణుని ముఖంలో మురిపెం, శారదుని ముఖంలో కుతూహలం వ్యక్తమౌతున్నాయి. అప్పటికే రాధ అక్కడకు చేరి, వెదుకుతూ ఉంది. చెట్టుచెట్టునీ పరామర్శిస్తోంది. కొమ్మకొమ్మనీ పరిశీలనగా చూస్తోంది. పూపొదలని లోపలికి పరికించి మరీ చూస్తోంది. ముఖంలో ఒక క్షణం ఉత్సాహం, మరొక నిముషంలో నిరాశానిస్పృహలు కనపడుతున్నాయి. రాధ ప్రతిచర్యని ఉత్సాహంగా గమనిస్తున్న కృష్ణుడు,

"శారదా! చూచితివా? రాధ అనుకున్న సమయాని కన్న ముందుగానే వచ్చినది." అన్నాడు.

"మిత్రమా! నీవు మాత్రము ..... ? రాధ కన్న ముందుగానే వచ్చి ఎదురు చూచుచుంటివి కదా!" అన్నాడు శారదుడు.

"నేను వచ్చినది యమునాతీర విహారానికే గాని, రాధ కొరకు కాదు. నీకు తెలియదా?"

"నా కెందుకు తెలియదు? నీ వెంతటి వారి నయినా మాయలో పడవేయ గలవు కాని, నన్ను మభ్యపెట్ట లేవు." అన్నాడు శారదుడు వ్యంగ్యంగా.

దానిని గమనించ నట్టు కృష్ణుడు, " శారదా! నీవు నా అంతరంగికుడవు. నా అంతరంగము నీకు గాక మరెవరికి అవగత మవుతుంది?" అన్నాడు.

"నీ అంతరంగమన రాధా మహాదేవియే కదా! ఆమెను అర్థం చేసుకోవటం, ఆ తత్త్వాన్ని తెలుసుకో గలగటం నీ కొక్కనికే సాధ్యం. మే మామె దివ్యసౌందర్యం చూసి, విభ్రాంతులమై సర్వమును విస్మరించి, సమ్మోధులమై పోతాము."

"నేనును అంతే సుమా!" ఆరాధనా పూర్వకంగా రాధను గమనిస్తూ అన్నాడు కృష్ణుడు.

రాధ ఇంకా వెతుకుతూనే ఉంది. తనలో తను ఏదో మాట్లాడుకుంటూనే ఉన్నది. విహ్వలత కొట్టవచ్చినట్టు కనపడుతోంది.

"శ్రీకృష్ణా! యదుభూషణా!! రాధార్చిత చరణ పంకజా!!!

నీకై ఎదురు చూచి క్షణాలు యుగాలుగా గడపు చుంటినే! ఈ తమాలవృక్షపు శ్యామవర్ణం చూచి నీవే నని భ్రమించితిని. వెదురుపొదలలో చేరిన వాయువు నీ మురళీగానాన్ని అనుకరించి, నన్నా వైపుకి ఆకర్షించింది. ఈ యమునానదీ సైకతశ్రేణులు ఎంతటి పుణ్యము చేసుకున్నవో స్వామి పాదస్పర్శసౌభాగ్యానికి నోచుకున్నాయి. ఈ వైపు నుండి వీచుచున్న మారుతము నాకు ఇంతటి విరహవేదనలోను, సుఖానుభూతిని కలిగించుచున్నది – నా ప్రభువు మేనిస్పర్శతో పులకించి, ఆ పరీమళమును, స్పర్శను మోసికొని వచ్చుచున్నది. నా ప్రాణనాయకుడు ఇక్కడనే ఎక్కడనో ఉండియుండ నోపు. ..... ”

వెదకటం ఆపి, ఆ గాలి లోని కృష్ణస్పర్శను, కృష్ణుని పరీమళమును అనుభూతి చెందుతూ, చెట్టుబోదె నానుకొని, అరమోడ్పు కనులతో నిలచి ఉండి పోయింది. చలనం లేక శిల్పమనే భ్రమ కలిగిస్తోంది.

కృష్ణుడు, “చూచితివా? శారదా!” అన్నాడు ఆనందంగా.

“చూడకేమి? స్పష్టముగా కనపడుచున్నది నీ తన్మయత్వము. ఎవరు ఎవరికి ఆరాధకులో మాత్రము తెలియుట లేదు.”

“నా చేత ఆరాధింప బడుతుంది కనుకనే ఆమెకు రాధ అన్న పేరు సార్థకమయింది.”

“నేను తద్విరుద్ధముగా భావించితినే? అంతే కాదు, రాధాదేవియు అటులనే చెప్పినది.”

“ఏమని?”

“కృష్ణుని ఆరాధకురాలను కనుక రాధను అని.”

“అదియును వాస్తవమే.”

“నిజము ఒక్కటే ఉండును. రెండు నిజము లుండవు.”

“సత్యమునకు రెండు పార్శ్వములుండును కదా – ఋతం, అనృతం అని, చూచే వారి దృష్టిని బట్టి.”

“కృష్ణా! నీ మాటలన్నీ కొంత అర్థమైనట్టు, కొంత అర్థం కానట్టు ఉంటాయి.”

"అర్థం కాక పోతే వచ్చే ప్రమాదమేమీ లేదులే!"

"నువ్వన్నదీ నిజమే. నీ ప్రమోదమునకు, నా మోదకాస్వాదనమునకు సమయ మాసన్నమైనది."

"మోదక ప్రియత్వమున విఘ్నేశ్వరుని ఆదర్శముగా గ్రహించినట్టున్నది."

"గొప్ప వానితోనే పోల్చితివే!"

"నీవు తక్కువ వాడవా? అంతటి వాడవే కదా! "

"పొగిడింది చాలులే! నన్ను వెళ్లమనే కదా ఈ పొగడ్త. పానకంలో పుడకవలె నేనిక్కడ ఎందులకు?" అని శారదుడు కృష్ణుని ఒంటరిగా వదలి, అక్కడి నుండి నిష్క్రమించాడు.

కృష్ణుడు నెమ్మదిగా అడుగులు వేస్తూ, రాధను సమీపించాడు.

"రాధా!" అన్నాడు నెమ్మదిగా.

"ప్రభూ!" అని రాధ పరవశత్వంతో చేతి లోని పుష్పమాలను కృష్ణుని మెడలో వేయ బోయింది. కృష్ణుడు రాధను వారించి, ఆ హారాన్ని తను గ్రహించి, రాధ మెడలో వేశాడు.

తెల్ల బోయిన రాధ ముక్కున వేలు వేసుకుని ,

"స్వామీ! అపచారము." అంది.

"ప్రాణసఖీ! ఇది సదాచారము."

"ఆ దండ మీ కొరకు తెచ్చినది. తోటలన్నీ తిరిగి, తుమ్మెదలు ఎంగిలి చేయటానికన్న ముందే విచ్చీ విచ్చని పూలను సేకరించి, ప్రేమను చేర్చి దండగా నల్లి, నిన్ను అలంకరించటానికి సిద్ధం చేశాను. ఆ వనమాల ప్రక్కను ఈ పూల మాల ఎంత సొగసుగా ఉండేదో! "

"పూబాల మెడలో నీ పూమాల మరింత సొగసును సంతరించుకొన్నది. చూడు! ఎప్పుడూ అలంకరణ నాకు మాత్రమేనా? నీకు వద్దా? ఈ రోజు నేను నిన్ను అలంకరించ దలచాను." అన్నాడు కృష్ణుడు.

"అది సరే, కాని , ఆ దండ నీ ....."

"మన మధ్య భేదం లేదు కదా! నా మెడలో అలంకరించబడినా, నీ మెడలో అలంకరించబడినా తేడా ఏమిటి?"

" ....."

"ఇప్పుడు నేను నిన్ను అలంకరిస్తాను."

"నేను చేసుకున్న అలంకారము నీకు నచ్చ లేదా?" రాధ చిన్న బుచ్చుకున్నట్టుగా అడిగింది.

"అవునన్నా ప్రమాదమే! కాదన్నా ప్రమాదమే! ఏమన్నా కోపగించుకొన గలదు." అని మనస్సులో అనుకున్నాడు. పైకి మాత్రం

"రాధా! అలంకరించుకొనటంలో నీవు దిట్టవు. నేను చేయునది పై పై మెరుగులు దిద్దుట మాత్రమే." అన్నాడు.

కాదనటానికి రాధకు కారణ మేమీ కనిపించలేదు. పైగా ముచ్చటగా అనిపించింది.

"ఏదీ, ఏమేమి మెరుగులు పెడతావో చూస్తాను." అన్నది.

కృష్ణుడు తన మెడలోని కురువిందమణులు, గరుడపచ్చలు, పొదిగిన పతకం ఉన్న ముత్యాలహారాన్ని తీసి, రాధ మెడలో వేశాడు. ఒక్క అడుగు వెనక్కి వేసి, ఆమె వంక ఎగాదిగా చూచి, ముఖము నటునిటు తిప్పి పరికించి, తన నుదుట అలంకరించ బడిన తిలకం నుండి కస్తురి తీసి, రాధ నిలువుగా తీర్చిన తిలకమునకు క్రింద చిరుచుక్కగా పెట్టాడు. ఆమె చిబుకాన్ని తన చేతితో పట్టుకుని, ముఖాన్ని, అటు ఇటు త్రిప్పి చూచి, మురిపెంగా,

"ముద్దులు మూట గట్టుచున్నది నీ ముఖము." అన్నాడు.

రాధ బుంగమూతి పెట్టి, మూతిని మూడువంకరలు త్రిప్పి,

"... ఊఁ!" అన్నది.

అది అలకయో, కోపమో, సంతోషమో తెలియటం లేదు.

"నీ సౌందర్య మంతయు నీ బుంగమూతిలోనే ఉన్నది సుమా!" అన్నాడు కృష్ణుడు.

రాధ ఫక్కున నవ్వింది. కృష్ణుడు దేని కొరకో వెదకుతున్నట్టు అటు ఇటు పరికించి చూడ సాగాడు. రాధ రెండుచేతులను చిన్ముద్రతో దగ్గరకు తెచ్చి, చేతి వ్రేళ్లను తిప్పుతూ 'ఏమది?' అన్నట్టు కనుబొమ లెగుర వేసి చూడ సాగింది.

"నవ రత్నము లెక్కడ పడినవా? యని" కృష్ణుడు గంభీరముగా చెప్పాడు.

"ఇదిగో పెద్ద నీలము!" కృష్ణుని చూపించి నవ్వ సాగింది.

"నా చాయను చూచి నవ్వుచున్నావా? నాకును కోపము వచ్చును." కృష్ణుడు కోపము నభినయించును.

"అదియును అందమే కదా! నీది నాణ్యమైన వర్ణము. అన్నింటిని తనలో లయం చేసుకొనే శాశ్వతమైన వర్ణము. వెలుగుల కవ్వల, వెలుగులకు మూలమైన దివ్యతేజోవిరాజితము. అందరినీ ఆకర్షించేది ఈ నీలమోహనరుచియే కదా! సర్వ ప్రకృతిని సమ్మోహ పరచే ....."

కృష్ణుని వంకే చూస్తూ మాట్లాడుతున్న తానే సమ్మోహపడి, తన్మయురాలై ఆరాధనాభావంతో చూస్తూ ఉండిపోయింది.

"ఈమెను బాహ్యస్మృతిలోకి తీసికొని రావలెను సుమా!" అనుకొని, ఆమెను తన గుండెల కద్దుకొని ఆశ్వాసించాడు. మృదుమధురంగా

"ప్రణయేశ్వరీ!నను దయ గనవే!
అరమోడ్పు కనులతో నైన నను గనవే!"

అని పాడాడు. రాధ స్పృహలోకి వచ్చి పాటని అందుకుంది.

"ప్రాణేశ్వరా! నీ దరి జేరితిరా!
నన్నేలు నా స్వామి నేను నీ దానరా!"

విహ్వలయై రాధ పలికిన పదానికి కరగి పోయిన కృష్ణుడు రాధ గడ్డాన్ని కుడిచేతి మధ్యవేలుతో పైకెత్తి , ఆమె కన్నులలోకి చూస్తూ,

"నా ఏలికసాని! నా ప్రాణ మీవె
నా గానమీవె, నా ఊపిరి నీవె !"

అన్నాడు.

"నాదంటు ఏమీ మిగిలి లేదే
నీకీయగా నా వద్ద ఏమి కనపడదే"

వాపోయింది రాధ.

"నీవుంటి వది చాలదా?" కృష్ణుని సమర్ధన.

"నేను నీకర్పణెతి కాదా!" రాధ అన్నది.

"ఇరువు రొకరికొకరము ఇరువురొక్కరమె" ఇద్దరు ఒకరి చూపులలో మరొకరు కరగి పోతూ గొంతులు కలిపారు. ఆత్మలు కూడా ఏకమైనాయి. అద్వైతస్థితిలో బాహ్యస్పృహ లేదు. రాధకు బాహ్యస్మృతి తెప్పించబోయి తానే తన్మయుడయ్యాడు. ఆ అవస్థలో ఉండగా

"వయస్యా! వేగుచున్నది. గోకులము నిద్ర లేచుచున్నది. వ్రజవనితలు చల్లచేయుచున్న మధురనాదము వినబడుట లేదా? యశోదామాత వెన్న పెట్టుటకై నీ కొరకు చూచునేమో"

అంటున్న శారదుడి హెచ్చరికతో ఇద్దరూ ఈ లోకంలోకి వచ్చారు.

"వచ్చుచుంటిని శారదా! వచ్చుచుంటిని." అన్నాడు కృష్ణుడు.

"రాధా! నీవు గృహమున కేగుము. అందరి కనులలో పడుట ఎందులకు? ఆ పై నోళ్లలో పడ వలసి ఉండును."

రాధాకృష్ణులు వీడ లేక, వీడ లేక ఒకరి వైపు ఒకరు చూసు కుంటూ కదిలారు. కృష్ణుడు శారదుడు ఒక వైపు వెడుతుండగా రాధ దిగులుగా తన ఇంటి వైపు నెమ్మదిగా అడుగులు వేసింది.

17

శరజ్జ్యోత్స్నలో ప్రకృతి సుస్నాతయై పులుగడిగిన ముత్యంలాగా స్నిగ్ధ మనోహరంగా ప్రకాశిస్తూ ఉంది. రసోల్లాసయై యమునానది మందమందంగా ప్రవహిస్తూ ఉంది. సైకతశ్రేణులు వెండిరజను పోసినట్టు భాసిస్తున్నాయి. ప్రతి అణువు ఉద్విగ్నంగా ఉంది. దేనికోసమో క్షణమొక యుగంగా ఎదురు చూస్తూ చైతన్య స్వరూపంగా ఉంది. చంద్రుడు తనదృష్టికి వృక్షాలేవీ అడ్డు రాకుండా

చూసుకుంటున్నాడు. చుక్కలన్నీ మినుకుమంటే క్షణార్ధ భాగమైనా ఆ మనోజ్ఞదృశ్యం చూడటం తప్పి పోతుందని మినుకు మినుకు మన కుండా వెలుగుతున్నాయి.

నిశీధిలో నిశ్శబ్ద ప్రకృతిలో తానూ అంతర్భాగమై ఊపిరి కూడా తియ్యకుండా తమాలవృక్షపునీడలో నిలిచి ఉంది శృతి చేసిన వీణలాగ రాధారాణి. తన ప్రీతి కోసమే రాసరచన చేస్తానని వాగ్దానం చేసిన రసస్వరూపుడైన వేణూద్వహుడి రాకకి ఎదురు చూస్తూ క్షణ మొక యుగంగా గడుపుతూ.

రాశిచక్రంతో చంద్రుడు చేసే నృత్యవిన్యాసానికి చేసిన భౌతిక రూపకల్పనని చూసి, రసానందమగ్నులు అయి ధన్యులు కావటానికి దేవతాగణాలు అన్నీ అంతరిక్షంలో నిర్నిమేషంగా ఎదురు చూస్తున్నాయి. విశ్వగమనం లోని లయలో తమని తాము శృతి చేసుకుని తన్మయం అవటానికి ఒళ్ళంతా చెవులు చేసుకుని నిరీక్షిస్తున్నాయి. తాము కూడా యమున ఒడ్డున ఒక వృక్షమన్నా, రాయి అయినా, కనీసం ఇసుక రేణువైనా బాగుండేది కదా అని ప్రతివారూ భావిస్తున్నారు. బృందావనం లోని గోపికల పైన కించిత్ అసూయ వంటి భావన తొంగిచూసింది వారి మనస్సులలో.

ప్రశాంతమైన, నిశ్శబ్దనిశీధిలో విశ్వాంతరాళంలోని గ్రహగోళాల లయబద్ధమైన గమనాలకి అనుగుణమైన తాళాన్వితంగా, విశ్వమోహనరాగం మంద్రంగా లీలగా వినపడింది. రాధారాణి శరీరంలోని అణువణువు చైతన్యవంత మయింది. మనస్సు చంద్రోదయ సమయంలోని సముద్రం లాగా ఉప్పొంగిపోయింది. రాధ ప్రాణం ఎగసిపడి వేణునాదంలో లయమయి తన అస్తిత్వాన్ని కోల్పోయింది. సమస్త ప్రకృతి ఒక్కసారిగా పులకించింది. యమునానది అలల తలలెత్తి నిక్కినిక్కి చూస్తోంది. ఆ సమ్మోహనస్వరం వచ్చిన వైపుకి అప్రయత్నంగా దృష్టి సారించింది సమస్త ప్రకృతి.

సృష్టిలోని సౌందర్యం అంతా రాశీభూతమైనట్టున్న మూర్తి అక్కడ వ్యతస్తపాదారవిందుడై, మువ్వంకలతో నిలిచి ఉన్నాడు. చేతిలోని మురళిని పెదవులపై చేర్చి, ముద్దుపెట్టుకుంటున్నట్టుగా ఉన్నాడు. అతడి స్పర్శ కోసం తపించి ఒళ్ళంతా కాల్చుకున్న వెదురుముక్క అతడి పెదవిస్పర్శతో పులకించి పోయింది. ఆ పులకాంకురాలు పొటమరించి తీగలు సాగాయి. రాగాలయ్యాయి. ఆ రాగతరంగాలు గాలిలో తేలియాడి అన్ని దిక్కుల పరివ్యాప్తమయ్యాయి. ఆ గానామృతం పాలవెల్లువై వెన్నెలతో కలిసి వెల్లువెత్తింది. ఆ వెల్లువలో సర్వప్రకృతి తలమునక లయ్యింది.

బృందావన పరిసరాలలోని మందలన్ని మురళీగానంతో పరవశించి పోయాయి. ప్రతిజీవికి తమకి చెవులుండటం సార్థకమయిందని తోచింది. గానామృతాన్ని చెవులతో త్రాగితే శరీర మంతా, శరీరంలోని ప్రతి అణువు ఆత్మదహ్నంగా తన్మయ మవట మాశ్చర్యమే! ఆ ఆశ్చర్యం ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా వ్యక్తమయింది. నిజానికి అది అవ్యక్తమాధుర్యం. ఆ మధురభావనలో వారికటుపై ఏమి తోచలేదు. వారి చిత్తాలు వారి అధీనంలో లేవు. ఎలా ఉన్న వారు అలానే, ఉన్నవారు ఉన్నట్టుగా ఆ గీతం వచ్చిన వైపుకి ఆకర్షించ బడ్డారు.

ఒక గోపకాంత అలంకరించుకుంటూ ఉన్నది. ఒక కంటికి కాటుక పెట్టుకున్నది. రెండవ కంటికి పెట్టుకోవాలని మరచిపోయింది. నీల కుంకుమ ధరిస్తూ క్రీచుక్క పెట్టుకోలేదు. అరుణ ఒక చెవికి తాటంకం పెట్టుకుంది. అంతే! రెండో చెవికి పెట్టుకోవాలన్న ధ్యాసే లేదు. శ్యామకు చీరకుచ్చిళ్ళు ఎలా పెట్టుకోవాలో గుర్తురాలేదు. ఎలాగో ఒక లాగు చుట్టుకుంది. రత్నకు వల్లెవాటు సంగతి దృష్టికే రాలేదు. మణి కంచుకాన్ని ధరిస్తోంది. ముడివేయలేదు. వదలివేసింది. వకుళ ఒడిలో ఉన్న పసివాడు క్రిందపడిన సంగతి గమనించనే లేదు. క్రొత్తగా వివాహమైన మధుమంజరికి భర్తకౌగిలిలో ఉన్నానన్న విషయమే స్పృహలో లేదు. తన వల్లెవాటు కొంగు భర్తచేతిలో ఉందన్న ఆలోచన లేక శయ్య మీద నుండి లేచి పరుగు లాంటి నడకతో పడకగదిని, నట్టింటిని దాటి, పెరడు దాటి, వీధిలోకి వెళ్లింది. యమునకి అభిముఖంగా నడక సాగించింది. భార్యకొంగు తనచేతిలో ఉంది కదా! పాపం! క్రొత్తపెళ్ళికొడుకు వెన్నంటి వెళ్ళాడు. మాణిక్యం పిల్లలకు అన్నం పెడుతు పెరుగు వడ్డిస్తున్నది ఆ తెడ్డుని, పెరుగుకుండని వదలి యమున దిక్కుగా నడచింది. బిడ్డకు పాలిస్తున్న జలజకి వాడిని క్రింద పడుకోబెట్టాలనే ఊహ కూడా లేకుండ, అలాగే పట్టుకొని బయలు దేరింది.

అందరిలక్ష్యం ఒకటే!

అందరు స్వప్నావిష్టల వలె అటువైపుకి సాగారు. వేణునాదం వేసిన దారిలో తమ ప్రమేయం లేకుండానే గాలిలో తేలుతున్నట్టుగా యమునాతటానికి చేరుకున్నారు. వారు మాయాజాలంతో మంత్రముగ్ధలై వచ్చినట్టు కాక పూర్తి స్పృహతో సమర్పణ చేసుకున్నప్పుడు కదా ఉద్ధరించ బడేది. అందుకే గోపికలకు కృష్ణుడు,

"ఈ విధంగా రావటం తప్పుకాదా! అందరు తప్పు పట్టరా? భర్తలని, పిల్లలని వదలి రాకూడదు కదా! అది దోషం అవుతుంది. కుటుంబసభ్యులని వదలిపెట్టటం అందరికి క్షేమం కాదు." అంటూ లోకరీతులని బోధించాడు. చివరికి

"ధ్యానాకర్ణన దర్శన
గానంబుల నా తలంపు గలిగిన జాలుం
బూనెదరు కృతార్థత్వము
మానవతుల్ చనుడు మరలి మందిరములకున్"

అని హితోపదేశం చేశాడు.

మహతిని శృతిచేయటంలో పాఠాలు నేర్చుకుందామని ఎదురు చూస్తున్న నారదుడు, "మాట్లాడటంలోను, నటనలోను కూడా ఈ లీలామానుష విగ్రహుడి వద్ద పాఠాలు నేర్వ వలసినదే సుమా." అనుకున్నాడు.

"నిన్ను నమ్మి వచ్చిన మమ్ములను ఈవిధంగా నిరాదరించటం న్యాయం కాదు. నీకోసం అన్నీ వదలి వచ్చాము. ఈశ్వరుడైన శ్రీహరి 'మోక్షాసక్తులం గాచు పోలిక గావం దగు'." శరణాగతి చేసింది జలజ.

"లోకంలో బ్రతికిఉన్నవారు లోకమర్యాద ననుసరించి భర్తలను, బిడ్డలను, బంధువులను సేవించటం ధర్మం అని చెప్పావు. భర్త, కొడుకు, బంధువు మొదలైన పేర్లతో, రూపాలతో నువ్వే ప్రవర్తిస్తున్నావు కదా! కనుక నీ యందే భర్త, కొడుకు, బంధువు మొదలైన భావాలని సమర్పించి, ఆ భావాలతో వారికి బదులుగా నిన్నే సేవించుకొన వచ్చునుగా! ఇది న్యాయం అవదా?" ప్రార్థించింది నీరజ.

గోపికలు చేసిన ఈ విన్నపంలో వ్యక్తమౌతున్న వారి మనస్సులలో చెలరేగుతున్న భావసంచలనానికి చలించి పోయారు దేవతలు. కృష్ణుడి సాన్నిధ్య ప్రభావం వల్ల వారికి లోకం కృష్ణమయమై తోచింది అనుకున్నారు. "కృష్ణుడు ప్రియుడు. ప్రియతముడు. కాముకతతో కాదు. భర్తగాను, కొడుకుగాను, బంధువు గాను కూడా అతడినే భావిస్తామని అనటంలో వారి కృష్ణపరమైన భావన ఎంత తీవ్రమైనదో తెలుస్తుంది. వారందరు ఎంతటి అదృష్టవంతులో. ఇంతగా లోకం వారికి కృష్ణమయంగా కనిపించినప్పుడు వారిని మందలించవలసిన అవసరం ఏమిటి?" అనుకున్నారు.

గోపికల మాటలలో ఇంకా కామభావన స్ఫుటంగా కనపడుతున్నా అంతర్లీనంగా సమర్పణభావం తొంగిచూస్తూ ఉంది. రానురాను సర్వసమర్పణభావన కామభావనని అధిగమించి, భక్తి అతిశయించి వారి మాటలలో పొంగిపొరల సాగింది.

గోపికల భక్తికి మెచ్చిన యోగేశ్వరేశ్వరుడైన కృష్ణుడు ఆత్మారాముడై గోపికలతో రమించి వారిని ఆనందింప చేస్తుంటే, అంతరిక్షం నుండి వీక్షిస్తున్న నారదాదులకు కూడా శృంగారభక్తి ఆత్మని స్పృశించి, ఆనందానుభూతిని కలిగించింది. పరమాత్ముడైన శ్రీకృష్ణుడు, ఎంతటి మాయామానుషవిగ్రహుడైనా ఇంతమందితో ఏకకాలంలో ఏ విధంగా ఆనందింప చేయగలిగాడు? అనే సందేహం మనస్సులో తలెత్తగానే నారదుడు అనుభూతికక్ష్య నుండి ఆలోచనాకక్ష్యలోకి వెళ్లిపోయాడు. అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. పరంధాముడి అనుగ్రహం ప్రసరించి పరమార్థం మనస్సులో విచ్చుకుంది.

"శ్రీకృష్ణుడు గోపికలని శృంగారక్రీడలలో తేల్చినప్పుడు తన యందుతానున్నాడే కానీ వారి యందు లేడు. తన భౌతిక శరీరంలో కూడా లేడు. వారిని కూడా తన లోనికే తెచ్చుకున్నాడు కనుక, వారి ఆత్మలలో 'నేను' అనే ప్రజ్ఞగా నిలబడి ఉండి వారిలోని నేను అనే ప్రజ్ఞగా ఆనందించాడు. ఆ ఆనందం ఎవరికి వారికే అనుభవమయింది. కృష్ణుడు వారికి ఆతీతంగా తానుగా ఉండి, తానుగా ఆనందించాడు. ప్రతివారికి తమ హృదయాలలో కృష్ణుడు ఆనంద ప్రజ్ఞగా మేలుకొని ఉన్నాడు కనుక ఎవరికి వారికే శృంగారం అనుభవ మయింది." వీక్షిస్తున్న దేవతలకి, ఋషులకి వివరించాడు నారదుడు ఆనందంతో. తమ కందరికి శృంగారరసస్పర్శ సోకటానికి గల కారణం తెలిసింది. అందరు తమ సహస్రారాలపై చేతులు జోడించి నమస్కారం చేశారు. పూలవాన కురిపించారు. దేవదుందుభులు విశ్వలయకు అనుగుణంగా మ్రోగసాగాయి.

ఆనందపరవశలైన గోపాంగనలలో కించిత్ అతిశయం తొంగి చూసింది. సర్వాంతర్యామికి తెలియదా? అంతే. మాయమయ్యాడు. కృష్ణుడు తనతో పాటు మరొక గోపికని కూడా తీసుకుని వెళ్ళినట్టు కాలి గుర్తులని పట్టి అర్థం చేసుకున్నారు. ఆ గుర్తులని అనుసరించి వెతకటానికి వెళ్ళారు. కొంత దూరం వెళ్ళగానే కృష్ణుడి పాదచిహ్నాలు మాత్రమే కనిపించాయి.

"ఆహా! రాధికని కన్నయ్య భుజాల మీద మోసుకు వెళ్ళినట్టున్నాడు. ఎంత భాగ్యశాలి రాధ?" వాపోయింది ఒక గోపిక.

కృష్ణుడి జాడ చెప్పమని వారు చెట్టుని పుట్టని ప్రార్థించారు. అతడి గుణగణాలని కీర్తించారు. సమస్తంలో అతడిని దర్శించారు. అతడి చేష్టలని అనుకరించారు. అవతారాలని స్మరించి స్తుతించారు. విహ్వలలై పాదముద్రలని అనుసరించి వెదికారు. తాము కృష్ణుడితో పొందిన అనుభూతులని ఒకరితో ఒకరు చెప్పుకున్నారు. నిజానికి కృష్ణుడు మాయమైనాక అనుభవం ఎక్కడ? అదంతా భ్రమ. అంటే ఇప్పటి వరకు వారు పొందామనుకున్న అనుభవాలన్నీ భ్రమలే. అనుభూతిపరమైన భావనాసన్నివేశములే కాని వాస్తవాలు కావు అని అర్థం అయింది. ఇక తమ ప్రయత్నం వల్ల లాభం లేదని ప్రార్థించారు. ఇది పూర్తి శరణాగతి.

"గోపికలకి కలిగిన లేశమాత్ర గర్వం, తాము కృష్ణుణ్ణి పట్టుకో గలమన్న అహంకారం తొలగించటానికా అంతర్ధానం అయ్యింది? నీ పోకడలు ఎవరికీ అర్థం కావు జగన్నాటక సూత్రధారీ." నారదుడికి మరొక ఆశ్చర్యం.

"మా చిత్తాన్ని మన్మథుడు ముక్కలు చేశాడు మన్మథమన్మథా" గోపికలు అన్నారు.

"అంటే చిత్తవృత్తులు నశించా యన్నమాట. ఆనందానుభవానికి తగిన చిత్తశుద్ధి కలిగించటానికి ఇది ఒక శిక్షణ అన్నమాట. ఇక ప్రత్యక్షమవ్వాలిగా." అనుకున్నాడు నారదుడు.

నారదుడి మనోగతాన్ని తెలుసుకుని అమలు చేసినట్టు శ్రీకృష్ణుడు వారి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. గోపికలు వెంటనే పాదాలు పట్టుకున్నారు. వారి శరణాగతికి మన్మథబాణాలు ఒక నెపం అంతే!

ఒక గోపకాంత నమస్కరించింది. ఒకామె రెప్పలు వేయకుండా నిశ్చలంగా చూస్తూ ఉండిపోయింది. ఒకామె కన్నులు తెరచి చూసి, ఆ రూపు తిరిగి వెలుపలికి రాకుండా కన్నులు మూసి, ఒక యోగి వలె అంతరంగపు రుచులను ఆస్వాదిస్తూ ఆనందంతో తన్మయస్థితిని పొంది ఉండి పోయింది. నిజానికి అందరిదీ అదే స్థితి.

కృష్ణుణ్ణి చూడగానే అప్పటి వరకు ఉన్న బాధ కోపంగా పరిణమించింది. ప్రణయకోపంతో కనపడకుండా పోయినందుకు నర్మగర్భంగా మాట్లాడారు. కృష్ణుడు పొరపాటే నని అంగీకరించి వారి కోపాన్ని పోగొట్టాడు.

"ఆహా! ఏమి విడంబము!" నారదుడు ముక్కున వేలు వేసుకున్నాడు.

"గోపకాంతలకు రాసమున పాల్గొనే అధికారం రావటానికి ఇంతగా శోధించి, సంస్కరించాలి కాబోలు. రససిద్ధికి ఏ అవరోధాలు ఉండ కూడదు కదా!" అని సమర్థించి చెప్పాడు విస్తుపోతూ చూస్తున్న దేవతలకి, ఋషులకి. వారందరు తాము కూడా అధికారుల మైనాము అనుకున్నారు.

కృష్ణుడు రాధాసమేతుడై చిత్రమైన రూపాన్ని ధరించి మధ్యలో నిలబడి ఉంటే గోపికలు చుట్టూ చేరి ఒకరి చేతు లొకరు పట్టుకొని, మండలాకృతిగా ఏర్పడి చుట్టూ తిరుగుతూ నాట్యం చేయటం మొదలు పెట్టారు. ముఖ, హస్త, పాద విన్యాసాలతో ఎన్నో భావాలని కృష్ణుడు, గోపయువతులు ప్రదర్శించ సాగారు. కృష్ణుడు త్రిభంగిగా నిలబడి మురళిని మ్రోగించ సాగాడు. ఆకాశంలో నిలబడి ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షిస్తున్న దేవతలకు హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. పుష్పవృష్టి కురిపించ సాగారు.

తామర పూవుకున్న రేకుల లాగా చుట్టూ గొల్లపడుచులు అమరి ఉండగా మధ్యనున్న కర్ణిక లాగా కృష్ణుడు మువ్వంకగా నిలబడి ఉన్నాడు. గోపికలెంత మంది ఉన్నారో తాను అన్ని రూపాలు ధరించాడు. ప్రతి గోపిక ప్రక్కన కృష్ణుడు ఉండేట్టుగా రాసమండలాన్ని కల్పించాడు. అ కల్పన ఇంద్రుడికే ఆశ్చర్యం కలిగించే విధంగా ఉంది. ఒక గోపిక నుండి మరొక గోపిక దగ్గరకు కృష్ణుడు చేరుకుంటూ నాట్యశాస్త్రంలో చెప్పబడిన అన్ని విధాలైన హస్తములు, పాదములు, భంగిమలు, భావములు మొదలైన విశేషాలను ప్రదర్శిస్తూ చేసిన నృత్యం సకల జన మనోల్లాసకరమై భాసించింది. నీలమేఘశ్యాముడైన కృష్ణుడు బంగారుతీగల వలె ఉన్న గొల్లపడుచులతో చేస్తున్న నృత్యం సుధాసముద్రం లాగా రసరమణీయంగా, రామరాజ్యంలో లాగా అనురాగపూర్ణంగా, పూర్ణచంద్రుడిలాగా భూదేవికి ఆనందదాయకంగా, సత్పురుషుడి కీర్తి లాగా, నందనవనంలోని తుమ్మెదల లాగా నాట్యం చేస్తున్న కృష్ణులతో గోపీజన హృదయాలలో 'ఆత్మ ప్రజ్ఞ' అనే ప్రధాన భావాన్ని వృద్ధిపొందిస్తూ కైలాసశిఖరం లాగా పరమపవిత్రంగా భాసించింది. పరమ ప్రయోజనమైన గోపకాంతలలో 'ఆత్మ ప్రజ్ఞ' ని వృద్ధి చేయటం సిద్ధించింది.

తూర్పు తెల్లవారే వరకు సాగిన ఆ అద్భుత నృత్యహేల గోపికలకు జన్మజన్మలకు సరిపడిన అనుభూతిని అందించింది. కాని, "వారికి మరొక జన్మ ఉంటుందా? కారణ జన్ములైన వారు ముక్తులే కదా!" అనుకున్నాడు నారదుడు.

అందరు నిరతిశయఆనందమగ్నులై ఉండగా వేణునాదం ఆగిపోయింది. కృష్ణుడు అంతర్ధాన మయ్యాడు. దేవతలు, ఋషులు తమతమ స్థానాలకు వెళ్ళి పోయారు. నారదుడు నారాయణ స్మరణ మరచి కృష్ణనామాన్ని జపిస్తూ దేవలోకానికి పయనమయ్యాడు.

బాహ్యస్పృహలోకి వచ్చిన గోపకాంతలకు తెలవారుతున్న ఛాయలు కనపడటంతో ఇల్లు గుర్తు వచ్చింది. భర్త, పిల్లలు, అత్తమామలు, గుర్తు వచ్చారు. సిగ్గుపడుతూ, తడబడుతూ, ఒకరి వంక మరొకరు చూడకుండా తల వంచుకుని వడివడిగా అడుగులు వేస్తూ గృహోన్ముఖు లయ్యారు.

యమునాతీరంలో తమాలవృక్షపునీడలో ఒంటరిగ నిలిచి పోయింది రాధ ఒక్కతే. అది తన్మయావస్థయా? విరహమా? నిరతిశయ ఆనందమా? నిరీక్షణమా? తనని తాను కోల్పోయిన తేలికతనమా? ..... అసలు తానున్నదా? ఏమో .....?

18

అప్పుడే ఉదయించిన చంద్రుని వెలుగు ప్రసరించినంత మేర బృందావనం అలౌకికమైన కాంతితో గోలోకమనే భ్రాంతి కలిగిస్తోంది. వాతావరణ మంతా ఏదో ఉద్వేగంతో ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఆకు కదలితే ఆ క్షణంలో ఏదో కోల్పోతా నన్నట్టు చిత్తరువులాగా నిలిచి ఉన్నాయి వృక్షాలు. యమునా నదీ తరంగాలు ఉవ్వెత్తున ఎగసిపడటం లేదు. కదలలేక కదలలేక మందమందంగా నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. తాము కదలితే గాలి తమ గుండా ప్రసరించి మురళీనాదం అనిపిస్తే ..... అమ్మో! వేణువినోదుడు అపచారంగా భావిస్తే .... తను వేణుగానం చెయ్యక పోతే..... ఉక్కుస్తంభాల లాగా స్థిరంగా నిలిచాయి వెదుళ్లు.

ఒక్కసారిగా వాతావరణంలో స్వల్పచైతన్యం వచ్చింది. ఉద్విగ్నత నెలకొంది. కాని నిశ్శబ్దం అలాగే ఉంది. పరుండిన నెమలి లేచి నిలబడింది. కోకిల ఆకుల చాటు నుండి తొంగిచూసింది. చిలుక రెక్కలల్లార్చ బోయి చప్పుడవుతుంది అని ఆగిపోయింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్న పికిలిపిట్ట అయోమయంగా చూసింది. దాని కళ్ళకి విలాసంగా అప్పుడే వనంలోకి అడుగు పెడుతున్న అందాలబొమ్మ రాధ కనపడింది. " ఓ! ఇదా సంగతి" అని అలసతని వదలి ఉత్కంఠతతో చూడసాగింది.

రాధ చెట్టు చెట్టుని, పొదపొదని పరిశీలనగా వెతుకుతోంది. తమాలవృక్షం వంక చూసి గబగబా అటు అడుగులు వేసింది. దగ్గరకు వెళ్ళి చూసి,

"అయ్యో! ఎంత పొరబడ్డాను? వెన్నెల పడి తమాలవృక్షపుఆకులు మెరుస్తుంటే, నల్లనయ్యా! అది నీ మేని ఛాయగా భ్రమించానే! అటు వైపు పొదలో కదలిక ఉన్నది. అక్కడ ఉన్నావా? వచ్చుచుంటిని, వచ్చు చుంటిని. అక్కడి నుండి కదల కూడదు సుమా!"

అంటూ, అటు వైపుగా కదిలింది రాధ. రాధ అడుగుల సవ్వడికి కృష్ణజింక బెదరి పరుగు తీసింది. దాని కాలి క్రింద పడిన పండుటాకులు శబ్దం చేయటానికి సందేహించినట్టు వినీ వినపడనంత చిరుసవ్వడి మాత్రమే కలిగింది.

"ఎదురు చూచుచు నేనును, బెదరు చూపు
తోడ కృష్ణమృగమును తొంగి చూచు
చున్న చందమామయు నిలుచుండి చెట్లు
నీదు రాకకై కృష్ణుడా! నిలచినాము.

"ఇంత మందిమి ఒళ్ళంతా కళ్ళు చేసుకుని, నిరీక్షించుచుంటిమే! ....." రాధ విహ్వలయై నిలబడి ఉండి పోయింది. రాధ వెనుక వైపుగా ఉన్న ద్వారం నుండి శ్రీకృష్ణుడు, శారదుడు ప్రవేశించి రాధకు కనపడ కుండా దాగి ఉండి గమనిస్తూ ఉన్నారు.

రాధ ఒక అడుగు ముందుకు అడుగు వేసి,

"ఇంతటి పండువెన్నెలలో నెమలి పురి విప్పి నృత్యం చేస్తోంది – కృష్ణమేఘస్ఫురణతో కాబోలు. మయూరం చేసే నృత్యానికి యమునానది తన తరంగ మృదంగధ్వనులతో తాళం వేస్తోంది. ప్రకృతి అంతా నిద్రావస్థలో ఉండే సమయంలో నిర్నిమేషంగా ఎదురు చూస్తూ ఉంది. నాకు ఎంత మంది తోడుగా ఉన్నారో! ఈ వెదురుపొదలు సంగీతాన్ని సమకూర్చుతున్నాయి. ఇంత నిస్వార్థంగా నా వంటి అభాగ్యులకు తోడ్పడుతుంది కనుకనే వెదురు కంతటి భాగ్యం పట్టింది.

"వెదురు చేసిన పుణ్యమేమో
స్వామి పెదవిని అంటి యుండును

తనది ఏమీ లేదు చూడని
లోపలంతా బోలు చేసుకు
తనను స్వామికి సమర్పించుకు
మిన్న కుండును సన్న సేయక
తపము చేసి, తాపమొంది
ఒడలిపై ధ్యాస వదలి
ఛిద్రమైన మేని తోడ
దీనయై సన్న చేయును

ధన్యురాలవు మురళీ! నీదే కదా అదృష్టం. కాదు కాదు. నీవే కదా అర్హురాలవు. నీదంటూ ఏమీలేకుండ స్వామికి సమర్పించుకున్నావు కనుకనే నీ సర్వసమర్పణకు సంతసించిన స్వామి నీ నిండా తన ఊపిరిని నింపాడు. నీకంటూ ఏమీ ఉంచుకొనే అలవాటు లేదు కదా! స్వామి నింపిన ఊపిరిని కూడా అందరికీ పంచటానికి వెలుపలికి పంపుతున్నావు కదా! ఎంతటి సమబుద్ధి? అందుకే అది గానమై, సర్వసమ్మోహన రాగాన్ని ఆలపించి అందరినీ అలరిస్తోంది. నీ స్పర్శ నాకు సుఖావహం .” అంటూ వంగిన వెదురును చేతుల్లోకి తీసుకుంది. వెదురుపొద అంతా పులకరించింది.

“ప్రాణం లేని మురళినే అంతగా పొగుడుతున్నది. ఎప్పుడూ నీ ప్రక్కనే ఉండే నన్ను ఎందుకు పొగడదో మరి! .....” శారదుడు లోగొంతుకతో అన్నాడు.

“రాధ మురళి అవతారమే కనుక మురళితత్వాన్ని అంతగా వివరించ గలుగుతోంది.”అన్నాడు కృష్ణుడు.

“మురళి నీచేతిలోనే ఉన్నది కదా!”

“అవును”

“రాధ నీ మురళి అన్నావు కదా!”

“ఓ! అదా నీ సందేహం? నీ కర్థం కాక పోతే ఇప్పటికి వదలి వెయ్యి.”

“అలాగే! నిన్ను రాధకు వదలి వెడుతున్నానులే!” అంటూ శారదుడు నిష్క్రమించాడు.

వెదురు చిగుళ్లను రెండు అరచేతుల మధ్య ఆప్యాయంగా పట్టుకొని రాధ,

"కృష్ణా! వెదురునై పుట్టి ఉంటే నిరంతరం నీ ఆధారాన్ని పాయక ఉండేదాన్ని. ఈ మానవజన్మ నిన్ను చేరుకోవటాని కెంత ప్రతిబంధక మయిందో కదా! వేణుగోపాలా! గోపాలబాలా! గోపీలోలా! కరుణాలవాలా! సౌందర్యహేలా! మాయాజాలా! ....."

కృష్ణుడు అప్పుడే ప్రవేశిస్తున్నట్టు వచ్చి, " రాధా! ఎవరిని అంతగా కీర్తిస్తున్నావు?" అని అడిగాడు.

"ఇంకెవరిని? అన్యుల నెవరినీ ఎరుగనే!" అంది రాధ సంతోషమూ ఆలస్యంగా వచ్చినందుకు కోపము మిళితమైన స్వరంతో.

"అయినచో నన్ని మాటలన్నది నన్నే నన్న మాట."

"ఉన్న మాట."

"నేనంత కీర్తించ తగిన వాడనా?"

"ఔను! నిస్సందేహంగా. నేనే కాదు. ఇక్కడ ఉన్న ప్రతి అణువు నీ రాకకై ఎదురు చూస్తున్నది. నీ దర్శనభాగ్యానికై పరితపిస్తున్నది."

"అయినచో నేనును ఎదురు చూచుచున్నాను."

"ఎవరి కొరకు?" ఆశ్చర్యంగా అడిగింది రాధ. విశాలమైన కన్నులు మరింత విశాలమై ముఖంలో కన్నులు తప్ప మరేమీ లేవన్నట్టు అనిపించింది.

"మీరందరు ఎదురు చూచుచున్న 'నీ' దర్శనానికి. ఎందుకంటే నాకు 'నేను' అన్నది మాత్రమే తెలుసు." ఏ భావమూ లేకుండ చాలా మామూలుగా అన్నాడు కృష్ణుడు .

"మేము 'నీవు' అన్నది ఎదుటివారు అన్న అర్థంలో కాదు. మాకందరకు 'నువ్వు' అంటే కృష్ణుడు అని అనే అర్థం."

"నేనూ ఆ కృష్ణునే చూడాలని..."

"నిన్ను నీవెలా చూడ గలవు?"

"దానికొక మార్గమున్నది. ఇటురా!" అని రాధ చెయ్యి పట్టుకుని తన వెంట తీసుకొని కలువకొలను వద్దకు తీసికొని వెళ్ళాడు. నిశ్చలంగా ఉన్న కొలనిలో తమ

ఇద్దరి ప్రతిబింబాలని చూడమని రాధకు కంటితో సైగ చేశాడు. రాధ మురిపెంగా చూస్తూ ఉండి పోయింది.

"ప్రియా! చూడు! మన ఇరువురి ప్రతిబింబాలు ప్రక్క ప్రక్కన ఉంటే ఎంత ముచ్చటగా ఉన్నదో!" తన్మయత్వంతో చూస్తున్న రాధతో అన్నాడు కృష్ణుడు.

" నిజమే సుమా!" ఇంకా బాహ్యప్రపంచం లోకి రాకుండానే అన్నది రాధ.

"ఇద్దరలో ఎవరిది ఎక్కువ అందమో?" యథాలాపంగా అన్నట్టు అన్నాడు కృష్ణుడు.

"నాదని లోకులంటారు." అప్రయత్నంగా, అనాలోచితంగా అన్నది రాధ.

"అదే మాట నా చెవిన కూడా పడినదిలే."

"తెలిసి తెలిసి మరల అడుగుట ఎందులకు?"

"నే నడిగినది నేనంద గాడనని లోకులన్నది నిజమేనా అని ....."

రాధ ఊహాలోకం నుండి వాస్తవంలోకి వచ్చి, గిర్రున వెనుదిరిగి, దూరంగా జరిగింది. కృష్ణుడు కూడా ఆమె వైపుకి జరిగి,

"ప్రియా!....." అన్నాడు ప్రాధేయ పూర్వకమైన స్వరంతో.

"....."

"ప్రాణేశ్వరీ!"

"....." మరొక్క అడుగు దూరంగా జరిగింది.

"ప్రాణప్రియా! ప్రాణాధికా!!"

" ....."

"నా ప్రాణమా! రాధికా!! నీ విలా కోపగించిన నేను తాళజాలను. నేనే మంటిని? నీ కన్నా నేనే అందగాడ ననియా? అది పరిహాసమున కన్న మాట. పరిహాసములాడుట కైనను ఈ దాసునికి అర్హత లేదా? నిజమే, నిజమే! అట్టిమాట వాస్తవమైనను అట్లు పలుక రాదే! అట్టిది పరిహాసమున కనవచ్చునా? దాసుని తప్పు దండముతో సరి."

అంటూ రెండు చేతులూ జోడించాడు. రాధ రుసరుసలాడుతూ ఇంకొక ప్రక్కకి తిరిగింది. కృష్ణుడు అటు చేరి,

"హాసమున కైననుం బరిహాసమునకు
నిట్టి దారుణ భాషణ మింక నెపుడు
పలుకనే పలుక ననుచు బాస చేతు
అలుక మానవె ఇక నైన నంబుజాక్షి.

"నీ కోపము తీరుటకు నన్ను శిక్షింపుము. నేనెట్టి శిక్షకునైనను సిద్ధమే!

"పూలబంతు లివిగొ మోదము తోడుత
కొట్ట రాదొ చేత గొనియు వాని
పూలదండ లివిగొ పూనిక గొని నీవు
కట్ట రాదొ చేత పట్టి వాని."

జోడించిన చేతులను శిరముపై ఉంచి రాధ పాదాల వద్ద కూర్చున్నాడు కృష్ణుడు.

రాధ చివ్వున లేచి దూరంగా జరిగి,

"ఎంత ధూర్తుడవు? తప్పు చేసినది కాక నన్ను తప్పు దారి పట్టించుచుంటివా? అపచారము. అపచారము. నా పాదముల వద్ద కూర్చొనుట అపచారము. లెమ్ము! ఇంకను దండించుట ఎందులకు? పశ్చాత్తాప పడితివి కదా! పరిహారమును చెల్లించు కొనుము. చాలును."

"యమునా నదిలో వెన్నెల విహారం? .... అపరాధ రుసుముగా సరిపోవునా?"

"అది ఎప్పుడో చేసిన వాగ్దానం. ఇప్పుడు ఏదైనా క్రొత్తది ....."

"నౌక ఎక్కిన పిమ్మట తెలియునులే!" మనోహరంగా చిరునవ్వు చిందించాడు కృష్ణుడు.

"నన్ను వశపరచు కోవటం నీకు వెన్నతో పెట్టిన విద్య."

"నేను నీకు వెన్నను ఉపహారంగా ఇవ్వాలనుకున్నాను. ఆ సంగతి నీకెలా తెలిసింది?" ఆశ్చర్యం నటిస్తూ అడిగాడు.

"ఈ నటనలు, ఈ విద్యలు, ఈ మాయలు,ఈ వశీకరణలు అన్నీ యశోదా తనయుడవైన పిమ్మట నేర్చినవే. అంతకు ముందు ఇంత జాణతనం లేదు సుమా!" తేలికైన మనసుతో అన్నది రాధ.

"లేదు రాధా! నీ సాన్నిధ్యమే నన్ను జాణను చేసింది. రమ్ము! నౌకా యాత్రకు" అంటూ రాధను పసిబిడ్డను వలె నెమ్మదిగా నడిపించుకుంటూ యమునా నది వైపుకి కదిలాడు. రాధ కృష్ణుడు నడిపించి నట్టు నడుస్తోంది. తడబడే అడుగులు నృత్యవిన్యాసాన్ని ప్రదర్శిస్తున్నాయి. అప్పటి వరకు నిశ్చలంగా చూస్తున్న ప్రకృతి పులకరింత ఆకుల గలగలలలోను, పక్షుల రెక్కల చప్పుళ్ళ లోనూ, వెదురుపొదలలో దూరిన గాలి ఈలలలోను, యమునానది లోని అలల చిరుసవ్వడిలోను వ్యక్త మయింది. ఆ ధ్వనులు మంద్రంగా ఉండి రాధాకృష్ణుల విహారానికి ఏ మాత్రం భంగం కలిగించకుండా జాగ్రత్త వహించాయి.

కృష్ణుడు అక్కడ రాటకి కట్టిన ఒక అందమైన పడవను నెమ్మదిగా తాడు విప్పి ఒడ్డున ఉన్న ఇసుకలో నుండి యమునలోకి నెట్టాడు. ముందుగా పడవలోకి తాను ఎక్కి రాధకు చేయి అందించి నావలోకి ఎక్కించాడు. రాధను పట్టుకుని అందులో ఉన్న పూలు పరచిన ఆసనం మీద కూర్చోపెట్టాడు. నెమ్మదిగా తెడ్డు వేస్తున్నాడు. రాధకు హృదయ మొక్కటే పని చేస్తోంది. మనస్సు ఇంద్రియాలు విశ్రమించాయి, జలచరాలను చూస్తూ ఉండిపోయింది. వంగి నీటిలో పెట్టిన రాధ చేతిలోకి చిన్న బంగారు రంగు చేపపిల్ల వచ్చింది. నదురు బెదురు లేకుండ ఉండి పోయింది. రెండు చేతులను కలిపి దోసిటి లోకి తీసుకుని దాని వైపుకే చూస్తూ ఉంది రాధ.

"ఇదీ నా స్వామి పూర్వరూపమే కదా! అందుకనే నిర్భయంగా నన్ను నమ్ముకొని ఉంది. నా అదృష్టం మాత్రం తక్కువదా అన్నట్టు, ఒడ్డున తాబేలు వయ్యారంగా నడచి వెడుతోంది. ఎంత కన్నా తగుదువయ్య మహానుభావా!" అనుకుంది మనస్సులో.

"భవజలధి దాట పడవయౌ పరమాత్మ
పడవనెక్కె నిపుడు పామరు కైవడి
సర్వము తెలిసియును సామాన్యుని వలెను
భక్తుల కొరకై ప్రవర్తించుటయె వింత."

వీణమీటులతో మేళవించి వినపడిన పాటకు తలెత్తి ఆకాశం వంక చూచి చేతులెత్తి నమస్కరించి, పెదవులపై కుడిచేతి చూపుడువేలు నుంచి మౌనం అన్నట్టు సంకేతం చేశాడు కృష్ణుడు. యమున పులకలు ఉప్పొంగి పడవను ఊయల లూగించింది. పరవశించిన ప్రకృతి కాలాన్ని గమనించ లేదు.

తూరుపు వెల్లబారటంతో ఆలస్య మైనదని పక్షులు కంగారుగా గూళ్ళలో నుండి బయటకు వచ్చాయి. ఉదయసమీరాలకు తమ కర్తవ్యం నిర్వర్తించాలని గుర్తు వచ్చింది. దూరంగా పల్లెలో నుండి పెరుగు చిలుకుతున్న శబ్దం వినవస్తోంది. అది విని కాబోలు తొందరపడి లేచిన లేగలు అంబారావాలు చేస్తున్నాయి.

కృష్ణుడు నెమ్మదిగా రాధకు బాహ్యస్మృతి కలిగించి,

"తెల్లవార వచ్చినది." అన్నాడు.

"అయ్యో! అప్పుడేనా? కాలమెంత కఠిన మైనదో కదా!" అన్నది దీనంగా.

"కాలపురుషుడు దయగల వాడే రాధా! పగలు ఇట్టే గడచి పోయేట్టు చేస్తాడు చూడు."

"ఎన్నో యుగాల తరువాత కదా!"

"నిముషాలను యుగాలుగా గడిపేది నువ్వు మాత్రమే కాదు." అనునయంగా అన్నాడు కృష్ణుడు రాధకు పడవ దిగటానికి చెయ్యి అందిస్తూ.

"మరల నిన్ను చూచు భాగ్యమెప్పుడు?"

"నీవు రాయణపత్ని వైన పిమ్మట."

కోపంతో రాధ ముఖం ఎర్ర బారింది.

"కృష్ణా! నీ ధూర్తతకు అడ్డు ఆపు లేకున్నది. నేను రాయణపత్ని నగుట ఏమి? పరిహాసమునకైన ఒక పరిమితి ఉన్నది. ఇంతటి మాట అన్నది నీవు గనుక సరిపోయినది. మరొకరైన ...."

కృష్ణుడు రాధ చేతిని తన చేతిలోకి తీసుకొని అనునయంగా " రాధా! గుర్తు తెచ్చి కొనుము. నారాయణుని అంశతో జన్మించిన రాయణునికి నీ ఛాయతో వివాహము జరుగునని, నిన్ను రాయణుని పత్ని వని లోకులు పొర బడుతుంటారని ....."

రాధ కృష్ణుని స్పర్శలో మైమరచి, కన్నులు మూసుకొని, గోలోక వృత్తాంతాన్ని గుర్తు తెచ్చుకుంటోంది.

"రాధా! అప్పుడూ ఇదే ఆవేశం. ఇదే తొందరపాటు తనం. నీవలిగితే మరింత అందంగా ఉంటావన్నది నిజమే కాని, అది నా వరకు పరిమిత మైతేనే ఉచితంగా ఉంటుంది. ....."

ఊహల్లోంచి బయట పడిన రాధ "యశోదాదేవికి వరుసకి సోదరుడు ఒక రాయణు డున్నాడు. అతడేనా? నీకు మేనమామ వరుస."

"అవును. అతడే."

"నిజమే! ఈ మధ్యనే మధ్యవర్తులను పంపినాడట నాన్నగారు అమ్మతో అంటుంటే విన్నాను. నాన్నగారు తన అంగీకారం తెలుపక ముందే నాకు వివాహేచ్ఛ లేదని చెప్పాలను కుంటున్నాను." సాలోచనగా అన్నది రాధ.

"రాధా! మిన్నకుండు. జరగ వలసినది జరుగుతుంది."

"వివాహమా?"

"అవును. అది జరిగేది నీ ఛాయతోనే కదా! జరగనిమ్ము. ఆడపిల్ల పెళ్లి వద్దంటే అంగీకరిస్తారనుకుంటున్నావా?"

"అప్పుడు నన్ను జారిణిని అనరా?"

"అననిమ్ము.అప్పుడు నన్ను మేనమామ భార్యను వలలో వేసుకున్నాడని కూడా అంటారు. "

"అయ్యో! నీకు అపనిందలా? ఈ అపనిందలు తప్పే మార్గం లేదా?"

"మనము అవతరించినదే ఈ అపనిందలను అనుభవించటానికి. చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవ. ఎటువంటి వారికైనా చేసిన దానికి ఫలితాన్ని అనుభవించక తప్పదు. రాధా! మనసు దిటవు చేసుకోక తప్పదు."

బాష్పాకులిత నేత్రాలతో విహ్వలంగా రాధ " అంతే! అంతే!! ఇప్పటికింతే!!!" అంటూ గొణగ సాగింది. కృష్ణుడు రాధ వైపు జాలిగా చూశాడు.

"మిత్రమా! కృష్ణా!" శారదుని పిలుపు వినపడింది.

"ఇదిగో! బయలుదేరాను శారదా! ఒక్క క్షణంలో నీ దగ్గర ఉంటాను. రాధా! నీవును ఇల్లు చేరవలెను కదా! బయలు దేరు!"

"మరల నీ దర్శనము ఎన్ని కల్పములకో!"

కృష్ణుని వంక చూస్తూ వెనుకకి నడిచింది రాధ.

19

యమున మందమందంగా ప్రవహిస్తోంది తప్పదన్నట్టు. ఏదో కోల్పోయిన్నట్టు దిగులుగా కనపడుతోంది. అలల తలలెత్తి తీరాన బృందావనంలోని వృక్షాల వంక చూడలేక పోతోంది. అవి కూడా మూర్తీభవించిన నిరాశలాగా తలలు వాల్చి వాడిపోయి ఉన్నాయి. పొదరిళ్ళు బక్కచిక్కి ఆశల చిగుళ్ళు లేక బోసి పోయాయి. లతలు పూలు లేక నిర్జీవమైన దారాలేమో అనిపిస్తున్నాయి. శుకశారికలు మూగపోయినట్టు నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. తనలోని ప్రాణ శక్తిని మొత్తం పిండేసినట్టు ప్రకృతి చైతన్యరహితంగా కనిపిస్తోంది.

నిరంతరం చంచలంగా కదిలే హరిణాల నేత్రాలు నిశ్చలమై ఉన్నవి ఒక్కసారిగా సానుభూతితో చూడసాగాయి. వాటి చూపులని అనుసరించి బృందావనంలోని అన్ని జీవులు అటు వైపు చూశాయి. బృందావనాధీశ్వరి, రాసలీలా విధాయిక, కృష్ణప్రాణాధిక రాధాదేవి వస్తోంది. ఆమెకు ఊరట నివ్వటానికా అన్నట్టు బృందావనమంతా చైతన్యాన్ని తెచ్చిపెట్టుకునే ప్రయత్నం చేసింది. ఉన్న కొద్ది ఆకులు నీరసంగా కదిలాయి. కాళిందిలో అలలు చిరుసవ్వడి చేశాయి. పికిలిపిట్టలు తామున్నామని చెప్పటానికన్నట్టు రెక్కలు తపతపలాడించాయి. కృష్ణమృగం రాధారాణి సమీపానికి వచ్చి ఆమెను స్పృశిస్తూ నిలబడింది.

రాధ బృందావనాన్ని పిచ్చిదానిలాగా కలయ తిరిగింది. చూసిన చోటునే మళ్ళీ మళ్ళీ చూసింది. వెదకిన పొదరింటినే తిరిగి వెదకింది. ప్రతి రాతిని తడిమి చూసింది. చంద్రశిలా వితర్దికను చూడగానే రాధ కన్నుల నీరు చిప్పిల్లింది. దీనిపై తామిద్దరు గడపిన వెన్నెల రాత్రులు మనసులో మెదిలాయి. గుండె చెరువయ్యింది. ఒకప్పుడు మిలమిలా మెరిసిపోయిన ఆ చంద్రకాంతశిల ఇప్పుడు వెలవెల పోతోంది. మెత్తదనం మాయమయింది.

"నా స్వామి మనసు లాగా ఈ చంద్రకాంతశిల కూడా కఠినత వహించింది. అంతే కదా! సర్వప్రకృతి కృష్ణసేవకే ఉవ్విళ్లూరుతుంది." అనుకొంది మనస్సులో.

అక్కడ ఇక ఉండ లేక యమున వైపుకి వెళ్లింది – ఆ చల్లని గాలుల స్పర్శకి తాపం కొద్దిగానైనా ఉపశమిస్తుందేమో నన్న ఆశతో. యమునాసైకతాల మీద పాదం మోపగానే రాధకు పులకాంకురాలు కలిగాయి.

"ఈ సైకత రేణువులు నాస్వామి పాదస్పర్శకు నోచుకున్న ధన్యలు. ఇంకా ఆ స్పర్శానుభూతిని తమలో నిలుపుకొని, పంచగలుగుతున్నాయి. చిత్రంగా ఈ అనుభూతి నాకు సంతోషాన్ని కలిగించటానికి మారుగా బాధను పెంచుతున్న దేమిటి? యమునానదీజలాల నీలిరంగు కృష్ణుని శరీరఛాయను తలపింప చేసి నా విరహవేదనను అతిశయింప చేస్తోంది. నేనిక నిలువ జాలను."

వెనుదిరిగి వచ్చి తమాలవృక్షపుప్రామి నానుకొని నిలచి ఆ వృక్షఛాయలో కృష్ణుడితో తను గడపిన సంతోషసమయాన్ని తలచుకుంటూ ఉంది. ఆ కాలానికి వెళ్ళి పోయింది. కృష్ణుడు తన ప్రక్కనే ఉన్నట్టుగా భావించుకుంటూ ఆనందాతిశయంతో గట్టిగా నవ్వుతుంటే తమాలవృక్షం జాలిగా చూసింది. యమునానది నిట్టూర్చింది.

శుక్లపక్ష పంచమిచంద్రుడు తూర్పున ఉదయించటంతో వెన్నెల వంటికి శోకగానే విరహ మతిశయించి ఊహాలోకం నుండి వాస్తవంలోకి వచ్చింది రాధ.

"కృష్ణా! అక్రూరుడనే పేరు పెట్టుకొన్న క్రూరుడు నిన్ను మా నుండి దూరం చేసినప్పటి నుండి నీ దర్శనభాగ్యం అపురూపమై పోయింది. మధురానగరానికి వెళ్ళిన తరువాత బృందావనాన్ని, వ్రజగోపికలను మరచితివా? నీ పై ప్రాణాలు పెట్టుకొని జీవించే రాధ నీకు జ్ఞాపకం రాలేదా? ప్రభూ! రాచకార్య మగ్నుడవైన నీకు మేము గుర్తు రాకపోవటం సహజమే! కాని. .... మాకు, ముఖ్యంగా నాకు నీ వియోగము భరించుట సాధ్యము కాకున్నదే. ఏమి చేయుదును? చంద్రునకు నా పై ఇంతటి పగ ఏలనో తెలియ రాకున్నది. నీవు లేవని కాబోలు తన ప్రతాపము చూపు చున్నాడు. నాపై ఆవిరులు కురిపించు చున్నాడు. వెన్నెల వేడిమికి నా ఒడలు క్రాగి పోవుచున్నది. ఈ తాపమును సహించుట ఎట్లు?

"చెలులు ఒడలంతయు మంచిగంధము పూసినారు. కాని, అది మంటలు రేపినది. కర్పూరము, పన్నీరు బాధాకరములై పోయినవి. చిలుకలు, కోకిలలు

కర్ణకఠోరముగా కూయుచున్నవి. నీవు నాకు దూరముగా నున్నావని వాటికి కూడా నేను చులుకన ఐతిని కాబోలు. కాదు, కాదు. అవి హృదయవిదారకముగా కూయుచున్నవి. అవియు కృష్ణవిరహమున వేగుచు ఉండవలయును. అవి కిలకిలారావములా? కావు, కావు. కలకలారావములు. ఊహూ(! అవి కళవళారవములు. నేను భరించ లేను."

రెండుచేతులతోనూ చెవులు మూసుకుంది రాధ. వెంటనే చేతులు తీసి,

"పొరపాటు. పొరపాటు. చెవులు మూసుకుంటే నా స్వామి అడుగుల సవ్వడి వినిపించ వద్దూ! మధురానాథుని తోడ్కొని తెమ్మని లలితను పంపి చాలా సేపైనది. ఇంకనూ రాలేదు. ఆలసించి నన్ను బాధించుట నా స్వామికి ప్రియము. కానిమ్ము. తనకేది సంతోషమో అటులే జరుగనిమ్ము. …."

కృష్ణుడు, శారదుడు, ఉద్ధవుడు చప్పుడు చేయకుండా వచ్చి రాధకు కనపడకుండా వెనుకగా నిలబడ్డారు.

"లలిత అసలే లలిత వర్తన. ఇంకనూ చేరినదో, లేదో? మార్గాయాసం వల్ల మధ్యలో విశ్రమించినదో? మరెవ్వరిని పంప గలను? ….. ఆహా! దైవమా!! ఎంతటి విషమ పరిస్థితి!!! ప్రాణములు దేహమున నిలచునట్లు లేవు. అంతటి అదృష్టమా? శరీరమనే పరిమితి లేనట్లయితే నిరంతరం కృష్ణుని సన్నిధిలోనే ఉండ వచ్చును కదా!" వివశురాలై చెట్టు మొదటికి జారిపోయింది రాధ.

కృష్ణుని సైగను అర్థం చేసుకున్న ఉద్ధవుడు, శారదుడు రాధ సమీపానికి వచ్చారు. వారు రావటం గమనించిన రాధ సంబరంగా,

"శారదా! ఏడి నా స్వామి? ఎక్కడ?" అని అడిగింది దేగ కన్నులతో అటూ ఇటూ వెతుకుతూ.

"మాతా! నమస్సులు. నేను వచ్చితినిగా!" అన్నాడు శారదుడు.

"తల్లీ! నేనునూ వచ్చితిని. ఉద్ధవుని మ్రొక్కులు గొనుము." ఉద్ధవుడు సాగిలపడి నమస్కరించాడు.

"కనపడుచునే ఉన్నారు మీరు. నేనడుగుచున్నది ధూర్తగోపాలుని రాక గురించి." రాధ కొంచెం నిస్పృహతో అన్నది.

"మేము వారి పనుపుననే కదా వచ్చినది." అన్నాడు శారదుడు.

"నేను రమ్మని వార్త నంపినది ఆ గోపికావల్లభునికి."

"నీవే అంటివి కదా, గోపికావల్లభుడని. ఏ గోపిక గృహమును పావనము చేయుచున్నాడో!" ఉద్ధవుడు రహస్యము చెప్పినట్టు అన్నాడు.

"ఆంతరంగికుడవు . నీకు తెలియ కుండునా?" చిరుకోపంగా అన్నది రాధ.

ఉద్ధవుడు గుంభనగా నవ్వాడు.

"బృందావనమునకే బయలు దేరితిమి." శారదుడు అమాయకత్వం నటిస్తూ అన్నాడు.

"ఆ వెయ్యిగుళ్ళ పూజారి ఏ ఇంటిలో దూరెనో మీకు తెలియకుండునా? ఉద్ధవుడు నవ్వుచున్నాడు. బృందావన రహస్యములన్నియు నతడికి బట్టబయలు. ఇక్కడి వాడేగా!"

"బృందావనమున ప్రతి ఇల్లు నవనీతచోరునిదే!" ఉద్ధవుడు మార్మికంగా అన్నాడు.

"అవునవును. దొంగలకు స్వపరభేదము ఉండదు. అంతే కాదు. తనదంటు ఇల్లు ఉంటే ఒకటే. ఇల్లే లేని వాడికి ఒక ఇల్లేమిటి? అందరి ఇళ్ళు వానివే."

"రాధ భక్తురా లంటాడు నా సఖుడు, నా దైవము. ఈ విధముగా నిందించుచున్న దేమి? ఏ మాత్రమూ గౌరవము లేకుండా మాట్లాడుచున్నది." అనుకున్నాడు తన మనసులో.

"నా తత్వము నెంత బాగా అర్థము చేసుకున్నదో! అందుకే రాధ నాకు ప్రియతమ." అని మురిసి పోయాడు కృష్ణుడు.

"తన రాకను నీకు ముందుగా తెలియచేయమని నన్ను పంపాడు." అన్నాడు శారదుడు.

"నేను చెలితో సందేశం పంపానని తనూ మిమ్ము పంపాడు. నాకు తగిన శాస్తి జరిగింది." రాధ బాధగా అనుకొంది.

"అలవాటుగా అపార్థం చేసుకున్నది." అనుకున్నాడు కృష్ణుడు.

"నీవు సిద్ధంగా ఉంటావని తను వచ్చుచున్నట్టు నీకు ముందుగా ఎరుక పరచమని పంపాడు అంతే!" శారదుడు వివరణ ఇచ్చాడు.

"నేనెప్పటి నుండియో అలంకరించుకొని ప్రాణేశ్వరుని రాకకై ఎదురు చూచుచున్నానే!"

"ఔనౌను. జ్యోత్స్నాభిసారిక వోలె సర్వశుక్లవై శ్వేతవస్త్రం, శ్వేతాభరణాలు, శ్వేత పుష్పాలు ..... సాక్షాత్తు శారదామూర్తివిగా భాసిల్లితున్నావు." అన్నాడు ఉద్ధవుడు.

"నీ భావానికి అనుగుణంగా వనంలోని పుష్పాలన్నీ కూడా తెల్లని వెన్నెల రూపు దాల్చినట్టు ప్రకాశిస్తూ ఆహ్లాదకరంగా ఉన్నాయి." అన్నాడు శారదుడు.

రాధ చివ్వున " శారదా! నీ చూపు మందగించినదా? ఈ నాడు వనంలో పుష్పాలన్నీ అరుణవర్ణంలో అందగిస్తున్నాయి. మా యశోదానందనునికి వనమాల పన్నుదామనుకుంటే ఎరుపురంగు తప్ప మరొకరంగుపూలే కనపడలేదు." అన్నది.

శారదుడు అయోమయంగా చుట్టూ చూస్తూ " నిజముగానే నాకు దృష్టి దోషము కలిగినదా ఏమి?" అని తనలో వితర్కించుకున్నాడు.

"ఈమెకు పిచ్చి ముదిరినట్లున్నది" అనుకున్నాడు ఉద్ధవుడు.

ఇక తను రాధకు కనిపించటం మంచిది, అలసించ కూడదు అని అనుకున్నాడు కృష్ణుడు. చాటునుండి వెడలి రాధ సమ్ముఖానికి వచ్చాడు. అతడిని చూస్తూనే రాధ

" నందనందనా! ఆనంద స్యందనా! ....." అన్నది వెలిగి పోతున్న ముఖంతో.

కృష్ణుడు "ప్రణయేశ్వరీ!" అంటు రాధను సమీపించాడు.

రాధ ముఖం ప్రక్కకు తిప్పుకుంది. కృష్ణుడు ఆమె ముఖమున్న వైపుకి వెళ్ళాడు.

"ప్రియా! అలక ఎందులకు? నీవు తలచిన వెంటనే వచ్చితినిగా!" అన్నాడు.

"లలితతో వార్తనంపగా వచ్చితివి."

కృష్ణుడి ముఖంలో ఆశ్చర్యం తాండవించింది.

"లలితను పంపితివా? ఆమె ఇంకను మా వద్దకు రాలేదే? ఎంతటి ధన్యుడను! ఆహా! నన్ను నిరంతరం తలచుకోవటమే కాదు, నా కొరకు దూతికను పంపితివా?"

"చాలు చాలు. నీ మాయా విలసనములు. "

"హృదయేశ్వరీ! ఎంతటి మాటంటివి?" బాధగా అన్నాడు కృష్ణుడు.

"యథార్థమే కాదా?" నిగ్గదీసింది రాధ.

"లలిత రానే లేదు. కావలసిన శారదుని అడుగుము." అన్నాడు కృష్ణుడు.

"పిల్లికి ఎలుక సాక్ష్యం." ఈసడింపుగా అన్నది రాధ.

"నన్ను ఎలుక అనుచున్నావా? " చిన్న బుచ్చుకున్నట్టు అన్నాడు శారదుడు.

"పొరపాటు. పొరపాటు." రాధ చెంపలు వేసుకుంది.

"ఆఁ! అదీ." తేట పడిన మనసుతో అన్నాడు శారదుడు.

"పాపము! ఎలుకలు విన్న బాధ పడును." వ్యంగ్యంగా అన్నది రాధ.

శారదుడు కృష్ణుని వంక తిరిగి " వయస్యా! రాధాదేవి నన్ను ఓదార్చుచున్నదా? మరింత అవమానము చేయుచున్నదా?" అయోమయంగా అడిగాడు.

"ఏదయినను ధన్యుడవే." అన్నాడు కృష్ణుడు.

రాధ శారదుని వైపే చూస్తూ ఉన్నది.

"ఇది మరింత అర్థము కాకున్నది." అన్నాడు శారదుడు.

"దూరముగా పోయి ధ్యానము చేయుము. అర్థమగును." అన్నాడు కృష్ణుడు.

"ఇది మాత్రము బాగా అర్థమయినది. మేము నిష్క్రమించి మీ ఇరువురకు నేకాంతము కల్పింప వలెనని. ఉద్ధవా! రమ్ము! మన మిద్దరము యమునానదీ తీరంలో వెన్నెలవిహారం చేద్దాము. మన సఖునికి మన అవసరము తీరినది."

"తెలియుచునే ఉన్నది." ఉద్ధవుడు అంగీకరించాడు.

"శారదా! రాధ సమక్షమున నీ బుద్ధియు వికసించు చున్నది." అన్నాడు మెచ్చుకోలుగా కృష్ణుడు.

"బుద్ధి వికసించెనో లేదో తెలియదు కాని, మనస్సు మాత్రం భ్రమకు లోనగుచున్నది. ఇంద్రియములు సరిగా పని చేయుట లేదు." శారదుడు అమాయకంగా అన్నాడు.

"అదేమీ?" కృష్ణుడు ఆశ్చర్యంగా అడిగాడు.

"నా కన్నులు, చెవులు పని చేయుట లేదు కాబోలు. చిలుకల పలుకులు కర్ణకఠోరములుగా ఉన్నవని రాధ అనుచున్నది. నాకేమో కర్ణపేయములుగా ఉన్నవి. పూవులన్నియు నెర్రగా ఉన్నవని రాధ యనుచున్నది. నాకు సర్వవర్ణములలో కనపడుచున్నవి. నాకు మల్లెలుగా కనపడుచున్న ఈ పూలను రాధ మంకెన లనుచున్నది. నాది చిత్తభ్రమ కాబోలును." శారదుడు దిగులుగా అన్నాడు.

"మంకెనలను మల్లెలనుట చిత్తభ్రమ కాకేమి?" రాధ చివ్వున సమాధాన మిచ్చింది.

"సఖా! నాకును చిత్తభ్రమయే కాబోలు ననిపించుచున్నది. కృష్ణా! నీ కారణమున నాకు పిచ్చి పట్టినది.

"శారదా! నీవు దిగులు చెంద వలసిన పని లేదు. నీకు మతి చలించలేదు. అవి మల్లెలే!"

కృష్ణుడి మాటలు పూర్తి కాకుండానే రాధకు కోపంతో ముఖం ఎర్రకలువలాగా మారి పోయింది. కన్నులు కెంపులయ్యాయి. నిట్టూర్పులు దెబ్బ తిన్న త్రాచు బుసల లాగా ఉన్నాయి. వాటి వేడికి వాతావరణంలో చల్లదనం మాయ మయింది. పలుకులు ములుకుల్లాగా దూసుకుని వస్తున్నాయి.

"అయిన నాకు మతి భ్రమించినదని మీరిరువురు నిర్ధారించినారా? అవునులే! నాకు మనస్సు చలించినది." కొంచెం సేపు ఆగింది. అలుపు తీర్చుకున్నది. ఆవేశం కాస్త తగ్గినట్టయింది. అలక మాత్రం తగ్గ లేదు బుంగమూతి పెట్టి పసిపిల్ల లాగా "అయినను, నా మనస్సు నా వద్ద లేదు కనుక, చలించినదో, లేదో నా కేల?" అన్నది.

కృష్ణుడు రాధను సమీపించి, ఆమె చేతిని తన చేతిలో తీసుకుని, " రాధారాణీ! నీకు మతి చలించినదని అన్న వారెవ్వరు? అటులన్న వారికే మతి లేదు. నీవు సర్వజ్ఞవు. మహారాజ్ఞివి. నీ మాట శిరోధార్యము."

కొద్దిగా ఉపశమించినట్టున్న కోపం ఈ మాటలతో మరల రెచ్చగొట్ట బడింది.

"ఇప్పుడేగా శారదునికి మతి చలించ లేదు. అవి మల్లెలే అన్నది. అంటే మంకెన లన్న వారి నేమన్నట్టు?" నిగ్గదీసింది.

"సర్వదా తర్కము సత్యనిరూపణము చేయలేదు. అవి వాస్తవమునకు మల్లెలే అయిననూ, రాధా! నీ దృష్టికి మంకెనలే!"

రాధ కొంచెం అపనమ్మకంగాను, కొంచెం నమ్మకంగానూ చూసింది.

"అదెటుల?" శారదుడు అయోమయంగా చూస్తూ అడిగాడు.

"అఘటనాఘటన సమర్థన కిది యొక లెక్క లోనిదా?" ఉద్ధవుడు సమర్థించాడు.

"ఇందులో ఎటువంటి అఘటనాఘటన, ఎటువంటి మాయా, మర్మం లేదు. కొంచెం జాగ్రత్తగా గమనిస్తే చాలును." అన్నాడు కృష్ణుడు.

ముగ్గురూ కృష్ణుడి వంక కుతూహలంగా చూశారు. కృష్ణుడు మందహాస సుందరవదనారవిందుడై ముగ్గురి వంకా కలయ చూసి చెప్పాడు.

"విరహజ్వరము వలన తెల్లతామరలను బోలు రాధ కన్నులు ఎర్రకలువలె నైనవి. ఆ కారణముగా రాధకు పుష్పములే కాదు అన్నియు నెర్రగా కనిపించును. అది ఆమె దోషము కాదు. ఆమెకు విరహము కలిగించిన నా దోషము. రాధారాణీ! నా దోషమును మన్నించ వలసినది." అని ప్రార్థనా పూర్వకంగా రాధ వంక చూశాడు.

శారదుడు ఆశ్చర్యంతో కనులు పెద్దవి చేసి చూస్తూ, " ఆ(!.." అని తెరచిన నోరు తెరచినట్టే ఉండి పోయాడు.

"ఇటువంటి చమత్కార మేదో చేసి మాయ చేస్తాడని అనుకొంటూనే ఉన్నాను." అనుకొన్నాడు మనస్సులో.

"ఆహాహా! ఎంతటి చాకచక్యము?" అన్నది వ్యంగ్యంగా.

"శారదా! నీ సందేహము తీరినదా ?"

కృష్ణుడి ఉద్దేశం అర్థమయింది శారదుడికి.

"చిత్తము. చిత్తము. ..... నా కడుపులో ఎలుకలు పరుగెత్తుచున్నవి. నేనూనూ పరుగు పరుగున పోయి, వాటి కింత ఆహారము వేయ వలయును. ఉద్ధవా! రమ్ము!"

శారదుడి తడబాటుకి రాధకి నవ్వు వచ్చింది కాని, ప్రయత్నపూర్వకంగా ఆపుకుంది.

"నన్ను ఒంటరిగా వదలి వెళ్ళుచున్నారా? త్వరగా తిరిగి రండు." అన్నాడు కృష్ణుడు భయము నటిస్తూ.

శారదుడు తెల్లబోయి, "ఉద్ధవా! పోనీ, మనం వెళ్ళ కుండా ఆగిపోదామా? పాపము. ఒక్కడే ఉంటాడు." అన్నాడు నెమ్మదిగా ఉద్ధవుడికి మాత్రమే వినిపించే విధంగా .

"ఒంటరిగా ఎందుకుంటాడు? ఆయన ప్రియసఖి రాధారాణి ఉన్నది గా!"

"నిజమే! కాని, ఇంతకు ముందే కదా, వెళ్ళి పొమ్మన్నాడు. ఇప్పుడేమో వెంటనే రమ్మంటున్నాడు. నా కీయన అర్థం కాదు."

"అది త్వరగా రావద్దని హెచ్చరిక." మరింత గొంతు తగ్గించి అన్నాడు ఉద్ధవుడు.

"నా మొద్దుబుర్రకు అర్థం కాలేదు సుమా!" ఒప్పుకున్నాడు శారదుడు.

ఇద్దరూ నెమ్మదిగా అక్కడి నుండి తప్పుకున్నారు.

"వెడుతున్న వారిని వెంటనే రమ్మనటం దేనికి? పానకంలో పుడకలు. నాతో ఎక్కువ సమయం గడపటం ఇష్టం లేక కాబోలు. నేనన్న విసుగు కలిగినదా? అంతే అయి ఉంటుంది. అందుకే ఉద్ధవుని, శారదుని నా వద్దకు పంపి, తాను మరొక గోపభామిని ఇంటికి వెళ్ళి ఉంటాడు." అనుకుంది.

"రాధా! ఏ ఊహావిహాయసాల్లో విహరిస్తున్నావు.?" అనునయంగా అడిగాడు కృష్ణుడు.

"....."

"రాధా! నీలో నీవే ఏదో మాట్లాడుకుంటున్నావు?" అడిగాడు కృష్ణుడు.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్వున్నది నా హృదయంలోనే కదా!"

"ఎంత తెలివిగా మాటలాడుచున్నావు?"

"నా తెలివి నీవే సుమా!"

"ముఖస్తుతులు నాకు ....." రాధ మాటను పూర్తి చేయ నీయ లేదు కృష్ణుడు.

"ఇది స్తుతి కాదు. వాస్తవం. నీవు లేనిదే నేను లేను. నా శక్తినీవే. నీవుంటేనే నేను శక్తుడను."

రాధ మూతి బిగించి ముఖం ప్రక్కకు తిప్పుకుంది. కృష్ణుడు అటువైపుకి వెళ్ళాడు.

"నా హృదయనేత్రీ! ఇంతటి అలుకకి కారణ మేమి?" ఆమె భుజం చుట్టూ చేయి వేసి, గడ్డం క్రింది చేయి పెట్టి పైకెత్తి కన్నులలో కన్నులు పెట్టి చూస్తూ అడిగాడు.

కృష్ణస్పర్శతో రాధ అలుక చల్లగా జారుకుంది. మనిషి జావకారిపోయింది. నిలబడ లేనంతగా బలహీనపడినట్టయింది. కృష్ణుడి భుజం మీద తల వాల్చి నీరసంగా,

"నీకు తెలియదా?" అన్నది.

కృష్ణుడు రెండుచేతులతోను చెవితమ్మెలను పట్టుకుని " దేవీ! ఈ దాసుడు నిరపరాధి. నమ్ము. " అన్నాడు.

"అయిన, శారదుని, ఉద్ధవుని ఇట కంపి, నీ వే ఇంటికి వెళ్ళి వచ్చు చున్నావు?" కోపఛాయల కన్న బాధ ఛాయలే ఎక్కువగా ద్యోతక మౌతున్నాయి రాధ మాటల్లో.

కృష్ణుడు తేలికగా నవ్వేశాడు. రాధకు అర్థం కాలేదు.

"అదియా నీ కోప కారణము? తగినదేలే. అత్తా కోడళ్ళకు పడదను మాట లోక ప్రసిద్ధమే! నీవును అందుకు అపవాదము కాదన్న మాట."

ఆశ్చర్యంతో రాధ " కృష్ణా! ఏమనుచుంటివి? అన్నది.

"స్తన్య మిచ్చి పెంచిన నాదు తల్లియౌ య
శోద, మమతల వారాశి, శుభచరిత్ర
నొక్క మారు కనుల గాంచి మ్రొక్కి వత్త
మనియ గాదె మానిని అటు మరలి నాను.

వృద్ధులైన తల్లి తండ్రులకు మ్రొక్కక పోయిన శుభము లెట్లు ప్రాప్తించును?" అన్నాడు కృష్ణుడు.

"నిజమే! మంచిపని చేసితివి. దక్షిణనాయకుడవు గనుక అనుమానమునకు తావు కలిగినది."

"దక్షిణనాయకుడనని చక్కగా చెప్పితివి."

"కాదా మరి! నిన్ను వలచి, ' నీవే తప్ప నితఃపరంబెరుగ' నని శరణాగతి చెందిన వారినే కదా నీవు భార్యలుగా స్వీకరించినది. ఎంత దాక్షిణ్యం!"

"నీవు వారి వంటి దానవు కాదు కదా! నేను నిన్ను కోరి వరించాను."

"అందుకేనా నన్ను వీడి వెళ్ళినది?" చిరుకోపం ప్రదర్శించింది రాధ.

"అలకలకొలికీ! విరహానంతరసమాగమము మరింత మధురమని తెలియునుగా" అక్కున చేర్చుకుంటూ అన్నాడు.

కరిగిపోయిన రాధ, " మధురాధిపతి విషయమున అఖిలమును మధురమే!" తన్మయత్వంతో అన్నది.

"కలహానంతరమున నది మధురాతిమధురము." ఆమోదించాడు కృష్ణుడు.

రాధ తన్మయత్వం గానమై వెలువడింది. కృష్ణుడు దానితో గొంతు కలిపాడు.

రాధ : "మధురం మధురం – అఖిలం మధురం
విరహం మధురం – మిలనం మధురం" ॥ మధురం ॥

కృష్ణుడు : "రాధా రాణీ – కలహం మధురం
మానం మధురం – మననం మధురం" ॥ మధురం ॥

రాధ : "వేణూద్వహ కృత – గానం మధురం
తాండవ కృష్ణుని – రాసం మధురం" ॥ మధురం ॥

కృష్ణుడు : "రాధాచరణ – లాస్యం మధురం
రాధావదన – హాసం మధురం" ॥ మధురం ॥

రాధా, కృష్ణుడు : "రాధాకృష్ణ – మిలనం మధురం
రాధాకృష్ణ – సర్వం మధురం." ॥ మధురం ॥

ఇరువురు మధురస్వప్నలోకంలో మైమరచి పోయారు. వారిని చూచి ప్రకృతి

పులకరించి, పరవశించింది. ఒక రకమైన మత్తు సర్వప్రకృతిని ఆవహించి కాలం కదలుతున్నట్టు కూడా తెలియటం లేదు.

తిరిగి వెళ్ల వలసిన సమయ మాసన్నమైనదని మిత్రుడిని హెచ్చరించటానికి వచ్చాడు శారదుడు. అడుగు పెడుతూనే మాధురీమండలం లోని తియ్యదనాన్ని అనుభూతి చెందాడు. ఇంత సమయం తానెంత కోల్పోయాడో అర్థమయింది.

"అయ్యో! మధురపదార్థముల నిచ్చట వదలి నేనెటకో ఏగితిని. ఎంతటి మూర్ఖుడను. అందుబాటులో ఉన్నవాటి విలువ తెలుసుకోలేక పోవటం మానవనైజం కదా! ఇక వీరిని వదలి వెళ్ల రాదు. ఉద్ధవుడు చెప్పినది వాస్తవము. సాక్షాత్ గోలోక రాధాకృష్ణులు కాకున్న ఈ గోకులమునకీ ప్రకాశ మెట్లు వచ్చెడిది? కృష్ణసఖుడ నైనందుకు రాధాకృష్ణుల విహారములను వీక్షించెడి అదృష్టము లభించినది. ఉద్ధవుడు బాల్య సఖుడు. అతడెన్ని లీలలు కనెనో! ఉద్ధవుడు చిన్నతనం నుండి కృష్ణభక్తిలో మైమరచి పోయే వాడట! ఇప్పటికీ భక్తుడే. కాని, తనంతటి భక్తుడు మరొకరు లేరని అహంకారమున్న దంటారు కొందరు అసూయాపరులు. భక్తున కహంకార ముండవచ్చునా? .... ఏమో? ..... మాయామానుషవిగ్రహున కెరుక."

ఎక్కడో ఒక పండుటాకు ఇక నిలువ లేక రాలి పడుతూ సిగ్గుపడింది. ఆ నిశ్శబ్దనిశీధిలో ఆ చిరుసవ్వడి విస్ఫోటన మనిపించింది.

"ఆహా! నేను కూడా ఆ మాధుర్యాన్ని అనుభవిస్తూ మత్తెక్కి పోయి నా కర్తవ్యాన్ని కూడా మరచిపోయానే!" అనుకొన్నాడు.

"వయస్యా!" శారదుడికి తన గొంతు తనకే వింతగా వినిపించింది. వాతావరణంలోని ప్రశాంతతకి, ఆనందానికి భంగం కలిగించినట్టు కనిపించింది. మరింతగా కంఠస్వరాన్ని తగ్గించి, "మిత్రమా!" అని పిలిచాడు.

శారదుడి పిలుపుకి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చారు రాధాకృష్ణులు.

కృష్ణుడు " శారదా! వచ్చుచుంటిని." అన్నాడు.

"అప్పుడే వెళ్ల వలెనా? చుప్పనాతి సూర్యుడి కెందు కంత తొందర? నీవు చంద్రవంశం వాడివని పగ కాబోలును."

"అందరు వారి వారి విధులను నిర్వర్తిస్తున్నారు . అంతే!"

"పునర్దర్శనం?" రాధ బేలగా అడిగింది.

"నా అదృష్టం పండినప్పుడు."

"అది నేనవలసిన మాట."

"ఇద్దరి మనసులు, ఆలోచనలు ఒకటే కదా!" అన్నాడు కృష్ణుడు.

"నిజమే! ఇద్దరూ అద్వైతం." అనుకున్నాడు శారదుడు.

20

కృష్ణుడిని ఒంటరిగా రాధతో వదలిన ఉద్ధవుడు తన ఇంటికి వెళ్ళాడు. వృద్ధులైన తల్లితండ్రులను చూసి నమస్కరించాడు. తల్లి దేవమ్మ తనకు మొక్కిన కుమారుని లేవనెత్తి,

"నాయనా! కుశలమే కదా! ఎంత కాలమైనదో నిన్ను చూసి? ఇంత కాలానికి మామీద దయ కలిగిందా?" అన్నది.

ఒడలంతా పుణికి, "ఎంతగా చిక్కిపోయావో! సమయానికి బువ్వ తింటున్నావా? లేదా? కృష్ణనామంతో పొట్ట నింపుకుంటున్నావా? నీ సఖుడు కృష్ణుడికి కుశలమే కదా! అతడి కుశలమే మనందరికి కుశలం." అన్నది.

అందరు క్షేమమే నన్నట్టు తల పంకించాడు ఉద్ధవుడు.

తండ్రి దేవభాగుడు కుమారుడి మూర్ధం ఆఘ్రాణించి, "ఇన్నాళ్ళకి వచ్చావా నాయనా! మధురలో అందరు కుశలమే కదా! కృష్ణుడు బృందావనానికి వచ్చాడా?" అని అడిగాడు.

"అవును నాయనగారూ! నా స్వామి ఇక్కడకు వస్తే, నేనూ వచ్చాను. వెంటనే తిరిగి వెళ్ళాలి. మీతో కొంచెం సమయం గడపాలనుకున్నాను."

"సంతోషంగా ఉంది నాయనా , ఏదో ఒక కారణంగా మమ్మల్ని చూడటానికి వచ్చావు. అంతే చాలు. క్రిష్ణయ్యకి అందరి బాధలు తెలుసు. అందుకే తనతో నిన్ను వెంట తెచ్చాడు."

"అన్నీ ఆ కన్నయ్యకి తెలుసు. అందుకే నిన్ను ఆయన చేతిలో పెట్టి ఊరకున్నాం." అన్నాడు ఉద్ధవుడి తండ్రి.

"ఉద్ధవా! బువ్వ తిందువు గాని రా! ఇంతలో ఆలస్యమైనదని వెళ్ళి పోగలవు."

"అమృతం వద్దని ఎవరంటారు. త్వరగా పెట్టమ్మా! ఎన్నాళ్లయిందో నీ చేతి అన్నం తిని." అన్నాడు. ఉద్ధవుడు పసిపిల్లవాడై పోయాడు. తల్లి వెంట వంటఇంటిలోకి వెళ్ళాడు.

ఆ పిచ్చితల్లి గబగబా కుమారుడికి పెట్టటానికి సిద్ధంగా ఏమున్నదా? అని చూసింది. బెల్లము, నెయ్యి కలిపిన పేలపిండి ఉండలు, నూవుండలు అటక మీద కుండలలో భద్రపరచబడి ఉన్నాయి. నేతి అరిసెల ఘుమఘుమ మూత తియ్యగానే ఉద్ధవుడి నాసికాపుటాలకి సోకింది. మణుగుబూరెలు, మండెగలు, లప్సికలు వాసెన కట్టిన బానలలో నిండుగా ఉన్నాయి. కారపుఅటుకుల ఘాటు హాయి కలిగించింది.

"అమ్మ ఇవన్నీ ఎందుకు సిద్ధంగా ఉంచినట్టు? తను ఎప్పుడైనా వస్తే పెట్టటానికి వెతుక్కోనవసరం లేకుండ తయారుగా ఉంచినది కాబోలు పిచ్చితల్లి. అయినా ఇవన్నీ నాకిష్టమైనవి కాదే! నా కృష్ణుడికి ప్రీతిపాత్రం. నా కూడా ఆయన వస్తాడని ఆశ కాబోలు. ఎంతటి ప్రేమ!" అనుకున్నాడు.

ఉద్ధవుడి తల్లి విస్తరి వేసి భక్ష్యాలు పెట్టి, ఉదయం వండిన దానిలో మిగిలిన అన్నంలో తియ్యని గడ్డపెరుగు వేసి, నంచుకునేందుకు బెల్లంముక్క పెట్టింది. ఉద్ధవుడికి తల్లిప్రేమ చూసి కన్నులు చెమర్చాయి. తన చిన్నతనం గుర్తువచ్చింది. కృష్ణుడి లాగా తనకు కూడా తీపి అంటే ఇష్టం. అందుకనే అన్నీ తియ్యగానే ఉండాలనే వాడు. అన్నింటిలోను బెల్లం వెయ్యమనేవాడు. చివరకు పెరుగులో కూడా బెల్లం నంచుకునే వాడు. దానిని మర్చిపోకుండా బెల్లంముక్క వెయ్యటం ఉద్ధవుడి కన్ను చెమర్చటానికి కారణం.

"నాయనా! కడుపు నిండా తిను. నీ మిత్రుడికి వేరుగా కట్టి ఇస్తానులే! కృష్ణయ్యకి పెట్టనిదే నువ్వు తినవని నాకు తెలియదా?" అన్నదామె.

"అమ్మా! నువ్వే కాదు. ఈ బృందావనంలో అందరు అంతేగా." అన్నాడు ఉద్ధవుడు.

"నిజమే! అందరికి ఆ కన్నయ్య ప్రాణం." వెనుకగా వచ్చిన తండ్రి అన్నాడు.

ఆరు బయట నులక మంచాలు వేసుకొని వెన్నెలలో పడుకుని ఉద్ధవుడు తల్లితండ్రులతో ముచ్చటిస్తూ ఉండిపోయాడు తొలిజాము వరకు. మాటలన్నీ కృష్ణుడి గురించే. వారిద్దరు కూడా ఆనందరసప్రవాహంలో ఓలలాడారు. వారింకా ఆ స్థితిలో ఉండగానే ఉద్ధవుడు తల్లితండ్రుల వద్ద సెలవు తీసుకొని కృష్ణుడితో కలసి మధుర వెళ్ళటానికి బయలుదేరాడు.

ఉద్ధవుడు రాగానే అతడిని కృష్ణుడితో వెళ్ళమని తను తరువాత వస్తానని చెప్పాడు శారదుడు. కృష్ణుడు ఉద్ధవుడు మధురా నగరానికి వెళ్ళారు. శారదుడు ఉద్ధవుడి ఇంటికి వెళ్ళాడు. ఉద్ధవుడి తల్లి శారదుని తన కొడుకుని చూసినంత ప్రేమగా చూసింది. ఆప్యాయంగా కడుపునిండా పెట్టింది.

"నాయనా! శారదా!! క్రిష్ణయ్య ఉద్ధవుడు మధురానగరానికి వెళ్ళారా?" అడిగింది.

"ఈ పాటికి చేరి ఉంటారు." సమాధాన మిచ్చాడు శారదుడు.

"మరి, నీవెందుకు వెళ్లలేదు?" ఆ తల్లి సందేహం.

"నేను మిమ్మల్ని కలవాలని ఉండి పోయాను."

"ఎందుకు?" ఆవిడ ముఖంలో ఆశ్చర్యం.

"అమ్మా! మీ రదృష్టవంతులు. కృష్ణుడికి ప్రియసఖుడు, భక్తుడు అయిన ఉద్ధవుడిని కన్నవారు. మీ దర్శనం చేసుకుందామని వచ్చాను."

"నీవు కూడా కృష్ణుడికి చెలికాడవే కదా!"

"ఉద్ధవుడు పుట్టినప్పటి నుండి కృష్ణుడి సాహచర్యం పొందిన ధన్యుడు."

"అది పుట్టినప్పటి నుండి ఉన్నది కాదయ్యా! పూర్వజన్మ సుకృతం కాబోలు, పుట్టక ముందు నుండి ఉన్నది."అన్నదా పుణ్యాత్మురాలు.

"పుట్టక ముందు నుండీనా? అదెట్లా? ...." ఆశ్చర్యంగా అడిగాడు శారదుడు.

"ఔనయ్యా! దాయాదుల పిల్లలు కదా, వరుసకి వారిద్దరూ అన్నదమ్ములే. కానీ ఏ నాడూ ఉద్ధవుడా చుట్టరికం పట్టించుకోలేదు. ఊహ తెలిసి నప్పటి నుండి,

ఎవరూ చెప్పకుండానే కృష్ణుడికి భక్తుడిగానే ప్రవర్తించాడు. అది పూర్వజన్మలో చేసుకున్న పుణ్యాలఫలం అనుకొనే వారం మేము. ”

“దానినే అదృష్టమంటారు కాబోలు.”

“ఒకసారి ఏమయిందో తెలుసా? .....”

శారదుడు తల అడ్డంగా ఉపాడు.

“అప్పుడు ఉద్ధవుడికి అయిదు సంవత్సరాలు ఉండవచ్చు .....”

ఆమెకు ఇహలోక స్పృహ లేదు. గతంలోకి జారి పోయింది. అందులో భాగమై పోయింది. మొదటిమారు ఆ పరిస్థితిని ఎదుర్కొన్నటువంటి భావోద్వేగానికి లోనయింది. అంతర్ముఖురాలై తనలో తను మాట్లాడుకొన్నాట్టుగా లో గొంతుకతో చెప్పసాగింది. ఆ కంఠధ్వని కున్న మహత్తు ఏమో గాని, శారదుడు తను కూడా ఆ సంఘటనలో పాల్గొన్న అనుభూతి పొందాడు.

అయిదేళ్ళ ఉద్ధవుడు ఉదయం చద్దన్నం మీగడపెరుగుతో బెల్లం నంచుకుని తిని ఆడుకోవటానికి వెళ్ళాడు. సుదాముడు, శ్రీదాముడు, బలరాముడు వచ్చి తీసుకొని వెళ్లారు. ‘క్రిష్ణయ్య ఏడి ?’ అని అడిగితే మిగిలిన వారితో కలిసి ఉద్ధవుడి కోసం ఎదురు చూస్తున్నాడని, తమని పంపాడని చెప్పారు. దేవమ్మకి సంతోషం కలిగింది. నందుడు వ్రజానికి పెద్ద. ఆయన కుమారుడనే కాక రూపురేఖల వల్ల గుణగణాల వల్ల కృష్ణుడు ఎత్తుచేతుల బిడ్డగా నందవ్రజంలో అల్లారుముద్దుగా పెరుగుతున్నాడు. అందరూ తమ బిడ్డల కన్న కృష్ణుడినే ఎక్కువ ప్రేమిస్తారు. తమ పిల్లలలో కూడ కృష్ణుడిని దర్శించే ఇష్టపడతారు. ఈ లోతుపాతులు తెలియక పోయినా దేవమ్మకి కూడా కృష్ణుడంటే ఉద్ధవుడికన్నా ఎక్కువ ఇష్టం. కృష్ణుడితో కలిసి ఆడుకొని వచ్చినప్పుడు కొడుకుపై ప్రేమ ఎందుకు ఎక్కువగా ఉంటుందో ఎప్పుడూ ఆలోచించ లేదు. ప్రత్యేకంగా రమ్మని చెప్పి పంపాడంటే తన కొడుకుని ఎక్కువగా అభిమానిస్తున్నట్టే కదా! ఇప్పుడు కొడుకు మీద ప్రేమ ఇబ్బడి ముబ్బడి అయింది.

“ఎప్పుడో వెళ్ళి పోయాడే. అరగడియ దాటింది.” అన్నది దేవమ్మ.

“మేము ఇటునుండి వచ్చాము. వాడు అటుగా వెళ్ళి ఉంటాడు.” అన్నాడు బలరాముడు. వాళ్ళు వెళ్ళి పోయారు.

నడిపొద్దు దాటింది. పొద్దు వాటారింది. ఉద్ధవుడు ఇంటికి రాలేదు. కృష్ణుడు ఆటలకి వెళ్ళేప్పుడు యశోదాదేవి పెరుగన్నంతో పాటు, చలిది చిక్కంలో ఎన్నో చిరుతిండ్లు కూడా పెట్టి పంపుతూ ఉంటుంది. ఎందుకంటే తన కొడుకుతో పాటు ఆడుకుంటుంటే పిల్లలలకు సమయమే తెలియదు. తను గ్రామపెద్ద ఇల్లాలు. కృష్ణుడు గ్రామపెద్ద కొడుకు. కాబోయే గ్రామపెద్ద. ఆ పెద్దరికం తను, తన కుమారుడు నిలబెట్టుకోవాలి. ఆమెను చూసి, మిగిలినవారు కూడా ఇచ్చి పంపుతూ ఉంటారు. అందువల్ల ఆకలి అంటూ ఇంటికి అన్నం తినే సమయానికి రాకపోతే ఎవరూ పెద్దగా పట్టించుకోరు.

చీకటి పడిన తరువాత దేవమ్మకు ఇంకా ఉద్ధవుడు ఇంటికి రాలేదేమా? అని ఆరాటం కలిగింది. అప్పుడు ఇరుగు పొరుగులని అడగటం మొదలు పెట్టింది. అందరూ తమ పిల్లలు ఇంటికి వచ్చారని చెప్పారు. యశోద ఇంటికి వెళ్లింది. చిన్నికృష్ణుడికి పాలబువ్వ తినిపిస్తోంది యశోద. దేవమ్మకి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"క్రిష్ణయ్యా! ఉద్ధవుడెక్కడ?"

"ఇంటికి రాలేదా?" యశోద అడిగింది.

"రాలేదమ్మా! కలిసే ఆడుకున్నారు. కృష్ణుడొచ్చి ఎంత సేపయింది?" ఆత్రంగా అడిగింది దేవమ్మ.

"మధ్యాన్నం బువ్వ తినటానికి వచ్చి, బజ్జున్నాడు. లేచి కొంచెం సేపే అయింది."

"క్రిష్ణయ్యా! నీతో వాణ్ణెందుకు తీసుకొని రాలేదు?" అడిగింది దేవమ్మ.

"వాడు మాతో ఆడుకోటానికి రాలేదు పెద్దమ్మా!"

దేవమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. దుఃఖంతో కంఠం పూడుకు పోయి, మాట పెగలలేదు. యశోదకీ బాధ కలిగింది.

'ఎక్కడన్నా ఉండి పోయాడో, ఎక్కడన్నా అలిసిపోయి పడుకుని నిద్రపోయాడో, అడవిలో దారి తప్పాడో కనుక్కోండి. వెతకండి. ఆలస్యం చేయొద్దు. మెలకువ వస్తే

భయపడతాడు – పసివాడు కదా! త్వరగా వెళ్ళి నీ పెనిమిటిని, మరికొంతమందిని వెతకటానికి పంపు" అన్నది సానుభూతిగా.

దేవమ్మ పరుగు లాంటి నడకతో ఎట్లా వచ్చిందో ఇంటికి తెలియదు. దేవభాగుడికి ఆమె ముఖం చూడగానే విషయం అర్థ మయింది. కుమారుడిని వెతకటానికి బయలు దేరాడు. ఆప్తులు కొంతమంది వెంట వచ్చారు. నందవ్రజంలో ప్రతి ఇల్లు, తోట, దొడ్డి అణువణువు వెదికారు. కానరాలేదు. గ్రామం శివార్లలో ఉన్న చిట్టడవిని సమీపిస్తుండగా ఏవో మాటలు వినిపించాయి. అటుగా వెళ్ళిన వారికి కనిపించిన దృశ్యాన్ని చూసి అందరూ అవాక్కయి పోయారు.

ఒక బాలుడిని కూర్చోపెట్టి సమస్తమైన సేవలు చేస్తున్నాడు ఉద్ధవుడు. అతడిని కృష్ణుడిగా భావించి సర్వోపచారాలు చేస్తున్నాడు.

"కృష్ణా! ఈ తియ్యని పండ్లు తిను."

అంటూ ఆ బాలుడి చేతిలో అడవి పండ్లు పెట్టాడు. అంతకు ముందు కోశాడు కాబోలు. ఆ బాలుడు వాటిని చేతిలో పట్టుకుని కూర్చున్నాడు.

"తిను! తిను!! కృష్ణా! ఆకలి వేయటం లేదా?"

"ఇప్పుడేగా తిన్నాను. చాలు." అన్నాడు ఆ బాలుడు భయం భయంగా.

"ఒక్కటి తిను! నా కోసం తిను!!" బతిమాలుతున్నాడు బాలఉద్ధవుడు.

"నేను ఇంటికి వెళ్ళాలి. మా అయ్యా, అమ్మా నా కోసం చూస్తూ ఉంటారు. ఆలస్యమైతే అమ్మ ఏడుస్తుంది. నాకు భయం వేస్తోంది. నన్ను వెళ్లనియ్యి."

ఆ పిల్లవాడికి ఏడుపు ఒకటే తక్కువ. మనుషుల అలికిడి కాగానే కూర్చున్న చదునుగా ఉన్న రాతి మీద నుండి లేచి వీళ్ళ దగ్గరకి వచ్చాడు. ఉద్ధవుడు ఆ బాలుడిని బతిమాలుతూ వెంట పడ్డాడు. అతడికి తన కోసం వచ్చిన వారెవ్వరూ కనపడటం లేదు. దేవభాగుడు కుమారుడిని ఇంటికి తెద్దామని ఎత్తుకున్నాడు. ఉద్ధవుడు "కృష్ణా! నన్ను వదలి పెట్టి వెళ్లకు. నేను నిన్ను వీడి ఉండలేను." అని ఏడవ సాగాడు.

వెంట వచ్చిన వారిలో ఒక గోపకుడు "కృష్ణుడు నందుడి ఇంటిలో ఉంటే ఈ పిల్లవాడిని ఎవరినో కృష్ణుడు అంటావేమిటి? మతి గాని చలించిందా?" అన్నాడు.

"కృష్ణుడు ఇక్కడే ఉన్నాడు. చూడు!" అన్నాడు.

ఆ గోపకుడు ఆ బాలుని వంక ప్రశ్నార్థకంగా చూశాడు. ఆ పసివాడు "నేను కన్నయ్యని" అన్నాడు.

"అదా సంగతి? అది పేరుకున్న శక్తి. కన్నయ్య అంటే కృష్ణుడని అనుకున్నాడు. అసలు కృష్ణుణ్ణి చూపిస్తే గాని వీడు మామూలుగా అవడు." అన్నాడు దేవభాగుడు.

"ఇంతకీ నువ్వెవరివిరా?" అడిగాడు మరొక గోపకుడు ఆ బాలుడిని.

వాడు వణికిపోతూ, "మాది అడివిని ఆనుకుని ఉన్న గూడెం. కుందేలు వెంట పరుగెత్తుకుంటూ ఇక్కడికి వచ్చాను. మా గూడేనికి ఎలా వెళ్ళాలో నాకు తెలియదు." అన్నాడు.

"నేను తీసుకొని వెడతానులే! భయ పడకు!!" అని ఆ బాలునితో అని, దేవభాగునితో, "నువ్వు ఉద్ధవుడిని నందుని ఇంటికి తీసుకొని వెళ్ళు." అన్నాడు ఇంకొక గోపాలుడు.

నందుని ఇంట్లో కృష్ణుడితో పాటు యశోదచేతి గోరుముద్దలు తిన్న తరువాత మామూలుగా అయ్యాడు.

కొడుకు గురించి చెపుతూ మురిసిపోయారు తల్లితండ్రులిద్దరూ. తాను కోల్పోయాననుకున్న అదృష్టాన్ని పొందిన అనుభూతి పొందాడు శారదుడు. ఇప్పుడు కృష్ణుడే కాదు ఉద్ధవుడు కూడా తనకు మిత్రు డవటం తన భాగ్యం అనుకున్నాడు.

21

శారదుడికి ఉద్ధవుడు కృష్ణుడి మనసెరిగి ప్రవర్తించటానికి ఉన్న కారణం కొంత వరకు అర్థమయినట్టు అనిపించింది. ఉద్ధవుడికి కృష్ణుడు బహిఃప్రాణం. అతడి ఆకలి, బాధ, సంతోషం ఇతడికి ఎలా అర్థమవుతాయా?అని చాలామందికి సందేహం. ఇప్పుడు శారదుడికి అర్థమయినట్టే ఉంది. తనదంటూ, తన కంటూ ఏమీ లేకుండా ఉన్నవాడు. తనలో ఏమీ లేకుండా బోలుగా మారిన వెదురు వేణువుగా మారి విశ్వమోహనరాగాలాపన చేసినట్టే ఉద్ధవుడు కూడా లోపల ఏమీ లేకుండ బోలుగా

ఉన్నవాడు. చోటు ఉంటే కదా పరమాత్మ వచ్చి అధివసించేది? మరి ఉద్ధవుడికన్న అటువంటి అర్హత ఉన్న వారు మరిక ఎవ్వరుంటారు? శారదుడి ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి.

కృష్ణుడితో ఉద్ధవుడి సాన్నిహిత్యాన్ని మొదటిమారుగా గుర్తించినది కంసవధానంతరం. కంసుని ఆదేశం మేరకు అక్రూరుడు నందవ్రజానికి వెళ్ళి బలరామకృష్ణులను వెంట పెట్టుకొని మధురానగరానికి తీసుకొని వచ్చాడు. తరువాతి కాలంలో పెద్దవా డైనప్పుడు అందరు చెప్పుకుంటూ ఉంటే విన్నాడు. బలరామ కృష్ణులు తాము మాత్రమే తమ కొరకు పంపిన రథం మీద వచ్చారట! నందుడు మొదలైన వారు, మిగిలిన గోపకులు, కృష్ణునిసఖులైన గోపబాలకులు వెనుక తమ తమ వాహనాల నధిరోహించి వచ్చారట. ఎందుకంటే రాజు ఎవరికొరకు రథాన్ని పంపాడో వారు మాత్రమే దానిని ఉపయోగించాలనే ధర్మాన్ని ఆ చిన్న వయసులోనే ఆదర్శంగా చూపాడని అందరూ మెచ్చుకున్నారట!

అంతే కాదు అక్రూరుడు తన ఇంటికి విందుకు రమ్మని ఆహ్వానిస్తే 'యదువంశ విద్వేషణుడై మదమున వర్తించు కంసుని మదమణచిన పిదప వచ్చెద' నని కర్తవ్యనిష్ఠకు ఆదర్శప్రాయు డయ్యాడు. యాదవులను చులకన చేసిన రజకుని సంహరించి, తంతువాయకునికి వరాలిచ్చి, మాలాకారుడైన సుదాముడనే పరమభాగవతోత్తముని అనుగ్రహించి, త్రివక్రను చక్కచేసి, కువలయాపీడాన్ని ఒక్క పిడిగుద్దుతో గెలిచి, ముష్టికుని, చాణూరుని సంహరించి, కంసుని వధించి, తాతగారైన ఉగ్రసేనుని పట్టాభిషిక్తుని చేసి, దేవకీవసుదేవులను చెర నుండి విడిపించాడు.

ఆ పిమ్మట బృందావనానికి తిరిగి వెళ్లలేక పోయాడు కృష్ణుడు. కృష్ణుని కంసుడు పిలిపించుకున్నాడని వ్రజంలోని వారందరు కంగారు పడుతున్నారు. వారికి తన యోగక్షేమాలు తెలియ చేయాలి. ఎవరితోనైనా వార్త పంపాలి. ఎవరితో పంపితే వారు తృప్తిపడతారు? కృష్ణుడు ఆలోచించాడు. ఎవరు వెళ్ళినా వారు తృప్తిచెందరు. కృష్ణుని చూసిన భావన ఎవరిని చూస్తే కలుగుతుందో వారిని పంపాలి. అంతే! ఉద్ధవుడిని పిలిచి తన క్షేమసమాచారం, కంసవధాది సమస్త విషయాలు గోపగోపీజనులకు తెలియ చెయ్యమని పంపాడు. అప్పుడే శారదుడికి ఉద్ధవుడు కృష్ణుడికి చాలా కావలసినవాడు, దగ్గరవాడు అని అర్థమయింది. కృష్ణుడంటే

ఆరాధనాభావం కలిగి, తన వయసు వాడే కనుక స్నేహం చేశాడు. ఎప్పటికయినా కృష్ణుడికి ఉద్ధవుడి అంత ఆత్మీయమిత్రుడు కావాలని నిశ్చయించుకున్నాడు.

❀ ❀ ❀

బృందావనానికి వెళ్ళిన ఉద్ధవుడిని గోపికలు ఏ విధంగా ఆహ్వానించారో విన్న తరువాత శారదుడికి ఉద్ధవు డంటే ఇష్టం మరీ పెరిగింది. కృష్ణుడికి చేరువ కావటానికి ఉద్ధవుడు మార్గ మవుతాడని ఆశ పడ్డాడు. ఆశ నిరాశ కాలేదు. కృష్ణుడుకి సమీపవర్తి కాగలిగాడు. ఎంతయినా ఉద్ధవుడి తత్త్వం మాత్రం అర్థం కాలేదు.

22

హంసతూలికాతల్పం మీద శ్రీకృష్ణుడు విశ్రమించి ఉన్నాడు. ఆ విశ్రాంతి ముఖంలో కనపడటం లేదు. ముఖకమలం వడలిపోయి ఉంది. కన్నులను బలవంతంగా మూసుకున్నట్టు తెలిసిపోతోంది. వేడినిట్టూర్పులు ముకుపుటాల నుండి వెలువడుతున్నాయి. పరిచారికలు నుదుటిపై పన్నీటితో అరగదీసి, పచ్చకర్పూరం, పునుగు, జవ్వాది, కస్తూరి మొదలైన పరిమళద్రవ్యాలను తగు పాళ్లలో రంగరించిన మంచిగంధపులేపనం అలదుతున్నారు నిర్విరామంగా. ఒకరు గంధం పూసిన చేయి నుదుటి మీద నుండి తీసే లోపే అది ఆరిపోయి, పొడిపొడిగా మారి, జలజలా రాలి పోతోంది. వెంటనే మరొకరు చేతి నిండా పరిమళగంధలేపనంతో సిద్ధంగా ఉంటున్నారు. ఏ మాత్రం తగ్గిన జాడ లేకపోగా, క్షణం క్షణం బాధ పెరుగుతున్నట్టు కనపడుతోంది. అందరి ముఖాల్లోనూ ఆవేదన.

కృష్ణుడి ముఖంలో కన్నా ఎక్కువ బాధ ఉద్ధవుడి ముఖంలో కనపడుతోంది. కంటి వెంట ధారాపాతంగా నీరు స్రవిస్తోంది. కృష్ణుడికి పాదసంవాహనం చేస్తున్నాడు. మధ్య మధ్యలో 'సఖా! ఉపశమనంగా ఉన్నదా?' అని అడుగుతూ నుదుటి మీద చెయ్యి వేసి చూస్తున్నాడు. మాటిమాటికి ద్వారం వైపు చూస్తూ ఉన్నాడు. అలికిడికి తలెత్తి చూసి చూశాడు. ఆస్థానవైద్యుల బృందం వస్తోంది. అమ్మయ్య! వారు వస్తే కృష్ణుడికి శిరోభారం తగ్గుతుంది అని ఆశ. ఆందోళనతో పరుగువంటి నడకతో వస్తున్నారు ప్రధానవైద్యులు. పెద్దాయన నాడి చూశాడు. ఆయన ఆందోళన

ఉపశమించింది. తేట పడింది ముఖం. ' అమ్మ! ఎటువంటి ప్రమాదం లేదు. నాడి చక్కగా ఉంది. ఎటువంటి ఒడిదుడుకూ లేదు. అసలు స్వామివారికి శిరోవేదన వచ్చే అవకాశమే లేదు. శరీరం లోని అన్ని వ్యవస్థలు చక్కగా పని చేస్తున్నాయి. ఏదో మాయ లాగా తోస్తోంది. అయినా ఎందుకైనా మంచిదని ఈ కుప్పెని ఇస్తున్నాను. మూడుచుట్లు అరగదీసి తేనెతో రంగరించి పదినిమిషాల కొకమారు నాలుకపై రాస్తూ ఉండండి." అని తన వెంట వచ్చిన శిష్యుని పిలిచి, మందుల పొదిలో నుండి ఒక చిన్న భరిణ తీసి అందులో నుండి ఆవగింజంత ఉన్న మాత్రని తీసి, ఉద్ధవుడి వైపుకి తిరిగి "దీనిని ఆవుపాలతో రంగరించి నీ మిత్రుని నాలుక పై రాయి. వెంటనే ఫలితం కనిపిస్తుంది" అని సూచించారు.

ఉద్ధవుడు లేవ బోతుండగా అక్కడే ఉన్న ఒక పరిచారిక

"ఉద్ధవయ్యా! నువ్వు లేవ వద్దు. అక్కడే ఉండు. నేను క్షణంలో తెస్తాను."

అని పరుగులాంటి నడకతో ఎప్పుడు వెళ్ళిందో ఎప్పుడు వచ్చిందో తెలియనంతట్లో బంగారుగిన్నెలో ఆవుపాలు, మందు రంగరించి నోటికి అందించటానికి వీలుగా ఉగ్గుగిన్నె తెచ్చింది. ఉద్ధవుడు అంత కంటే వేగంగా వాటిని తీసుకుని ఆ మాత్రని ఉగ్గుగిన్నెలో వేసి, కొంచెం పాలు పోసి, మధ్యవేలుతో రంగరించి, అదే వేలితో తీసి,

"మిత్రమా! కొంచెం నోరు తెరు." అని నాలికపై రాశాడు.

చప్పరించాడు కృష్ణుడు. ఉద్ధవుడు నుదుటిపై మృదువుగా రాస్తూ, ఏమాత్రమైనా ఉపశమనం కలిగినట్టు కనపడుతుందేమో నని చూస్తూ ఉన్నాడు. అదేం చిత్రమో కాని, తగ్గక పోగా క్షణక్షణం బాధ పెరుగుతున్నట్టు తెలుస్తోంది. రాజవైద్యుడు పదునైదు నిముషాలు చూసి తన మందు పని చెయ్య లేదని అర్థం చేసుకున్నాడు. అది శారీరక రుగ్మత కాదు, మనోవేదన కాని, మంత్రమో, తంత్రమో కాని అయి ఉండాలి. రోజుల బాలుడిగా ఉన్నప్పటి నుండి యశోదానందవర్ధనుడు ఈ విధమైన ఆపదలను ఎదుర్కొన్న సంగతి జగద్విదితమే! ఇప్పుడు కూడా అటువంటిదే అయి ఉండాలని ఆయన అనుమానమే కాదు నిశ్చయం కూడా. అదే మాట ఉద్ధవుడికి చెప్పాడు రాజపురోహితులని పిలిపించ మని.

ఉద్ధవుడికి దిగులు కలిగింది. మళ్ళీ ఇదేం సమస్య తలెత్తింది? దీనిని ఎలా పరిష్కరించాలి? గర్గులవారి కైనా దీని సంగతి అంతు పడుతుందా? అని తనలో తాను వితర్కించుకుంటున్నాడు. కృష్ణుడు మెల్లగా కన్నులు తెరచి ఉద్ధవుని చూచి,

"ఉద్ధవా! ఈ శిరోభారం దేనికీ లొంగదు. చిన్నప్పుడు నా కీ విధంగా బాధ కలిగినప్పుడు నా మాత యశోదాదేవి ఒక చిన్నపని చేసేది. దానితో వెంటనే బాధ ఉపశమించేది. ..... "

"అయ్యో! ఇంత వరకు చెప్ప లేదేమి? అనవసరంగా బాధ పడ్డావు. ఇప్పుడైనా త్వరగా చెప్పు. ఎందుకు ఆలోచిస్తున్నావు?"

"నవ్వుతావేమో?..."

"ఎందుకు నవ్వుతాను? నీకు తగ్గటం ప్రధానం. దాని కోసం ఏదైనా చేస్తాను."

"ఎవరైనా వింటారు. దగ్గరగా రా!"

ఉద్ధవుడు తల వైపు కూర్చుని ఉన్నాడు కదా! వెంటనే లేచి ప్రక్కకి వచ్చి కూర్చుని కృష్ణుని ముఖానికి దగ్గరగా తన ముఖాన్ని పెట్టాడు. కృష్ణుడు ఉద్ధవుడి చెవిలో నెమ్మదిగా చెప్పాడు. వింటున్న ఉద్ధవుడి ముఖంలో ఆశ్చర్యం. నమ్మశక్యం కాలేదు. కాని, చేస్తానని మాట ఇచ్చాడు. పైగా ఏ పుట్టలో ఏ పాముందో ! ఏది ఏమైనా తగ్గటం ముఖ్యం.

"సరే! వెంటనే ప్రయత్నం చేస్తాను. అప్పటి వరకు ఓర్చుకో మిత్రమా!" అని లేచాడు కృష్ణునితల్పం పక్క నుండి.

తెరల మరుగు నుండి చూస్తున్నారు కాబోలు ఒక పరిచారిక వచ్చి ఉద్ధవుడి చేతిలోని తాలవృంతం తన చేతిలోకి తీసుకుంది.

"ఉద్ధవయ్యా! నేను ఉంటాను. అమ్మగారు కూడా వస్తున్నారు. ఇప్పుడే దుర్గామాత మందిరం నుండి వచ్చారు మాత ఆశీస్సులు తీసుకొని."

"అమ్మయ్య! సమస్య తీరినట్టే. రుక్మిణీదేవి వచ్చేస్తున్నారు. ఇంత వరకు రాలేదేమా, తెలియదేమో అనుకుంటున్నాను. ఇందుకా?" మనసులోనే అనుకున్నాడు ఉద్ధవుడు.

23

ఉద్ధవుడు ఆలోచిస్తూ నడుస్తున్నాడు వ్రజభూమికి అభిముఖంగా "ఇదెక్కడి వింత? నేనెక్కడా వినలేదు, కనలేదు. ఏమో మరి! బృందావనములో ఉండగా యశోద ఇలాగే చేసేదట!. అప్పుడు నేనూ బలరామకృష్ణులతోపాటు నందవ్రజంలోను, బృందావనంలోను ఉండే వాడినేగా. నాకే మాత్రమూ గుర్తు లేదు. ఏమో! చిన్నతనం కదా! మరచి పోయి ఉంటాను. కృష్ణుని సన్నిధిలో అంతా అదొక లోకం. ఎవరి ప్రజ్ఞలూ పని చేయవాయె! ..... "

శారదుడు ఎదురయ్యాడు. ఉద్ధవుడు గమనించ లేదు. ఉద్ధవుణ్ణి చూసి "ఏమి ఉద్ధవయ్యా! ఏదో ఆలోచిస్తున్న ట్టున్నావు. అంత తొందర తొందరగా ఎక్కడికి పరుగు పెడుతున్నావు? ముఖమెందు కంత చిన్నబోయింది? ఆరోగ్యం బాగుండలేదా?" అడిగాడు.

"అవును శారదా!" ఉద్ధవుడు దిగులుగా సమాధానం చెప్పాడు.

"ఏమయింది?"

"శిరోభారం."

"వైద్యులని సంప్రదించలేదా?"

"ఆ వైభోగమూ అయింది."

"ఆస్థానవైద్యులు చాలా సమర్థులు. మన చెలికానితో చెప్పి వారితో వైద్యం చేయించ మంటావా? "

"నువ్వు చెప్పటం దేనికి? అది వారి విధ్యుక్తధర్మం. ఆస్థానవైద్యులే వైద్యం చేసి తమ వల్ల కాదని తేల్చారు."

శారదుని ముఖంలో ప్రశ్నార్థకం.

"ఇంతకీ శిరోవేదన ఎవరికి?" అడిగాడు.

"ఇంకెవరికో అయితే ఇంత ఆవేదన ఎందుకు? సాక్షాత్తూ నా బాల్యసఖుడు, నా ఆరాధ్యదైవం, నా సర్వస్వం అయిన శ్రీకృష్ణస్వామికి. "

"నా మిత్రునికి శిరోవేదనయా? ఎంతటి దుర్వార్త చెప్పితివి? ఎవరు ఏమీ

చేయలేక పోయారా? ఉపశమనమైనా కలిగించలేదా?"

"నీకు తెలియక పోవుట ఏమి శారదా?"

"నేను గ్రామాంతర మేగుటచే ఇంతటి విపత్తు కలిగినది."

"ఉంటే శిరోవేదన రాకుండా చేసే వాడవా?"

"ఏమో మరి ! నేనుండగా ఎప్పుడు రాలేదు.నువ్వు దగ్గరుండి ఉపచారం చెయ్యకుండా ఎక్కడికా పరుగు?"

"చెప్పిన నవ్వవు కదా!"

"నవ్వనులే, చెప్పు!"

"ఎవరైనా భక్తుల పాదధూళి తేవటానికి."

"భక్తుల కోసం ఎక్కడికో వెళ్లవలసిన అవసరం ఏమిటి? అంతఃపురంలో ఎవ్వరూ లేరా? ద్వారకానగరంలో అందరూ కృష్ణస్వామి భక్తులమనే చెప్పుకుంటారు."

"నీవే చెప్పావు. చెప్పుకుంటారు అని."

"కాదంటావా?"

"నేనెవరు నిర్ణయించటానికి?"

"రుక్మిణీదేవి కృష్ణభక్తురాలు కదా! పట్టమహిషిగా కన్న కృష్ణభక్తురాలి గానే అందరూ ఆమెను గౌరవిస్తారు. ఆమె పాదధూళిని తీసికొని రాక పోయావా?"

"ముందామె వద్దకే పరుగు పెట్టాను. తన పాదధూళిని తన దైవానికి ఇవ్వటమా? అని చెంపలు వేసుకుంది. కృష్ణుని శిరోవేదన తగ్గాలని మరింత తీవ్రంగా పూజలు చెయ్యటం ప్రారంభించింది."

"నా సఖుని శిరమునే తన వామపాదంతో అలంకరించిన సత్యభామాదేవికి పాదధూళి ఇవ్వటానికి అభ్యంతరం ఏముంటుంది?"

"అది బుద్ధిపూర్వకంగా చేసినది కాదట! అదంతా జగన్నాటకసూత్రధారి పన్నిన నాటకంలో భాగమట! తెలిసి తెలిసి జగన్నాయకునికి తన పాదధూళినిచ్చే పాపం చెయ్యను అన్నారట సత్యభామాదేవి గారు."

"మిగిలిన పట్టపురాణులు, పదునారువేలనూరుమంది రాజకుమార్తెలు ....." శారదుడు అర్థోక్తిలో ఆగి పోయాడు.

"రుక్మిణీ సత్యభామలు ఊరకుండగా తమ కెందుకని? ..... " ఉద్ధవుడు సాలోచనగా అన్నాడు.

"మొత్తానికి అందరూ కలిసి నా సఖుని సుఖం గురించి పట్టించుకోలే దన్నమాట."

"గౌరవం, భక్తి, ... " బాధగా అన్నాడు ఉద్ధవుడు.

"భక్తి ఉంటే పాదధూళి నివ్వ వచ్చు కదా!తమ పాదధూళి నిచ్చిన తర్వాత శిరోవేదన తగ్గకపోతే .....అన్న భయంతో ఇవ్వలే దనుకుంటాను." కించిత్ కోపంగా అన్నాడు శారదుడు.

"అది నీ అభిప్రాయం మాత్రమే సుమా! "

"ఉద్ధవా! నువ్వూ జాగ్రత్త పడుతున్నవా?"

"అంటే ..... ? "

"నీ అంతటి భక్తుడు లేడని ను వ్వనుకుంటా వని అందరూ అంటారు."

"నన్ను ఇరుకున పెట్టినా, ఆలోచింప చేస్తున్నావు శారదా! మరి, నీ సంగతేమిటి?"

"నేను కృష్ణసఖుడను. భక్తుడ నని చెప్పలేదే! మిత్రుని పాదధూళితో బాధ తగ్గుతుం దంటే ఇప్పుడే ఇస్తాను ఏ మాత్రం సంకోచించ కుండా. "

"నేనూ ముందు సఖుడనే. అంత కన్న ముందు బంధువను. ఇప్పుడు పరమభక్తుడను. నాకు కృష్ణుని క్షేమాన్ని మించి మరేమీ ముఖ్యం కాదు. అందుకే వ్రజగోపికల వద్దకు పరుగు పెడుతున్నాను."

"నేను ఉపచారం చేసి ఉపశమనం కలిగిస్తాను. నీవు ఔషధం తీసుకొని రా! ఉద్ధవా! వేగంగా రావలెను సుమా!"

శారదుడు కృష్ణుని అంతఃపురం వైపు పరుగు వంటి నడకతో వెళ్ళ సాగాడు.

ఉద్ధవుడు వేగంగా ముందుకి సాగుతూ తనలో తాను మథన పడ సాగాడు.

"నిజమే! శారదుడు అన్నట్టు నేనెందుకు పాదధూళిని ఇవ్వలేదు? భక్తుడ నని అనటమే కాని, మనస్ఫూర్తిగా అనుకోవటం లేదు కాబోలు. నా భక్తిలో త్రికరణశుద్ధి లేదా?..... ఇది నా భక్తికి శోధనా ? ....." ఆలోచనలో మునిగి యాంత్రికంగా నడుస్తున్న ఉద్ధవుడికి ఎదురు పడింది రాధ నెత్తిన కుండలతో.

"ఎవరో ఒక గొల్లవనిత ఇటే వచ్చుచున్నది. అడిగి చూస్తాను. "

"చల్లమ్మా! చల్ల! కృష్ణుడమ్మా! కృష్ణుడు! కన్నయ్యమ్మా! గోపాలుడమ్మా! గోవిందుడమ్మా! గోపీజన వల్లభుడమ్మా! కృష్ణుడో యమ్మా! కృష్ణుడమ్మా! "

"ఎవరీ గొల్లెత? ఏకంగా కృష్ణుణ్ణే అమ్మకానికి పెట్టింది? ఎంతకైనా తగుదురు ఈ గోపికలు. వారు కృష్ణుణ్ణి అమ్మనూ గలరు. కొననూ గలరు. వ్రజభామినులభక్తి ఘనమైనదని ఋషులు కూడా కీర్తించటానికి కారణ మిదే! వారి నోటి వెంట కృష్ణశబ్దం తప్ప మరొక్కటి రాదు. ధన్యులు." ఉద్ధవుడి ఆలోచనలు సాగిపోతున్నాయి.

"అచ్యుతుడోయమ్మా! మాధవుడోయమ్మా! మా.... ధవుడోయమ్మా! ..... "

"ఈమె ఎవరో రాధకు సోదరి వలె ఉన్నది. రాధ కృష్ణుని ధ్యానం చేస్తూ కాళీ కుండలో కవ్వం పెట్టి చిలికిందట! పెరుగు కుండ ప్రక్కనే ఉన్నదట! అంతటి పరధ్యానమేమిటి ? అది పరధ్యానమా? అయి ఉండదు. అది 'పరుని' ధ్యానమే!"

"ఉద్ధవయ్యా! నమస్కారం. నన్ను చూసీ చూడనట్టుగా పోతున్నావే?" పలకరింపుకి ఈ లోకంలోకి వచ్చాడు ఉద్ధవుడు.

"రాధా! నీవా? నిన్ను గుర్తు పట్టలేదు. నీ వెప్పుడూ ఇలా చల్ల నమ్మటానికి రావుగా! నీ పుట్టింటివారు, అత్తింటివారు బాగా కలిగిన వారు కదా!"

"మా పొరుగున ఉన్న రమణికి తలనొప్పిగా ఉండి నగరంలో తను ఎప్పుడూ ఇచ్చే వారికి చల్ల నిచ్చి రమ్మని పంపితే వస్తున్నాను. నీవు ఎదురుగా వస్తున్నావు. గొల్లపల్లెకేనా?"

"నిన్ను చూడగానే బయలు దేరిన పని మరచిపోయాను. నీవు తలనొప్పి అనగానే గుర్తుకు వచ్చింది. కృష్ణునికి శిరోభారముగా నున్నది. ..... "

ఉద్ధవుడి మాట పూర్తి కానీయ లేదు, నెత్తిన ఉన్న కుండను దించలేదు. కాలితో మట్టిని పైకి ఎగజిమ్మి, తన చేతితో పట్టుకొని,

"ఇంత నెమ్మదిగా చెపుతావా? ఉద్ధవయ్యా! పట్టు!"

అంటూ ఉద్ధవుడి చేతిలో ఆ దుమ్ము పోసింది.

ఉద్ధవుడు అవాక్కయ్యాడు. మొద్దుబారిపోయాడు. కదల లేదు.

"ఇంకా ఇక్కడే ఉన్నావా? పరుగు పెట్టు. కృష్ణుని లలాటముపై అలదు. మరుక్షణం తగ్గిపోతుంది. చిన్నప్పుడు యశోదమ్మ ఇలాగే చేసేది. ఇంకా నిలుచున్నావా? నా స్వామి ఎంత వేదన చెందుతున్నాడో ! ..... నగరంలోనూ, అంతఃపురంలోనూ ఎవరూ ఈ మాత్రము చేయలేక పోయిరా? ....." రాధ విలవిలలాడి పోయింది.

ఉద్ధవుడు మంత్రముగ్ధుడిలాగా గుప్పెట మూసి దానిని నుదిటిపై చేర్చి, కన్నుల కద్దుకుని, ముందుకు సాగుతున్నాడు.

"అయ్యో! నా కృష్ణుని కెంత కష్టం వచ్చింది? ఎంతమంది కళ్ళు పడతాయో నిత్యమూ. ఎవరిదో దోషపూరితదృష్టి సోకి ఉంటుంది. ఎంతయినా జనప్రియుడు. జనాకర్షణ ఉన్నవాడు.

భూమాతా! నీ ధూళికణాలే కృష్ణునికి రక్ష! యశోద చల్లనిప్రేమ నల్లనయ్యకు రక్ష! వ్రజవాసుల అవ్యాజానురాగం చల్లనయ్యకు రక్ష! రాధ ఆరాధన రాసేశ్వరునికి రక్ష! జగద్రక్షకునికి సర్వరక్ష!" అంటూ రక్షలు పెడుతూనే ముందుకి సాగింది రాధ.

"ఆహా! రాధ నా మాట పూర్తి కాకుండా కాలిక్రింది దుమ్ము ఇచ్చింది. కుండదింపటానికి సమయం పడుతుంది, అంత సమయం నొప్పి తగ్గటం ఆలస్యమౌతుంది, అంటే అంత ఎక్కువ సేపు బాధ పడతాడు అని కాలితో దుమ్మును పైకి ఎగ జిమ్మింది. ప్రేమలో హెచ్చు తగ్గులు, ఉచ్చనీచాలు ఉండవు. ప్రేమించే వ్యక్తి సుఖం ముందు కట్టుబాట్లు, నియమాలు కనపడవు. అటువంటి ప్రేమలోని అత్యున్నత స్థాయి కదా భక్తి అంటే! అందుకే భక్తిని 'పరమప్రేమ' అన్నారు. కృష్ణుని పట్ల నాకున్న ప్రేమ ఆ స్థాయికి ఎదగాలి. నా భక్తి స్థాయి ఏమిటో నా కర్థం కావటానికి, నాకు జ్ఞానోదయం కలిగించటానికి జగన్నాథుడు దీనిని కల్పన చేసి ఉండవచ్చు. ఎంతకైనా తగినవాడు. నిర్వ్యాజకరుణాసముద్రుడు. నన్ను తన పరమభక్తునిగా చేయటానికి ఇట్టి శిక్షణ ఇచ్చి నందులకు ధన్యుడను. ఆలోచనలో

పడి కృష్ణుని అంతఃపురం సమీపించినది కూడా గుర్తించక పోతిని." అనుకుంటూ అంతఃపురంలో ప్రవేశించాడు.

ఉద్ధవుణ్ణి చూస్తూనే శారదుడు "రా! ఉద్ధవయ్యా! రావయ్యా! లేదు. లేదు. అక్కడే ఉండు. నేనే వస్తున్నాను. నా సఖునికి శిరోవేదన తగ్గినది. 'ఎవరైనా గోపిక పాదధూళి నిచ్చినది కాబోలు' నన్నాడు. నిజమేనా? ఇప్పుడు విశ్రమిస్తున్నాడు. మనం విశ్రాంతికి భంగం కలిగించ కూడదు." అన్నాడు.

"అవును శారదా! రాధ నా మాట కూడా పూర్తి కాకుండానే కాలితో దుమ్ముని పైకి ఎగ జిమ్మి మరీ ఇచ్చి నన్ను వేగంగా పొమ్మని తొందర పెట్టినది."

"అదే సమయమున కిట రాధికావల్లభునకు వేదన ఉపశమించినది."

"రాధ భక్తి అనితర సాధ్యం.

భక్తి వలన కాని పని జగమున లేదు

పరమ ప్రేమ కాదె భక్తి యనగ

ప్రేమ ముదిరి భక్తి నామము దాల్చు నా

రాధన యన భువిని రాధ గాదె ."

మనస్ఫూర్తిగా చెప్పాడు ఉద్ధవుడు.

"ఉద్ధవా! నేనూ భక్తి మార్గమున రాధాదేవి శిష్యరికం చేయాలనుకుంటున్నాను." శారదుడు గంభీరంగా అన్నాడు.

"నేనూను."

" ఆఁ!..... " ఆశ్చర్యంతో తెల్ల బోతాడు.

ఉద్ధవుడు శారదుని ఆశ్చర్యం చూసి, "నిజమే శారదా! ఎన్ని జన్మలు తపస్సు చేస్తే రాధ భక్తి వంటి భక్తి లభిస్తుంది? భక్తుడ నని నా కెక్కడనో అంతరాంతరాలలో ఒదిగి ఉన్న అహంకారం వీగి పోయింది." చెప్పాడు.

"రాధాకృష్ణులకు జయము కలుగు గాక!

రాధా కృష్ణుల ప్రేమకు జయమగు గాక1!

రాధాకృష్ణుల భక్తులకు జయమగు గాక!!!"

తన్మయత్వంతో అన్నాడు శారదుడు.

"తథాస్తు!" పలికాడు ఉద్ధవుడు.

24

యమునానదీ తీరాన తమాలవృక్షపు నీడలో చెట్టు బోదె నానుకుని, నిలబడిన రాధ ఎప్పుడో జారిపోయి కూలబడి పోయింది. శరీరస్పృహ లేదు. చూపులు శూన్యంలోకి చూస్తూ ఉన్నాయి. నిరలంకారయై ఉంది. మూర్తీభవించిన దైన్యం, రాశీభూతమైన నైరాశ్యం, గూడుకట్టిన దిగులు ఒక్కచోట చేరిన రూపం అది. వివశురాలై ప్రలాపిస్తూనే ఉంది.

"కృష్ణా!
క్రాగినది విరహమున నీ కాయమిదిగొ
విరహ బాధ చేత మనము వేగినదియు
అలసితిని 'తప్పు నే నిన్ను వలచుటన్న'
వలదు! మోయగా లే నపవాద భరము.

గోపీజనమోహనా! నిన్ను చూడకుండు టెట్లు? మన కలయిక రహస్యము, స్వప్నసదృశము. దానిని కూడా నీవు ద్వారకకు చేరిన పిమ్మట దూరము చేసితివే! ఇంక జీవించుట సాధ్యమా? దేహమున ప్రాణములు నిలచుట లేదు. ఈ శరీరము ఉండి కూడా ప్రయోజనము లేదే!

నిన్ను గానని కన్నులున్నను లేకున్న
నొక్కటె యౌ గాదె చక్కనయ్య
నీ పలుకులు వినని చెవులుం డినను లే
కున్న నొక్కటి యౌను సన్నుతాంగ
నీ మేని గంధంబు నిక్క మానగ లేని
నాసి కెందులకయ్య నలిన నేత్ర
నిన్ను పొగడకుండ నున్నట్టి నాలుక
పనికి రానిది కాదె భక్త వరద

నిన్ను తలచని మనసున్న లేకున్న నొ
క్క విధ మౌను గాదె కంసవైరి
నిను గవయని జన్మ నిష్ప్రయోజన మగు
నంచు నెంతు నందనందనుండ.

మునిజనహృదయసదనా! ఫుల్లారవిందనయనా!! గోపికామదనా! కుందరదనా! దుష్టజనఛేదనా! పాపభంజనా! యశోదానందవర్ధనా! నందనందనా! .....

నీవేనా నన్ను పిలచినది? కాదు కాదు. నీవు నన్నట్లు పిలువవు. నీ ధ్యాసలో ఉండుట వల్ల ఆ విధంగా అనిపించింది. ఎవరు నన్నా విధంగా సంబోధించు చున్నారు? ఆ పలుకులు ములుకులై నా కర్ణపుటములను భేదించుచున్నవి. ఎటువంటి కర్ణకఠోరమైన సంబోధన? "రాధికా! రాయణపత్నీ!" యని. కృష్ణా ఇది నీకు తగునా? నన్నిట్లు బాధించుట న్యాయమా?

"రాయణుడు మాకు బంధువే. యశోదా దేవికి సోదరుడి వరుస. నాకు వరుసైనవాడు కూడ. మంచివాడు. నా పై మనసుపడ్డవాడు. మనువాడెద నన్నవాడు. నీ కంకిత మైన నేను, పరమపురుషున కర్పిత మైన నేను, పరపురుషుని ఛాయ నైన సహించ గలనా? స్పర్శ నైన నోర్వ గలనా? ఆతడును నా హృదయవేదన నర్థము చేసికొన్నాడు. అందుకే పాపము! అందరూ అతడిని అమాయకుడు, తెలివితక్కువవాడు అని చులకనగా మాటాడుచున్నారు. బృందావనము నందలి వారు మాత్రము కాదు సుమా! చుట్టు ప్రక్కల నున్న గొల్లపల్లెలవారికి కూడ. మా ఇరువురి పేర్లు కలిపి పలుకుట వినోదము. ఒక విధమైన రాక్షసానందము. వారి వినోదం నాకు విషాదం. రాయణు డేమనుకుంటాడో ఎప్పుడూ బయట పడలేదు. నా పేరు నీ పేరుతో తప్ప మరి యొకరి పేరుతో జతచేయట మన్నది నాకు ప్రాణసంకటముగా అనిపిస్తుంది.

"జారిణి యని పిలువ జాలి కలుగ దేమి
చులుక చేయు చుండ చూతువేల
నీకు నెచ్చెలి నని నియతిని తెలుపవా
పాపమెరుగ ననుచు పలుక రాద"

"మురళీమనోహరా! నిన్ను చూడక నాకు నిదుర లేదు. అన్నపానము లసలె

లేవు. బ్రతుకుపై నాశ లేదు. ఇక నొక్క క్షణమైనను ఆగ లేను. నిన్ను చేరుటకీ శరీరమే ప్రతిబంధకము కదా! దీని వీడిన నా అసువులు వెనువెంటనే నిన్ను చేరును.

"దేహమును వదలిన దేహభ్రాంతియు పోవు
ప్రాణములు కలియును ప్రాణములను
పరమ మగు మిలనము పరమాత్మ జీవాత్మ
లొక్క రూపు నునికి యోగమగును"

"యమునా నదిలో మునిగెద. శరీర మనే పరిమితిని అధిగమించెద. నా స్వామి ఊపిరిలో నా ఊపిరి కలసి పోయే వీలు కలుగుతుంది."

నిర్ణయంతో చిత్తంలో ప్రశాంతత కలిగింది. నెమ్మదిగా లేచింది. స్వప్నావిష్టురాలిలాగా యమున వైపుగా కదలింది.

"ఓ! కాళిందీ! శ్రీకృష్ణుని శరీరఛాయ, నీ శరీరఛాయ ఒకటే. నీ నల్లని అలలు నల్లనయ్య బాహువుల వలె తోచును. నీ చల్లని జలము నా స్వామి ప్రేమను గుర్తు చేస్తుంది. నన్ను నీలో కలుపుకో!"

కనులు మూసికొని, నీటిలోకి దిగబోయింది. కాలికి కాళిందీజలం చల్లగా తగిలింది. చెట్టు చాటు నుండి రాధ ఆవేదనను గమనిస్తున్న కృష్ణుడు "ఇక ఆలసించరాదు" అని మనస్సులో నిర్ధారించుకొని , చప్పుడు చేయ కుండా రాధను సమీపిస్తూ

"వృషభానునందనా! కృష్ణప్రియా! రాసేశ్వరీ! విశాఖా!" అంటూ ఆర్ద్రంగా పిలిచాడు.

ఒక్కొక్క సంబోధనకు వెను దిరిగి చూస్తూ, ఒక్కొక్క అడుగు వెనుకకి వేయసాగింది.

"ఇది నా చిత్త విభ్రమమా? వాస్తవమా? కల కాదు కదా! కల్ల కాదు కదా? యథార్థముగానే నందనందను డిట కేతెంచి నాడా? మురళీమనోహరా! మన్మనోహరా! ..... "

"ప్రాణప్రియా! నీకొరకు రాకుండా ఉండ గలనా ? వివశుడ నై వచ్చితి."

అప్పటి వరకు ఉన్న ఆవేదన దుఃఖంగా పరిణమించి, కన్నీరుగా ప్రవహించింది. దగ్గుత్తికతో.

"ఏల ఇంత జాగు చేసితివి? నిన్నింత కాలం విడచి నా ప్రాణములు నిలిచి ఉండవని నీకు తెలియదా?" అని ఆరోపించింది.

"ఆ కారణముననే కదా పరుగు పరుగున వచ్చింది?"

"అంతయు నసత్యము. నాపై నంతటి దయ యున్నచో నింత వేదనకు గురి చేసెడి వాడవు కాదు కదా!"

"నా మాట నమ్ము రాధా!"

"నేనెలా నమ్మ వలె? నీ దర్శన భాగ్యమపురూప మైనది. అపవాదములతో బ్రతుకు భారమైనది." ఆవేదన రాధ గొంతులో వ్యక్తమైనది.

"రాధారాణీ! నీకు గోలోకవృత్తాంతము జ్ఞాపకం లేదా? అపనిందల పాలవుతావని సుదాముడిచ్చిన శాపం అనుభవించ వలసి ఉంటుంది. అది తప్పదు."

"నిజమే! సుదాముడు కూడా నా శాపాన్ని అనుభవిస్తున్నాడు. పాపం! పుత్రసమానుడి కోపగించిన దాని ఫలితం అనుభవించటం ఇంత దారుణ మైన దని అనుకోలేదు." సుదాముడిని తలచుకోగానే రాధ మనసు బరువెక్కింది. తన విరహవేదన దాని ముందు అల్పంగా అనిపించింది.

"చేసిన కర్మను అనుభవించక ఎవరికైనా తప్పదు. దానినే దైవము అని అంటారు."

"నీవు సర్వసమర్థుడవు. తలచుకుంటే తప్పించ లేవా?"

"నాకే తప్ప లేదు కదా!"

"అదంతయు నటన. నీవు మాయామానుషవిగ్రహుడవు."

"కాని, నీ వద్ద మాత్రము నే నెన్నడూ నటన చూప లేదు. మాయ కూడా చూప లేదు."

"ఈ మాటయే నీ మోసమునకు నిదర్శనము." అంటూ ముఖం ప్రక్కకు తిప్పుకుంది రాధ. కృష్ణుడు ఆమె ముఖమును తన వైపునకు త్రిప్పుకొనటానికి ప్రయత్నం చేశాడు. రాధ మరింత బిర్రబిగుసుకు పోయింది.

"రాధా! ఇంత కోప మేల?" అనునయించ బోయాడు కృష్ణుడు.

"ఈ కోపనతో మీకు పని ఏమి?"

"ఎవరికైనను ప్రాణములతో నేమి పని యుండును?"

"ఆహా! ఎంతటి అతిశయోక్తి?"

"ప్రాణేశ్వరీ! అది స్వభావోక్తి."

"అయిన, నింత వరకు నే ఇంతి ఇంటిలో గడపి వచ్చిరో?"

"మా మేనత్త కుంతి ఇంట."

"మేనత్తతో సరసమా?"

"ఇదియు నపవాదే. నిన్ను నా మేనత్తగా భావించు లోకుల భావనను గుర్తు చేయుచున్నావా?"

"ధూర్తతకు లోపమేమియు లేదు."

"ఉన్న లోప మంతయు నీ అలంకరణముదే."

"నా అలంకరణముతో నిమిత్తమేమి?"

"శృంగార రసాధిదేవత శృంగారించుకొనక పోవుట విపరీతమే."

"ఎవరి కొరకు అలంకరించుకొన వలెను?"

"రాధ రాధగ నుండుటకు."

"నాథుడు దక్షిణనాయకుడైన నిష్ప్రయోజనము."

"దాక్షిణ్యము నీవు పెట్టిన భిక్షయే కదా!"

"మాటలకు కొదువ లేదు."

"చేతలకును కొదువ లేదు."

రాధ కృష్ణుడికి అందకుండా కొంచెము దూరముగా జరిగింది. కృష్ణుడు ఆమెకు దగ్గరగా జరిగాడు.

"మేలిమి బంగరు మేని ఛాయ గల
మేలిబంతికి మెరుగు బంగరు పుట్టము."

తన బంగారు ఉత్తరీయాన్ని రాధకు మేలిముసుగుగా అలంకరించాడు. రాధ ముడుచుకొని పోయింది.

"వన్నెల చిన్నెల కన్నులున్న కలికి
కంటికిదె కర్పూరపు కజ్జలము."

రాధ విశాలనేత్రాలకు మరింత విశాలముగా కనుపించు నటుల కాటుక తీర్చటానికి ఆమె ముఖాన్ని దగ్గరగా తీసుకున్నపుడు అతడి కన్నులలో తన ప్రతిబింబం చూసుకున్న రాధకి కృష్ణుడి కళ్ళలో తానే ఉన్నానని ఊరట కలిగింది.

"చందన గంధికి అందముగాను
చందన చర్చ చేసెదను."

తాను ప్రత్యేకంగ ఉపయోగించే చందనం రాధకు అలదాడు. ఇది అన్నింటికన్న గొప్ప సత్కారమని రాధకు బాగా తెలుసు.

"నారీతిలకము ఫాలభాగమున
కస్తూరి తిలకము కమనీయంబౌ."

ఘుమఘుమ లాడే కస్తూరి తన ఫాలభాగాన ధరించే దానిని రాధ నుదుట తీర్చి దిద్దాడు. ఏ సైరంధ్రి కూడా ఇంత బాగా తిలకము దిద్ద గలదో లేదో?అనుకుంది రాధ.

"తామర తూడుల మెత్తదనముతో
కళకళ లాడెడు కరములకివె కంకణమ్ములు."

రత్న కంకణాలు ధరింప చేశాడు. అరచేతులకి కృష్ణుడి చేతి స్పర్శ సోకటంతో సాత్విక భావోదయం అయింది.

"ఉన్నదొ లేదో సందేహము గొలిపెడు
సన్నని నడుముకి వడ్యాణం."

తన నడుముకి ఉన్న వడ్డాణం తీసి రాధకు అలంకరించే సమయంలో నడుము భాగంలో కృష్ణస్పర్శకి చక్కలిగిలి కలిగి వస్తున్న నవ్వు ఆపుకోవటం కష్ట మయింది రాధకి.

"శంఖపు ధ్వనితో నినదించెడు
కంఠసీమ కిదె శంఖుల మాల."

ఒక్కొక్కటి చిన్న చిన్న పాంచజన్యాల లాగా ఉన్న శంఖాలదండ రాధ మెడలో అలంకరించాడు.

"శ్రుతులను వినియెడు శ్రవణంబులకు
సూర్య చంద్రుల తాటంకములు."

చెవులకు మకరకుండలాలు పెట్టాడు.

"సంపగి బోలెడు సన్నని నాసిక
ముత్యపు ముక్కర ముచ్చట గొలుపు."

ముక్కెరను అలంకరించటానికి రాధ ముఖాన్ని దగ్గరగా తీసుకున్నప్పుడు కృష్ణుడి వదనగంధం రాధకు మత్తు కలిగించింది, వివశురాలయింది.

"పరచుట కేదీ తగిన పీఠము
హృదయ కమలమే పరచితిని.
చుక్కల తెచ్చీ దండల నల్లీ
తలలో ముడిచెద తరుణీ నీకు."

"ఇక్కడ అధివసించు, ఇదీ నీ స్థానం." అని గుండెను చూపించాడు. కరిగి పోయింది రాధ.

"నీ ప్రేమను మించిన నగ ఏదీ?
నీ సన్నిధి కన్న మోక్ష మేది?
కృష్ణుడె రాధకు అలంకారము
రాధయె కృష్ణుడి శృంగారం."

అంటూ స్వరం కలిపింది రాధ. కృష్ణుడు అందుకున్నాడు,

"రాధాకృష్ణుల ప్రేమవిహారం
శృంగారజగతికి ఉపహారం
భక్తిప్రపంచపు శ్రీకారం
ప్రేమజగత్తుకి ఆధారం."

25

యమునాతీరం. యమునానది పై నుండి వస్తున్న మందమారుతం చల్లగా హాయిగా ఆహ్లాదకరంగా ఉంది. బృందావనం తపోభూమి వలె పవిత్రతను సంతరించుకుంది. యుగాలుగా కృష్ణుని పాదస్పర్శ కోసం కన్నులు కాయలు కాసేట్టు ఎదురు చూసింది. ఆ అదృష్టం లభించినంత కాలం ఒక్క క్షణం వృధా కానీయక ఆ అనుభూతిని గుండెలలో భద్రపరచుకుంది. తిరిగి ఎప్పుడైనా రాక పోతాడా, అని రెప్ప వేయక నిరీక్షిస్తోంది. ఆ నిరీక్షణయే తపస్సు. దానికి ఫలితం మధ్యమధ్యలో లభిస్తూనే ఉంది. ఎప్పుడు కృష్ణుడు బృందావనానికి, నందగోకులానికి వచ్చినా యమునను పలకరించనిదే వెళ్ళడు. అంతేచాలు. మురిసి పోతుంది. దీనికి తోడు యమున భాగ్యం తరచుగా రాధారాణి దర్శనానికి నోచుకోవటం. రాసలీలలు ప్రత్యక్షంగా చూడటం. దర్శనానికి పూర్వం, దర్శన స్పర్శనాల తరువాత ఉన్న ఎదురు చూపులలో ఎంతటి మార్పు? నిజానికి అది క్రమపరిణామం. మనోవికాసం. ఆత్మ ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదగటం. ఇప్పుడు యమునకి, బృందావనానికి మహద్భాగ్యం పట్టింది. అది రాధ తపస్సుని చూడటం. రాధ తపస్సు చేస్తుంటే, ఆమె ప్రకృతి కనుక ఆ తపస్సు ప్రకృతిలో ప్రతిఫలించట సహజం. దాని శక్తి పరిసరాల మీద ప్రసరించుతుంది. ప్రభావితం చేస్తుంది.

తమాలవృక్షం క్రింద ఉన్న రాతి మీద పద్మాసనస్థయై రాధ అర్ధ నీమీలిత నేత్రాలతో తపోముద్రలో ఉంది. కాషాయవస్త్రాలు ఆమె బంగారు ఛాయకు మరింత మెరుగు పెడుతున్నాయి. శుష్కించిన శరీరం వింత కాంతితో శోభిల్లుతోంది. చక్కనమ్మ చిక్కినా అందమే నని తపోమగ్నయైన రాధను చూచే అని ఉంటారు. ఆమె చుట్టూ కాంతి వలయం పరివేష్టించి ఉంది. మనోనిశ్చలతకు సూచనగా శరీరం నిశ్చలంగా ఉంది. ఊపిరి తీస్తున్న జాడ కూడా లేదు. శిల్పము కాదనటానికి కదలుతున్న పెదవులు నిదర్శనం. అతి మంద్రస్థాయిలో ఉచ్చరిస్తున్న మంత్రం దగ్గరగా వెడితే హృదయానికి వినపడుతుంది. ధ్వనితరంగాలు మాత్రం క్షణక్షణం వాటి పరిధిని పెంచుకుంటూ విస్తరిస్తున్నాయి. ఆ తరంగాలు సోకిన ప్రతి అణువు ఆనందంతో పులకించి విశ్వనృత్యంతో అనుసంధానం అయి లయాత్మకంగా కదలుతూ పరవశించి పోతోంది.

పరిసరాలు "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" అని ప్రతిధ్వనిస్తున్నాయి. యమున అలలు "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" అని నినదిస్తూ యమునకు నది అనే పేరుని సార్థకం చేస్తున్నాయి.

ఉద్ధవుడు రాధను సమీపించి శిలావితర్దిక ముందు సాగిలపడి మ్రొక్కి,

"మాతా! నమోస్తు!" అన్నాడు.

రాధ కనులు తెరవకుండానే "శుభం భూయాత్" అన్నది.

"తల్లీ! ఉద్ధవుడు నమస్కరించుచున్నాడు."

"నీకును, నీ స్వామికిని కుశలమా?"

"సర్వం కుశలమే! అమ్మా! నీవేమి? ఈ వేషమేమి? ఈ కాషాయవస్త్రాలు, ఈ జడలు కట్టిన కేశపాశము, ఈ బూదిపూతలు, ఈ సన్న్యాసివేషము ..... మీకుచితమా?"

"సన్న్యాసము అంత తేలిక కాదు. సన్న్యాస మంటే చక్కగా ఉంచటం. నేను, నా వారు – అంటే అహంకార మమకారాలకి పరిమిత మైన ప్రేమను విస్తరింప చేసి, విశ్వమంతా వ్యాపించే విధంగా ఉంచటమే సత్ న్యాసం. అదే సన్న్యాసము."

"మరి, ఈ కాషాయాంబరము...."

"నాయనా! ఎరుపు రాగానికి వలె కాషాయము స్వచ్ఛమైన, విశ్వవ్యాప్తమైన ప్రేమకు సంకేతం. ఇది విశిష్టమైన రాగం. అదే వైరాగ్యం."

"అమ్మా!"

"ఉద్ధవా! యోగేశ్వరుడైన శ్రీకృష్ణపరమాత్మతో సంయోగమున కిదియే ఉత్తమోత్తమ మైన మార్గము." కన్నులు తెరవకుండానే సమాధానము చెప్పింది.

"తల్లీ!""

"ఈ పాంచభౌతికశరీరమున కెన్నియో పరిమితులు. ఈ దేహభ్రాంతినీ, శరీరస్పృహనూ అధిగమించిననే జీవేశ్వరైక్యము. యోగమన నదియేకదా!"

"శరీరానికి, ఆత్మకి మధ్య మనస్సు ఉన్నది కదా!"

"మనస్సు శరీరము నాశ్రయించుకొనియే ఉంటుంది కదా! శరీరస్పృహను దాటితే అది కూడ నశిస్తుంది. దేహమే నేను అనే భ్రమ తొలగటానికి శరీరాన్ని అదుపులో ఉంచుకోవాలి. చేసే సాధన అంతా అది సాధించ టానికే. అప్పుడు నేను ఈ శరీరం కాదు, ఈ శరీరం నాది అని అర్థం అవుతుంది."

"ధన్యోస్మి ! మాతా! ధన్యోస్మి! సందేహ నివారణ మైనది."

"దేహభ్రాంతి ఉన్నంత కాలము సందేహమును వెన్నంటియే యుండును."

"సద్గురుమూర్తికి నమోవాకాలు." మూర్ధముపై అంజలి ఘటించి పయనమైనాడు ఉద్ధవుడు. రాధ అంతర్ముగ్ధయై, జపతత్పర యైనది. ఆమె తపోనిష్ఠ కొనసాగుతూ ఉంది.

గృహోన్ముఖుడైన ఉద్ధవుడి మనస్సులో ఎన్నో భావాలు. "రాధ తపస్సు చెస్తోందని కృష్ణుడికి తెలియదా? సర్వజ్ఞుడికి తెలియ కుండా ఎట్లా ఉంటుంది? తెలిసే చూసి రమ్మని నన్ను పంపించాడా? తెలిస్తే ఎందుకు పంపినట్టు? ఆమె నుండి నేను పొంద వలసిన శిక్షణ మిగిలి ఉన్నదని కాబోలు. నేను చెప్పిన దానిని బట్టి వచ్చెద నన్నాడు. వంద సంవత్సరాల వియోగము తరువాత సమాగమమునకు రాధను సిద్ధము చేయవలె నని అయి ఉంటుంది. కాని, రాధ కృష్ణుడు భావించినట్టు లేదే! భౌతిక కక్ష్యను దాటి, అలౌకిక కక్ష్యలకు చేరుకొన్నది. ఈ మాట శ్రీకృష్ణపరమాత్మకు తెలిసే ఉండి ఉంటుంది. ....."

"ఉద్ధవా! ఏమిటి అలా వెడుతున్నావు మమ్మల్ని గమనించకుండా. ఏమయింది?" శారదుని పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చాడు ఉద్ధవుడు. శారదుడి ప్రక్కనే కృష్ణుడు. ఉలిక్కి పడ్డాడు? తను చెప్పిన దానిని బట్టి వస్తానన్నాడు కదా! అప్పుడే ఎందుకు వచ్చినట్టు? అదే మాట అడిగాడు.

"కృష్ణా! అప్పుడే అరుదెంచితివేమి?"

"మన సఖుడు రాధావిరహము నోర్వ లేక పోయినాడు."

"ఒక శతాబ్దం ఎడబాటు సహించిన వాడవు కొన్ని ఘడియలు ఆగ లేక పొతివా?" అన్నాడు.

"ఒక్క క్షణం కూడా ఆగ లేక పోయాను." కృష్ణుడి గొంతులో ఎప్పుడూ కన పడని విహ్వలత.

"రాధ తపోనిష్ఠలో ఉన్నదే?" అన్నాడు ఉద్ధవుడు.

"అది సిద్ధించే సమయం ఆసన్న మయింది. అందుకే ఈ తొందర."

శారదుడి ముఖంలో ఆశ్చర్యం.

"దానిని గాంచు భాగ్యమును నాకును ప్రసాదింపుము."

"నీ వీ సమయమున కిట నుండుట కదియే కారణము."

"కృష్ణా! ధన్యోహమ్! ధన్యోహమ్!"

"నీ సఖుడ నైనందులకు కృష్ణా! ఆ అదృష్టం నాకును లభిస్తోంది." శారదుడు ఉత్సాహంగా అన్నాడు.

"నిజమే! ఈ అపురూప ఘట్టమును చూడ గలుగుట అదృష్టమే! ఈ పవిత్ర ఘట్టమును దర్శించటానికి బ్రహ్మాది దేవతలును వేంచేస్తున్నారు.'" ఆకాశం వంక చూశాడు.

ఉద్ధవుడు, శారదుడు ఆకాశం వంక చూసి చేతులు జోడించారు.

రాధ స్వప్నావిష్టురాలి వలె లేచి నిలబడింది. యమున వైపుగా అడుగులు వేస్తోంది.

"శ్రీకృష్ణా! రాధికాప్రాణాధినాథా! సర్వాంతర్యామీ! సర్వస్వరూపా! సర్వాత్మా! సర్వశక్తిమయా! సర్వవ్యాపీ! సర్వాధారా! సర్వేశా! ...." తరువాత మాటలు వీరికి వినపడ లేదు. ముందుకి వెడుతున్న ఉద్ధవుడిని, శారదుడిని వారించాడు కృష్ణుడు.

మంత్రబద్ధభుజంగం లాగా ఎటూ చూడకుండా, లక్ష్యం వైపు దూసుకుని వెడుతున్న బాణం లాగా నేరుగా నడిచింది రాధ.

"నల్లనయ్యా! నీ దేహము ఈ నీలాకాశమైనది. నీవే పువ్వులలో నవ్వు చుంటివి. ఈ వాయువు జీవులకు ప్రాణప్రదాత యగుట నీ నిశ్శ్వాస మగుట చేతనే కదా! ప్రాణములు నిలచి యుండుట నీ వేణు గానముననే! సమస్తమున వ్యాపించి యున్న నిన్ను చేరుట ఎట్లు? ఎక్కడనో ఒక్క చోట ఉన్న చేరవచ్చును. అంతటా ఉంటే ఎక్కడకని వెళ్ళటం కుదురుతుంది? లోపల, బయట, అంతట నీవే దర్శన మిచ్చు చుంటివే!

"విశ్వ మంత నిండి వేయి తలలు కాలు
చేతులు నయనముల చిత్రముగను
విస్తరించిన నిను వేయి నోళుల శేషు
డైన పొగడ చాల డౌను గాదె."

"శ్రీ కృష్ణ ప్రభూ! నిను చేరు విధ మేమి? బాహ్యమున నున్న చేర వచ్చును. నీవు అంతరంగమున నిండి యున్నావు. నా అంతరంగమును చేరు టెట్లు? బహిరంతరంగముల నీవే నిండిన నాకు అస్తిత్వ మేది? నేనెక్కడ? నేను లేనే! నేను లేనప్పుడు ఈ నేను లేను అన్న భావన ఎక్కడిది? ఈ భావన కూడా అంతరించ వలెను సుమా! ..... ప్రభూ! నీ పాదములే శరణు."

అక్కడనే ఆగి పోయి వంగి నేలపైన చేతులు ఆనించి నమస్కరించి కన్నుల కద్దుకొంది. తనున్న చోటునే ఉండి రాధ నమస్కారాలని స్వీకరించాడు జగన్నాథుడు అరమోడ్పు కన్నులతో ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ.

"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అన్న పరమాత్మ తత్త్వాన్ని అనుభవిస్తోంది రాధ. ధన్యాత్మురాలు." అన్నాడు ఉద్ధవుడు ఆనందంతో కన్నులు చెమరించగా.

రాధ కూర్చున్న చోటు నుండి కదలక, అదే భంగిమలో ఉండి పోయింది.

"శ్రీ కృష్ణ శ్శరణం మమ. శ్రీ కృష్ణ శ్శరణం మమ. శ్రీ కృష్ణ శ్శరణం మమ. శ్రీకృష్ణ చరణాన్ శరణం ప్రపద్యే. గోపీజన వల్లభ చరణాన్ శరణం ప్రపద్యే."

ఒక దానివెంట మరొకటి మంత్రాలు సాగుతున్నాయి. శరణులు నడుస్తున్నాయి. కృష్ణుడు వాటిని స్వీకరిస్తున్నట్టు ముఖంలో ఆనందం తెలుపుతోంది. ఉద్ధవుని

ముఖంలోను, శారదుని ముఖంలోను ఆనందం, ఆశ్చర్యం ఒకదానిని మరొకటి తోసుకొని వస్తున్నాయి.

"కృష్ణా! ఎటు పోవుచుంటివి?" రాధ ఆక్రోశిస్తున్నది.

"నా ప్రక్కనే ఉన్నాడు కదా, కదలక, మెదలక." అన్నాడు శారదుడు నెమ్మదిగా.

రాధ లేచి నిలబడింది. పరుగుపెట్ట సాగింది.

"శ్రీకృష్ణా! అగుము! ప్రాణనాయకా! నిలువుము! నా ప్రాణములు నిలుపుము!"

"యమున వైపునకు పరుగిడుచున్నదే!" శారదుడు విలవిలలాడి పోయాడు.

"కృష్ణా! నన్ను నీ అక్కున చేర్చుకో! నన్ను నీలో కలుపుకో!"

"అయ్యో! రాధ యమునలో దూకింది. ఉద్ధవా! కృష్ణా! రండు రక్షింతము!"

"వలదు శారదా! మన ప్రభువు సంకల్పానుసారమే అన్నియు జరుగు చున్నవి. యమునా నది నల్లదనం చూచి కృష్ణు డని తలచినది." అని వారించాడు శారదుడిని ఉద్ధవుడు.

"అయిన కృష్ణుడిలో లీనమైనట్టు భావించిన దందువా?" శారదుడి సందేహం.

"జరిగిన దదే!"

కృష్ణుడు కనులు మూసుకుని స్థాణువులాగా ఉన్నాడు.

ఉద్ధవుడు, శారదుడు చూస్తూ ఉండగా యమునలో నుండి రాధ ప్రాణములు జ్యోతి రూపంలో వచ్చి కృష్ణుడి హృదయంలో లీనమయ్యాయి. కృష్ణుడి ముఖంలో ఇంతకు ముందు లేని కాంతి ప్రస్ఫుటంగా కనపడుతోంది. అంతరిక్షం నుండి ఈ ఘట్టాన్ని విలోకించిన నారదుడు, బ్రహ్మాది దేవతలందరు యమునా తీరానికి దిగి వచ్చి కృష్ణుడికి అంజలి ఘటించారు.

కృష్ణుడు అభయముద్రతో వారి నందరను

"రాధ చరితను భక్తి మీరంగ కనిన
వారి కిహపరసౌఖ్యముల్ భక్తి కలుగు
రాధతో నను గనిన వారలకు గలుగు

నిత్యగోలోకవాసమ్ము నిజము సుమ్ము."

అని శీర్వదించాడు.

నారదుడు మంగళా శాసనము పలుకుతుంటే ఉద్ధవుడు, శారదుడు గొంతు కలిపారు.

మంగళకరులకు మంగళము
మంగళాకారులకు మంగళము
మంగళ మూర్తులకు మంగళము
మాతా పితలకు మంగళము
జగద్రక్షకులకు మంగళము
రాధాకృష్ణులకు మంగళము.





డా॥ ఎన్. అనంతలక్ష్మి

తల్లిదండ్రులు	:	శ్రీమతి గాయత్రి, శ్రీ నందివాడ వేంకట సీతారామారావు
జీవిత భాగస్వామి	:	శ్రీ పెద్దాడ ఉద్ధవకుమార్
జన్మస్థలం	:	తాడంకి, కృష్ణాజిల్లా
పుట్టిన తేది	:	23.07.1950
విద్యాభ్యాసం	:	12వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాడంకి. బి.యస్సి. - మేరిస్టెల్లా కళాశాల, విజయవాడ, ఎం.ఏ. - ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు. పి.జి.డిప్లామా (సంస్కృతం) ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు. పి.జి.డిప్లామా (థియేటర్ ఆర్ట్స్) ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఎం.ఫిల్. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్. పిహెచ్.డి. ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
వృత్తి	:	45 సంవత్సరాల ఉపన్యాసక వృత్తి.
ప్రవృత్తి	:	రచనా వ్యాసంగం, విమర్శక వ్యాసాలు, కథలు, గేయాలు, వీడియో, దూరదర్శన్, ప్రముఖ దేవాలయాలలో ప్రవచనాలు.
ప్రచురిత గ్రంథాలు	:	తెలుగు సాహిత్యంలో రాధాతత్వము, స్వర్ణభారతి-గేయ సంపుటి, సబల-కథల సంపుటి, స్వర్ణభారతి - ఆడియో క్యాసెట్, శ్రీనాథుని కావ్యాలలో భోజన వర్ణన, విష్ణువిలాసిని చారిత్రక నవల, శ్రీపతి శతక వ్యాఖ్యానం, విద్యాదాయినీ సరస్వతీవ్రతం, శ్రీమద్ భాగవతం 11, 12 స్కంధాల వ్యాఖ్యానం, బండారు అచ్చమాంబ, తెలుగు వారి నోములు వ్రతాలు సంప్రదాయం-శాస్త్రీయత, స్త్రీ సూక్తం.
ప్రచురణకు సిద్ధం	:	వండుగలు పరమార్థాలు, సంస్కారాలు ఆవశ్యకత, శ్రీమద్రామాయణ ఉపాఖ్యానాలు - సార్వకాలికత, జ్ఞాన ప్రసూనం - శ్రీ కాళహస్తీశ్వర శతక వ్యాఖ్యానం, సౌందర్యలహరి, అమృతవర్షిణి సౌందర్యలహరి వ్యాఖ్యానం, అన్నమయ్య సంకీర్తనలు-భక్తి సర్వస్వం.

చిరునామా :

ఇం.నెం. 1-9-327/1, రాంనగర్ గుండు, విద్యానగర్, హైదరాబాద్ 500 044.

సెల్ : 9949198141